ఆదివారం
సాహిత్యానికి పెద్దపీట
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్
fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-10-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 251 పేజీలు: 10+4 వెల: 8.00



పప్పు దినుసుల సాగు మరింత పెరగాలి: ప్రధాని
ట్రంప్ వయసు..79 ఆయన గుండెకు.. 65!
5


# సుప్రీంకు అప్పీలు!




## రిజర్వేషన్ల జీవో 9 అమలు కోరుతూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుకు నిర్ణయం

### సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వితో మంతనాలు

### ఎన్నికల ప్రక్రియ మొదలైనందున కొనసాగించాలని వినతి

### జూమ్ సమావేశం నిర్వహించిన కాంగ్రెస్ నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు11:** బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లనుంది. జీవో 9 అమలు చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై కాంగ్రెస్ నేతలు శనివారం జూమ్ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగిన జూమ్ సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది,రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వితో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. ఇటీవల

>>2

## ఎన్నికల నిర్వహణకు మేం సిద్ధమే..

### ఏ చర్యలు తీసుకొంటున్నారు?

### రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం లేఖ




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు11:** బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఆర్డర్ కాపీ మేరకు జీఓ 9, 41, 42లపై స్టే ఇవ్వడంపై రాష్ట్రఎన్నికల సంఘం

>>2

## ఐకానిక్ భవనంగా టి-స్క్వేర్



శనివారం హైదరాబాద్‌లో టి- స్క్వేర్‌పై సమీక్షలో సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

### ఐటి కంపెనీలకు దీటుగా నిర్మాణం

### నవంబరు ఆఖరుకు ప్రాజెక్టు పనులు మొదలు

### ఎఐ హబ్, ఇతర ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు11:** హైదరాబాద్‌నగరంలో ఐటీ కంపెనీలకు కేంద్రమైన రాయదుర్గం ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయంగా టీ-స్క్వేర్ నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా ఉండాలని, నవంబర్ నెలాఖరు నాటికి ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని చెప్పారు. శనివారం ముఖ్యమంత్రి సిఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఏఐ హబ్, టీ-స్క్వేర్ తదితర అంశాలపై సమీక్షించారు. హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన టీస్క్వేర్ ప్రాజెక్టుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. టీ-స్క్వేర్ నగరంలోనే ఒక ఐకానిక్ భవనంలా ఉండాలని, అందుకు అనుగుణంగా డిజైన్, నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. టీ-స్క్వేర్ డిజైన్ పర్యాటకులను ఆకర్షించడం, రెస్టారెంట్లు, వ్యాపారం వంటి అంశాలు పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు.ఆ ప్రాంతం 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదేశాన్ని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, రంగురంగుల డిజిటల్ ప్రకటనల ద్వారా ప్రపంచ స్థాయి డిజిటల్ డిస్‌ప్లే తో రూపొందించాలని చెప్పారు. యాపిల్ లాంటి ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు అక్కడ వ్యాపారం నిర్వహించేలా ఉండాలని పేర్కొన్నారు. పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాహనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు ఉండాలని చెప్పారు. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, వాణిజ్య కార్యకలాపాలతో పాటు కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా టీ-స్క్వేర్ రూపుదిద్దుకోవాలి అని చెప్పారు. హైదరాబాద్‌లో ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఎఐప్రాజెక్టులు, స్టార్టప్‌లు, సెంటర్లను ఒకేచోట కలిపి, ప్రపంచ ఎఐ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ హబ్‌లతో భాగస్వామ్యం చేసేందుకు ఈ హబ్ ఉపయోగపడాలని స్పష్టం చేశారు. సిఎం వద్ద జరిగిన

>>2



## పక్కదారిన రూ.18 వేల కోట్లు

### పిఎం కిసాన్‌లో 2.40 కోట్ల మంది అనర్హులు

### ఎరువుల సబ్సిడీలో రూ.6.800 కోట్లు స్వాహా

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాత వార్త:** వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై కేంద్రం నజర్ పెట్టింది. నకిలీలు, అనర్హుల కారణంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 18 వేల కోట్ల రూపాయల మేర సంక్షేమ పథకాల సొమ్ము పక్కదారి పడుతున్నట్లు కేంద్రం అంచనా వేసింది. ఇటువంటి వారిని ఏరివేసేందుకు చర్యలు చేపట్టింది. పలు సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి లబ్దిదారుల వెరిఫికేషన్ నిమిత్తం

>>2

## నీటిపారుదలకు ఇక సోలార్ విద్యుత్

### చేవెళ్ల-ప్రాణహిత పనులు పునరుద్ధరణ

### తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి డిపిఆర్‌లు: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,అక్టోబరు 11,ప్రభాతవార్త:** నీటపారుదల ప్రాజెక్టలకు సోలార్ విద్యుత్ వినియోగించేందుకు కసరత్తు ప్రారంభించామని నీటిపారుదల శాఖా భూములలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు త్వరలో చేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖా ఇంజినీర్లతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పాత ప్రతిపాదన ప్రకారం తుమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లి ద్వారా చేవెళ్ల కు నీరు అందించే యోచన చేస్తున్నామన్నారు.తుమ్మిడిహట్టి నుండి 71 కిలోమీటర్ల మేర దూరం ఉన్న కాల్వపనులలో ఇప్పటికే 45 కిలోమీటర్ల దూరం పూర్తి అయ్యాయాన్నారు.71 కిలోమీటర్ పాయింట్ నుండి అంటే మంచిర్యాల జిల్లా మైలారం గ్రామ సమీపం నుండి నీటిని తరలించ డానికి రెండు మార్గాలను పరిశీలిస్తున్నామన్నారు.అందులో మొదటిది పాత ప్రణాళిక ప్రకారం మైలారం నుండి ఎల్లంపల్లి రిజర్వాయర్ వరకు దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో ఒక లిఫ్ట్ అవసరం ఉంటుందని గుర్తించామన్నారు.రెండోది అదే పాయింట్ నుండి సుందిళ్ల బ్యారేజ్ వరకు సుమారు 55 కిలోమీటర్ల దూరం వరద కాలువ ద్వారా నీటిని తరలించే అవకాశం ఉందన్నారు.రెండు మార్గాలు కుడా ఆర్థికంగా భారం కాకుండా తక్కువ ఖర్చుతో అయ్యేలా అధికారులు ప్రతిపాదించారంన్నారు.అధికారుల ప్రతిపాదనలకు ఆయన స్పందిస్తూ రెండు పద్దతులలో డి.పి.ఆర్ లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఇదే విషయంపై వారం రోజుల్లో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. సవరించిన డి.పి.ఆర్ లను అక్టోబర్ మాసంతానికి సిద్ధం చేయాలన్నారుఅదే విదంగా నీటిపారుదల శాఖకు చెందిన భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రారంభించాలన్నారు.ఇక పై విద్యుత్ తో నడిచే నీటిపారుదల శాఖా ప్రాజెక్టులకు సోలార్ విద్యుత్ ను వినోయోగించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఎత్తిపోతల పథకాలకు సోలార్ విద్యుత్ ను వినియోగించడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించు కోవొచ్చని ఆయన చెప్పారు. అందుకు నీటిపారుదల శాఖా భూములలో సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేయడం ద్వారా ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించుకోవొచ్చన్నారు.అదే విదంగా దేవాదుల ప్యాకేజ్ 3,కల్వకుర్తి ప్యాకేజీ 29,పాలమూరురంగారెడ్డి ప్యాకేజ్ 7,ఎస్.ఎల్.బి.సి టన్నెల్ తదితర ప్రాజెక్టు పనులపై ఆయన సమీక్షించారు.ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణకు గాను

>>2



## చైనాపై ట్రంప్ సుంకాల బాంబు

### అదనంగా 100% టారిఫ్‌లు

### నవంబరు 1 నుంచి అమలులోకి..

2



## మంత్రుల మధ్య మరో వార్!

### మేడారంలో 'టెండర్ వివాదం'!

### మళ్లీ తెరపైకి మంత్రి సురేఖ

### రూ.71 కోట్ల పనులలో మంత్రి పొంగులేటి జోక్యంపై కొండా మురళి దంపతులు హైకమాండ్‌కు ఫిర్యాదు






## కల్తీ మద్యం కేసులో బిగుస్తున్న ఉచ్చు

### జయచంద్రారెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం

### బెంగళూరులో ఎక్సైజ్ అధికారులు మకాం

### నిందితుల కస్టడీ పిటిషన్ 13కు వాయిదా

**విజయవాడ,అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం తయారీ కేసులో మరింత మందిని నిందితులుగా చేర్చే అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో ఎ2గా ఉన్న కట్టా రాజు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితుల సంఖ్య ఇప్పటికే 23కి పెరిగింది. ఈ సంతఖ్య మరింత పెరగొచ్చని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఎ-17గా జయచంద్రారెడ్డి,ఎ-18గా గిరిధర్‌రెడ్డిల పేర్లనూ కేసులో చేర్చారు. రిమాండ్‌లో ఉన్న నిందితులను విచారించడానికి కస్టడీకి ఇవ్వాలంటూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్ళపల్లె కోర్టులో దాఖలు చేసిన పిటీషన్ సోమవారానికి వాయిదా పడింది. ఇప్పటికే తమ అదుపులో ఉన్న కీలక నిందితుడు ఉ-1 జనార్ధన్‌రావు నుంచి పోలీసులు వివరాలు రాబట్టే ప్రయత్నం ఏస్తున్నారు. కీలక నిందితుడు,టిడిపి నుంచి సస్పెండైన జయచంద్రారెడ్డి అరెస్ట్‌కు ఎక్సైజ్ అధికారులు రంగం సిద్ధం చేశారు. బెంగుళూరులో ఆయన ఉంటున్న స్థావరాలను గుర్తించారు. ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్ళాయి. జయంచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డి కూడా లొంగిపోవడానికి సిద్దమైనట్లు తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన జనార్ధన్‌రావు జయచంద్రారెడ్డికి స్నేహితుడు కావడంతో ములకలచెరువుకు వచ్చిన సమయంలో పలువురితో పరిచయం పెంచుకున్నారు. వీరి ద్వారా నకిలీ మద్యం తయారుచేసి నియోజక వర్గంలో వైన్‌షాపులు బెల్ట్ షాపుల ద్వారా విక్రయించినట్లు అధికారులు అంచనాకు వచ్చారు.జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేస్తున్న అన్బురాసు(బాబు) బ్యాంకు ఖాతా నుంచి లావాదేవీలు జరిగాయని గుర్తించారు. ఏ-2గా ఉన్న కట్టా రాజు వాంగ్మూలం ఆధారంగా బాబుపై పోలీసులు నిఘా ఉంచారు. నిందితులు బాబు,అష్రఫ్‌లను ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారిస్తే...మరికొందరు పాత్రధారుల పేర్లు వెల్లడయ్యే అవకాశముంది.ఈ కేసు నిందితులో ఒకరైన చైతన్యబాబు పీటీఎం లోని ఆంధ్రా వైన్స్ దుకాణం మేనేజర్‌గా పనిచేశారు. ఆంధ్రా వైన్స్‌ను కట్టా సురేంద్రనాయుడి నుంచి స్వాధీనం చేసుకున్న గిరిథర్‌రెడ్డి...చైతన్యబాబును మేనేజరుగా నియమించుకొని వ్యవహారాలు నడిపారు.బెంగుళూరుకు చెందిన బాలాజీ,హైదరాబాద్ వాసి నకిరేకంటి రవిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన అబ్కారీ పోలీసులు...వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. నిందితుల జాబితాలో కొత్తగా పేర్లు చేర్చుతూ పోలీసులు తంబళ్ళపల్లె కోర్టులో మెమో దాఖలు చేసినట్లు కీలక సమాచారం!

## ఫార్ములా రేస్‌తో హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు

### - కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు11:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి. రామారావు మరోసారి తెలంగాణ ఆవిష్కరణల ప్రస్థానాన్ని జాతీయ వేదికపై చాటిచెప్పారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించిన ఫార్ములాఈ రేస్ నిర్వహణ గురించి ప్రస్తావించారు. తాము నిర్వహించిన ఫార్ములా ఈ రేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై

>>2




అమితాబ్ బచ్చన్ 83వ పుట్టినరోజు సందర్భంగా శనివారం కోల్‌కతాలో ఆయన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అభిమానులు

# సుప్రీంకు అప్పీలు!

>> హైకోర్టులో ప్రభుత్వం తరపున సింఘ్వీ వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనుంది. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని కోరనుంది. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించనుంది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా జనాభా గణాంకాలపై సర్వే నిర్వహించి, బీసీ జనాభా 57.6 శాతం ఉన్నందున 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించామని, దీనికి అనుగుణంగా రిజర్వేషన్‌ల పరిమితిని సవరిస్తూ చట్టం తీసుకువచ్చిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లనుంది. హైకోర్టు తీర్పు కాపీ శుక్రవారం అర్ధరాత్రి వచ్చింది. ఒకవేళ ఆ కాపీ వచ్చినా రాకపోయినా, మినహాయింపు కోరుతూ అత్యవసరంగా స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టును కోరే అవకాశాలు ఉన్నాయి. సుప్రీంకోర్టుకు వెళ్లడమా? లేదా బిల్లులు క్లియర్ చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు వేచి చూడటమా? లేదా పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇవ్వడమా అనే మూడు ఆప్షన్లపై ప్రభుత్వం చర్చించినట్లు తెలుస్తోంది. అయితే చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లడమే మేలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మరోవైపు రిజర్వేషన్

**జీవో 9ను సవాలు చేస్తూ పిటిషన్**

దాఖలు చేసిన బి.మాధవరెడ్డి, మరొకరు సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేశారు. రిజర్వేషన్‌లకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎవరైనా అప్పీలు దాఖలు చేస్తే తమ వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని అభ్యర్థించారు.

**రిజర్వేషన్లు 50శాతం పెరిగితే కోర్టులు ఒప్పుకోవు**

**సుప్రీంకోర్టుకు వెళ్లినా లాభం లేదు: జేడీ లక్ష్మీనారాయణ**

హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి, ఎన్నికల ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతించాలని ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరనుంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ కూడా మొదలైన తరుణంలో ఎన్నికల ప్రక్రియలో హైకోర్టు జోక్యం చేసుకోవడం సరికాదని ప్రభుత్వం తన పిటిషన్‌లో బలంగా వాదించనుంది. ఇదే అంశంపై సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ స్పందించారు. రాజ్యాంగం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అతిక్రమిస్తే సమస్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ జీవోపై సుప్రీంకోర్టుకు వెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చని ఆయన స్పష్టం చేశారు. అనవసరమైన జాప్యం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి శ్రేయస్కరమని లక్ష్మీనారాయణ సూచించారు.

# వరంగల్, నల్లగొండలో ఇంక్యుబేషన్ కేంద్రాలు

**టిహబ్ తరహాలో ఏర్పాటు, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం: మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే తమ సంకల్పమని, వరంగల్, నల్గొండలోనూ టిహబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లుగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంఒయూ కుదుర్చుకోనున్నట్లుగా వివరించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రెండురోజుల పాటు నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయ పడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్‌గా మాత్రమే కాకుండా ఫార్మసీ ఆఫ్ పర్పస్‌గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్‌ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. పేటెంట్లను కాకుండా మీ ఆవిష్కరణ వల్ల ఎంత మందికి మేలు జరిగిందన్నదే చరిత్ర గుర్తుంచుకుంటుందని యువ ఇన్నోవేటర్స్‌కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాకతీయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, డా.బి.ప్రభా శంకర్, రాంప్రసాద్ రెడ్డి, ప్రద్యుమ్న, డా.తామర విజయ్ కుమార్, ప్రొఫెసర్ భాస్కర్ ఆర్.జాస్తి, రాజేశ్వర్ తోట, ప్రొఫెసర్ జె. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## రూ.8కోట్ల ఎర్రచందనం స్వాధీనం

**ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు**

**తిరుపతి,అక్టోబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవుల్లో అమూల్యమైన జాతీయసంపద ఎర్రచందనం వృక్షాలను నరికి అక్రమంగా రవాణాచేస్తున్న ఎనిమిదికోట్ల రూపాయలు విలువైన ఎర్రచందనదుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఈ అక్రమరవాణాలో కీలకంగా ఉన్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టుచేసి వారినుండి 10టన్నుల ఎర్రచందనం తిరుపతికి తరలించారు. శనివారం కపిలతీర్థంలోని ఎర్రచందనం అక్రమరవాణ నిరోధక టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో చీఫ్ లంకెల సుబ్బరాయుడు, ఎస్పీ పి.శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. తిరుపతి శేషాచలం అడవులనుండి ఎర్రచందనం దుంగలను పదిటన్నులు బరువున్న వాటిని విదేశాలకు తరలించేందుకు దేశరాజధాని ఢిల్లీకి చేర్చారు.

# ఐకానిక్ భవనంగా టి-స్క్వేర్

>> సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక, టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు మేం సిద్ధమే..

>>పరిశీలించింది. ఈమేరకు న్యాయ నిపుణులతో చర్చలు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేదని ఉత్తర్వుల్లో ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేయడంతో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్దంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి తదుపరి చర్యల కోసం లేఖ రాసింది. రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని కోరింది. కాగా హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ట్రిపుల్ టెస్టు పాటించకపోవడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ డిసెంబర్ 3 కు వాయిదా వేసింది. వికాస్ కృష్ణా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది.

## నీటిపారుదలకు ఇక సోలార్ విద్యుత్

>> ఏరియల్ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచాడం, బనకచర్ల ప్రాజెక్టు అంశాలపై కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షి స్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖా ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ప్రభుత్వ సలహాదారుడు ఆదిత్య నాథ్ దాస్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**12-10-2025, ఆదివారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం శరదృతువు, కృష్ణపక్షం**
షష్టి మ.2.22
మృగశిర మ.1.40
వర్జ్యం : రా.9.40-11.11
దు.సా.4.11-4.58
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రుల చేస్తారు. బంధువుల కలయిక.

**వృషభం:** నూతన కాంట్రాక్టులకు సంబంధించి, ఒప్పందాలు చేసుకుంటారు.

**మిథునం:** నూతన పెట్టుబడులకు అనుకూలకాలం. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** ఉద్యోగులకు పదోన్నతులు, అప్రయత్నంగా అవకాశాలు లాభిస్తాయి.

**సింహం:**కొన్ని వ్యవహారాలలో ఊహించని విజయం సాధిస్తారు.

**కన్య :** నూతన కార్యక్రమాలు కొంతకాలం వాయిదా వేయడం మంచిది.

**తుల :** సోదరులతో ఏర్పడిన వివాదాలు తీరతాయి. ఆస్తి వివాదులు తీరి లబ్ధి పొందుతారు.

**వృశ్చికం:** సన్నిహితులు నుండి సహాయసహకారాలు అందుతాయి.

**ధనుస్సు:** పదవులలో, హోదాలు లభించటానికి సమయం పడుతుంది.

**మకరం:**మానవ సేవే మాధవసేవని నమ్ముతారు. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**కుంభం:**పెద్దలు శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించడానికి కాలం కలిసి రాదు.

**మీనం :** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మంత్రుల మధ్య మరో వార్!

## మేడారంలో 'టెండర్ వివాదం'! మళ్లీ తెరపైకి మంత్రి సురేఖ

## రూ.71 కోట్ల పనులలో మంత్రి పొంగులేటి జోక్యంపై

## కొండా మురళి దంపతులు హైకమాండ్‌కు ఫిర్యాదు

## ఆరోపణపై స్పందించని మంత్రి పొంగులేటి

## కమలనాథుల కన్ను కూడా అటువైపే..

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త:** మంత్రి కొండా సురేఖ ఎప్పుడు వివాదస్పద పిర్యాదులతో రాష్టంలో చర్చకు దుమారం లేపుతారనే చర్చ సాగుతోంది. మొన్నటికి మొన్న జిల్లా ఎమ్మెల్యే లతో వైరుధ్యం.. నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కంప్లైంట్ ఎప్పటికి ఎదో చర్చకు తెరలేపడం చర్చనీయాంశమైంది. ఆదివాసీల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా అత్యధికంగా నిధులు కేటాయించిన విషయం తెలిసిందే.ఇదే కాకుండా మేడారం మాస్టర్ ప్లాన్ కి, శాశ్వత అభివృద్ధి పనులకు, గద్దెల విస్తరణకు కూడా అధిక మొత్తంలో నిధులు కేటాయించారు.మేడారం మాస్టర్ ప్లాన్,గద్దెల విస్తరణ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 23వ తేదీన మేడారంలో అశేష జనావాహినిమధ్య మేడారం జాతర నిర్వహణ అత్యంత ఘనంగా, ప్రపంచం మెచ్చే విధంగా నిర్వహిస్తామని సభాముఖంగాఅన్నారు.ఈ క్రమంలో అంకితభావంతో పనిచేసే బృందం ఏర్పాటు చేయాలని మంత్రులకు, అధికారులకు సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రకటన చేసి 20 రోజులు కూడా గడవకముందే మేడారం జాతర కి సంబంధించిన రూ.71 కోట్ల టెండర్ల నిర్వహణపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల మధ్య టెండర్ల లొల్లి తారాస్థాయికి చేరిందని విస్తృత చర్చ జరుగుతోంది. రూ.71 కోట్ల విలువైన జాతర టెండర్ పనుల కేటాయింపులో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం అధికంగా ఉందని మంత్రి కొండా సురేఖ, కొండ మురళి దంపతులు కాంగ్రెస్ హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. టెండర్ల వ్యవహారాలపై ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేకు కొండా మురళీ ఫిర్యాదు చేశారని సమాచారం. ఫోన్‌లో మాట్లాడిన కొండా మురళీ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న అంశాలను సమగ్రం వివరించారు.మేడారం పనులవ్యవహారం, మంత్రి పొం గులేటి జోక్యాన్ని రాహుల్‌గాంధీ,మీనాక్షి నటరాజన్‌లకు కూడా కొండా దంపతులు నివేదించినట్లు సమాచారం. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ, తన శాఖ పరిధిలోని జాతర పనుల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుంటున్నారని కొండా సురేఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రూ.71 కోట్ల విలువైన ఈ టెండర్ పనులను పొంగులేటి తన వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని సురేఖ, మురళి దంపతులు హైకమాండ్‌కు వివరించినట్లు సమాచారం.ఇది శాఖాపరమైన పెత్తనం కిందికి వస్తుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని వారు అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది.ఈ పరిణామంపై మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.జాతర నిర్వహణ అనేది దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నందున, ఇతర మంత్రుల అనవసర జోక్యంవల్ల పనుల్లో పారదర్శకత లోపిస్తుందని, ఆలస్యమయ్యే అవకాశం ఉందని సురేఖ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.తెలంగాణ కాంగ్రెస్‌ప్రభుత్వంలో మంత్రుల మధ్య అధికారం, పనుల కేటాయింపుల విషయంలో నెలకొన్న ఈఅంతర్గత పోరురాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.మేడారం జాతర పనుల్లో ఏకపక్ష నిర్ణయాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఏ విధంగా స్పందిస్తారు, అధిష్టానం ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ వివాదంపై కమలనాథులు కూడా దృష్టి సారించినట్లు సమాచారం.కోట్ల రూపాయలను మేడారం జాతర అభివృద్ధి కేటాయించి వంద రోజులలో జాతర అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం నెరవేరేనో లేదో వేచి చూడాలి.

# 'బిఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే బనకచర్ల తెరపైకి'

**హైదరాబాద్,అక్టోబరు 11,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బనకచర్ల తెరపైకి రావడమే కాదు దాని నిర్మాణం కోసం జిఒలు వెలువడ్డాయనీ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నిజామాబాద్ పర్యటనలో మహేష్‌కుమార్ మాట్లాడతూ రాయలసీమను రత్నాల సీమను చేస్తానన్నది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. బనకచర్ల, బిసి రిజర్వేషన్లు వంటి అంశాలపై బిజెపి - బిఆర్ఎస్ ద్వంద్వ వైఖరిపై ప్రదర్శించడంపై ఆయన మండిపడ్డారు. బనక చర్ల విషయంలో మంత్రి హరీష్ రావు మైల కడుక్కునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు ఆంధ్రా హక్కులను కాపాడతానన్నది కెసిఆర్ కాదా? అని ప్రశ్నించారు. జగన్‌తో కెసిఆర్ చెట్టాపట్టాలు వేసుకుని విందులు, వినోదాలు చేసుకున్నారని దుయ్యబట్టారు. ప్రజల హక్కుల విషయంలో మాత్రం మౌనం వహించారుని ఎగతాళి చేశారు. బనక చర్ల విషయంలో ఒక చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. బనకచర్ల పై మంత్రులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లతో వివరించే ప్రయత్నం చేశారని తెలిపారు.మాకు దమ్ము ధైర్యం ఉంది కాబట్టే బిసిరిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత బిజెపి బిఆర్ ఎస్ నేతలకు లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి ముంబై వయా నిజామాబాద్ రైల్వే లైన్ తో విషయమై సిఎం చర్చించా అన్నారు. కామారెడ్డి బిసి సభ తప్పకుండా ఉంటుందని ప్రకటించారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళతామని అన్నారు.రైతు పక్షపాతి సిఎం రేవంత్ రెడ్డి అని చెప్పారు. తెలంగాణలో అన్నిజిల్లాలో డిసిసి అధ్యక్షులల నియామకం నిష్పాక్షికంగా జరుగుతుందని నిజామాబాద్ జిల్లాకి రావాల్సి న అభివృద్ధి విషయంలో రాజీ పడం అని అన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని హామి ఇచ్చారు.

# వాట్సప్‌కు బదులుగా స్వదేశీ అరట్టై వాడండి..

**వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11:** వాట్స ప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అరట్టై' పేరు ఇటీవల నెట్టింగ మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లోనూ దీని ప్రస్తావన వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం అరట్టై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్స ప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్లుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుంది? అని ప్రశ్నించింది. ఇందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ పిటిషనర్ ఓ పాలీ దయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10,12 ఏళ్లుగా వాట్స ప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్లుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారు అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ అయితే ఏంటి? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవచ్చు కదా! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అరట్టై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం వ్యవసాయక్షేత్రాలను సందర్శించిన ప్రధాని మోడీ

# రేస్‌తో హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు

>> అడుగుపెట్టిందనడానికి ప్రతీక అని కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ (నీలీతిని) నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు 2025కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా, దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ వీధుల్లో పరుగెత్తినప్పుడు, భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందని రుజువైంది.ఈ రేసు దాదాపు రూ.700 కోట్ల ఆర్థిక కార్యకలాపాన్ని సృష్టించి, అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించింది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఫార్ములాఈ ఈవెంట్ ఒక ఆరంభం మాత్రమేనని, తెలంగాణ స్థిరమైన, సాంకేతికత ఆధారిత పారిశ్రామిక వృద్ధి లక్ష్యాన్ని కలిగి ఉందని, త్వరలోనే హైదరాబాద్ భారతదేశ మొబిలిటీ వ్యాలీగా ఆవిర్భవించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మోటార్ స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదు, అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడం, ఎంత దూరం వెళ్లగలమో తెలుసుకోవడం అని, జీవితంలో యువత కూడా రేసు కారు మాదిరి దూసుకుపోవాలని కేటీఆర్ అన్నారు.ఐటీ మంత్రిగా తన హయాంలో, ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టీహబ్, భారతదేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రమైన టీవర్క్స్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఎలా నిర్మించిందో కేటీఆర్ వివరించారు. ఒక ఆలోచన టీహబ్ నుండి టీవర్క్స్‌కు వెళ్లడానికి ఒక టీ తాగేంత సమయం మాత్రమే పడుతుంది అంటూ ఆలోచన అమలు వేగాన్ని చమత్కరించారు. వందలాది మంది యువ ఇంజనీర్లకు సందేశమిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా, వాటిని మీరే సృష్టించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మీరు సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి? అని ప్రశ్నించారు. ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారండి. మీరు పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత, మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు అని ఆయన ఉద్బోధించారు.తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, కానీ, ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత, అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డాము. తెలంగాణ సాధించిన ప్రగతి విశ్వాసానికి పట్టుదలకు దర్పనీకత నిదర్శనం అన్నారు. ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆకలిని కలిగి ఉండాలని సూచించారు.

# చైనాపై ట్రంప్ సుంకాల బాంబు

## అదనంగా 100% టారిఫ్‌లు

**వాషింగ్టన్, అక్టోబరు 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బాంబు పేల్చారు. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబరు 1 నుంచి అమలులోకి రానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే చైనాపై 30 శాతం సుంకాలు విధించిన సంగతి విదితమే. వాణిజ్యంపై చైనా అసాధారణంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. 'చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా వాటికి ఈ సుంకాలు వర్తిస్తాయి' అని అమెరికా అధ్యక్షుడు తన పోస్టులో వెల్లడించారు. ఇది అన్ని దేశాలను ప్రభావితం చేస్తుందని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపారు. నవంబరు 1 నుంచి లేదా ముందుగానే ఈ టారిఫ్‌లు అమలులోకి రావచ్చన్నారు. చైనా తీసుకునే తదుపరి చర్యలను బట్టి దీనిపై యుఎస్ నిర్ణయం ఉంటుందన్నారు. అలాగే, క్రిటికల్ సాఫ్ట్‌వేర్‌ను ఇతర దేశాలతో పంచుకోవడంపై నియంత్రణ విధిస్తున్నట్లు వివరించారు. అమెరికా తయారు చేసే దాదాపు ప్రతి ఉత్పత్తిపైనా భారీగా ఎగుమతి ఆంక్షలు విధించాలని చైనా యోచిస్తోందనే నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.
అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానంటూ బెదరింపులకు దిగారు. ఇది జరిగిన కొన్ని గంటలకే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం గమనార్హం. ఇక, గతంలోనూ అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. రెండు అతిపెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ట్రేడ్ డీల్‌కు ఇరు దేశాలు అంగీకరించినప్పటికీ.. అది ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# రూ.18 వేల కోట్లు

>> ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇందుకు రాష్ట్రాల సహకారానిన తీసుకుంటోంది. ఈ డ్రైవ్ సందర్భంగా నకిలీ లబ్ధిదారుల పేర్లను బ్లాక్ చేయాలని నిర్ణయించింది. ఇందులో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద లబ్ధిపొందుతున్న వారిలో అనర్హుల ఏరివేత కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం ఒక్కో రైతుకు ఏడాదికి మూడు విడతలుగా మొత్తం 6 వేల రూపాయల మేర ఆర్థిక సహాయం చేస్తోంది. దేశ వ్యాప్తంగా 2021-22 సంవత్సరంలో 10.4 కోట్ల మంది రైతులు ఈ పథకంలో 67,031 కోట్ల రూపాయల మేర లబ్ధిపొందారు. అప్పటి నుండి దాదాపు ఇదే విధంగా ఇప్పటి వరకూ నిధులు ఖర్చు చేస్తూ వస్తోంది. అయితే రెండేళ్లలో దాదాపు 2.40 కోట్ల మంది అనర్హులు తప్పుడు సమాచారం అందించి ఈ పథకం ప్రయోజనాన్ని పొందినట్లు గుర్తించింది. వీరందరినీ గుర్తించి పక్కన పెట్టే కార్యక్రమం ప్రస్తుతం జరుగుతున్నటున వ్యవసాయ శాఖ అధికారవర్గాల సమాచారం. అనర్హుల ఏరివేత కారణంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో దాదాపు 7 వేల కోట్ల రూపాయలకు పైగా ఆదా అవుతుందని అంచనా. అదేవిధంగా ఖరీఫ్, రబీ పంటల నిమిత్తం రైతులకు సబ్సిడీపై ఎరువులను సరఫరా చేస్తోంది.
కేంద్రం ప్రభుత్వం 45 కిలోల యూరియా బస్తాను 266 రూపాయలకు అందిస్తోంది. దీనిపై కేంద్రం ఒక్కో బస్తాకు 2,500 రూపాయలు చొప్పున సబ్సిడీ భారాన్ని భరిస్తోంది. అయితే ఈ సబ్సిడీ ఎరువుల విషయంలోనూ నకిలీలు, అనర్హుల కారణంగా కోట్లాది రూపాయలు మళ్లిపోతున్నాయని కనుగొంది. పంటల సాగుకు వినియోగించాల్సిన సబ్సిడీ ఎరువులను పారిశ్రామిక అవసరాలకు మళ్లిస్తున్నారు. అంతేకాకుండా కొందరు స్వార్థ పరులు సబ్సిడీ ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు అమ్మి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. వీటిని అరికట్టేందుకు కేంద్రం ప్రత్యేకించి ఫర్టిలైజర్ స్క్వాడ్‌ను ఇటీవల ఏర్పాటు చేసింది. ఈ బృందం ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో 80 వేల వ్యవసాయ రసాయన బ్యాగ్‌లను స్వాధీనం చేసుకుంది. 30 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటోంది. మరోపక్క ముమ్మరంగా డ్రైవ్ నిర్వహిస్తోంది. ఈ డ్రైవ్ ద్వారా మొత్తంగా సబ్సిడీ ఎరువుల్లో అనర్హులు, బ్లాక్ మార్కెటీర్లను నియంత్రించడం ద్వారా పక్కదారి పడుతున్న దాదాపు 6,800 కోట్ల రూపాయల వరకూ ఆదా చేయవచ్చని అంచనా. మరోపక్క మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 33 లక్షల నకిలీ జాబ్ కార్డులు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీని వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దుర్వినియోగం అవుతున్న సుమారు 4 వేల కోట్ల రూపాయల వరకూ అడ్డుకట్ట వేయవచ్చని అంచనా కేంద్రం వేస్తోంది.




# ఎస్సీ గురుకులాల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

## విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తున్న బిఆర్ఎస్ నేతలు

## నెలాఖరులోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ బిల్లుల చెల్లింపు

## ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సి గురుకులాల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలతో విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. మేమే రాజులం, మేమే మంత్రులం అంటూ దశాబ్దంపాటు వారు ఈ రెండు శాఖలను పూర్తిగా విస్మరించారని.. ప్రజాప్రభుత్వం హయంలో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో 67,113 మంది విద్యార్థులు చేరగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అదికాస్త 71,044కి పెరిగిందన్నారు. సుమారు 3,931 మంది అదనంగా చేరారని... ప్రస్తుతం గురుకులాల్లో 3.27 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారని మంత్రి తెలిపారు. ఎస్సీ గురుకులాల్లో ఇంటర్‌లో 62,334 మంది, డిగ్రీలో 8,710 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. గతబీఆర్ఎస్ హయాంలో శాశ్వత భవనాల నిర్మాణం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బాచుపల్లి, గొల్లపల్లి (జగిత్యాల) ప్రాంతాల్లో కొత్త భవనాల నిర్మాణం ప్రారంభమైందని.. విద్యార్థుల భోజనం, వసతి, పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆహారం నాణ్యతలేమిపై రాత్రంతా మెస్‌లో జాగారం చేశారని.. అప్పుడు ఒక్క మంత్రి కూడా అక్కడకు వెళ్లలేదన్న మంత్రి అడ్లూరి.. ఇప్పుడు మాపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2024 సివిల్స్ ప్రిలిమ్స్‌లో 24 మంది, మెయిన్స్‌లో ముగ్గురు సెలెక్ట్ అయ్యారని తెలిపారు. 2025లో 26 మంది విద్యార్థులు సివిల్స్ ప్రిలిమినరీలో క్వాలిఫై అయ్యారని, ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ప్రిలిమినరీలో 5 మంది విద్యార్థులు విజయం సాధించారని చెప్పారు. అలాగే గ్రూప్-1లో 33 మంది, గ్రూప్-4లో 145 మంది, డిఎస్‌సిలో 123 మంది ఇలా మొత్తం 186 మంది రాష్ట్ర, కేంద్ర సర్వీసులకు ఎంపికయ్యారని మంత్రి అడ్లూరి మీడియాకు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో గురుకులాల్లో అత్యవసర ఇబ్బందుల పరిష్కారం కోసం రూ.60 కోట్లు అత్యవసర నిధులు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో హాస్టళ్లలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు తక్షణ పరిష్కారం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. ప్రతి సొసైటీ సెక్రటరీకి నిధుల వినియోగంపై పూర్తి అధికారం ఇచ్చారని.. ఫాస్ట్ యాక్షన్ మెకానిజం ఏర్పాటు చేసి, ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకునే విధానం అమల్లోకి వస్తోందన్నారు. రాష్ట్రంలోని బెస్ట్ అవలబుల్ స్కూల్స్‌లో చదివే పేద విద్యార్థుల పట్ల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ఆలోచించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో మొదటి దఫాలో ఈనెల 20 లోపు... మిగిలిన బిల్లులు ఈనెల చివరిలోగా క్లియర్ చేస్తానని మంత్రి స్పష్టం చేశారు.

# ఇది దేశంపైనే దాడి.. ఐపిఎస్ పూరన్‌కుమార్

## ఆత్మహత్యపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 11:** హర్యానా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీనియర్ ఐపీఎస్ అధికారి వై.పూరన్‌కుమార్ ఆత్మహత్యపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ట్విట్టర్ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్, ఒక ఐపీఎస్ అధికారి కూడా కుల వివక్షకు గురై ప్రాణాలు తీసుకోవాల్సిన పరిస్థితి రావడం, సమాజంలో కుల ఆధారిత ద్వేషం ఎంత పెరిగిందో చూపిస్తున్న దారుణ ఉదాహరణ అని పేర్కొన్నారు. అదనపు డిజిపి స్థాయి అధికారి కూడా వేధింపులకు గురైతే, సాధారణ ప్రజల పరిస్థితి ఎంత విషమంగా ఉందో అర్థమవుతుంది అని సీఎం తెలిపారు. ఇలాంటి సంఘటనలు సమాజంలో విషాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, ఇవి రాజ్యాంగం, సమానత్వం, న్యాయంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా బలమైన సామాజిక చైతన్యం అవసరమని వివరించారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అందరూ తీవ్రంగా ఖండించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్‌పై దాడి కాదు.. దేశంపైనే దాడి.. ఇలాంటి సంఘటనలను ప్రతి ఒక్కరూ తీవ్రంగా పరిగణించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వై.పూరన్‌కుమార్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం రేవంత్ రెడ్డి తెలియ జేశారు. వ్యక్తి సామాన్యుడైనా, ఉన్నతస్థాయి అధికారి అయినా, దళిత వర్గానికి చెందిన వారైనా, అన్యాయం, అమానవీయత ఏ రూపంలోనైనా సహించరాదని ముఖ్యమంత్రి తెలిపారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

# 14వ తేదీ బంద్‌కు మద్దతు ఇవ్వండి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరిన బిసి సంఘాలు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా ప్రభుత్వం ఈ సమస్యను మరింత సమర్ధవంతంగా పరిష్కరించడానికి ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 14న బీసీ సంఘాల బంద్‌కు మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాలు శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. బీసీల రిజర్వేషన్లకు ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాలు కోరాయి. బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ప్రతినిధి బృందంలో వకుళా భరణం కృష్ణమోహన్, బీసీ సంక్షేమ సఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ బి.సి సంక్షేమ సంఘం, నీల వెంకటేష్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం, జిల్లపల్లి అంజి అధ్యక్షుడు, తెలంగాణ బిసి యువజన సంఘం, పగిళ్ల సతీష్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం, రాజేందర్ అధ్యక్షులు, తెలంగాణ బిసి సంఘం, అనంతయ్య అధ్యక్షుడు, బిసి ఐఖ్య వేదిక, భుపేష్‌సాగర్ అధ్యక్షుడు, గ్రేటర్ హైదరబాద్, మనికంఠ అధ్యక్షుడు, తెలంగాణ బిసి కార్మిక సంఘం, అల్లంపల్లి రామకోటి అధ్యక్షుడు, పృధ్విగౌడ్, రాజు నేత తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ తరపున పోటీ

## అభ్యర్థిగా ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ శాసనసభ స్థానానికి జరుగుతున్న ఉపఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ భాగస్వామ్య పార్టీ యంసిపిఐ(యు) పోటి చేస్తున్నదని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బిఎల్ఎఫ్) చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ సంయుక్తంగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వనం సుధాకర్‌ని అభ్యర్థిగా ప్రకటించారు. వనం సుధాకర్‌కి బిఎల్ఎఫ్ భాగస్వామ్య పక్షాలే కాకుండా వామపక్ష, సామాజిక ప్రజాస్వామిక, లౌకిక శక్తులు, సంఘాలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాల ప్రజలు విద్యావంతులు, మేధావులు.. నిత్యం ప్రజల కోసం, అణగారిన వర్గాల కోసం పోరాడుతున్న వనం సుధాకర్‌కి సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి మూడు సార్లు వరుసగా అధికారంలో కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి చేసిన సహాయ సహకారాలు ఏమి లేకపోగా విభజించు పాలించు అనే కార్పొరేట్ మత ఉన్మాద చర్యలు తప్ప అభివృద్ధి ఏమి లేదని విమర్శించారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలన కానీ, నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ప్రజల మౌలిక సమస్యలపై కేంద్రీకరణ లేక పోగా అవినీతి, నిరుద్యోగం,పేద రికం, అసమానతలు పెరిగి పోయయన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం అడుగంటి పోయిందని రాష్ట్రంలో నూటికి 56శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇస్తే కోర్టులకు ఎక్కుతున్న అగ్రవర్ణ ఆధిపత్య శక్తులు బూర్జువా భూస్వామ్య ఫ్యూడల్ మనస్తత్వంతో కట్టడి చేయడానికి చూస్తున్నాయన్నారు. రాజ్యాధికారం అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల చేతిలో ఉండటమేనన్నారు. మనువాద కార్పొరేట్ బిజెపిని, అవినీతి నియంతృత్వ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించి.. బిఎల్ఎఫ్ బలపరిచిన యంసిపిఐ(యు) అభ్యర్థి వనం సుధాకర్‌ను ప్రజా గొంతుకగా అసెంబ్లీకి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు పంపాలని కోరారు.




చంద్రశేఖర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మల్‌రెడ్డి రామ్‌రెడ్డి తదితరులు

# డల్లాస్‌లో హత్యకు గురైన చంద్రశేఖర్

## భౌతికకాయానికి మంత్రి శ్రీధర్‌బాబు నివాళులు

**హైదరాబాద్ (వనస్థలిపురం), అక్టోబరు 11, ప్రభాతవార్త :** అమెరికాలోని డల్లాస్‌లో దుండగుల చేతులో హత్యకు గురైన చంద్రశేఖర్ భౌతికకాయానికి మంత్రి శ్రీధర్‌బాబు శనివారం నివాళులర్పించారు. డల్లాస్‌లో ఉన్నత చదువుల నిమిత్తం రెండేళ్ల క్రితం ఎల్‌బినగర్‌లోని టీచర్స్‌కాలనీలో ఉంటున్న పోలే చంద్రశేఖర్ వెళ్లాడు. కాగా ఈ నెల 3న అమెరికాలో గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో చంద్రశేఖర్ దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున చంద్రశేఖర్ భౌతికకాయం టీచర్స్‌కాలనీలోని వారి నివాసానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ టీచర్స్ కాలనీలో వారి నివాసానికి వెళ్లి చంద్రశేఖర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అనం తరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వం నుండి సహాయసహకారాలు అందజేస్తామని వారి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ తదితరులున్నారు.

# రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

## ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## ధన్ ధాన్య కృషి యోజనను ప్రారంభించిన ప్రధాని మోడీ

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు 11, ప్రభాతవార్త:** రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రైతులకు అత్యధిక నిధులు కేటాయిస్తుందని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పప్పు ధాన్యాలపై జాతీయ మిషన్ ధన్ ధాన్య కృషి యోజనను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ప్రారంభించారు. రాజేంద్రనగర్ నరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అతిథిగా పార్ల మెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై ఆవిష్కర ణను ఆన్ లైన్‌లో వీక్షించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ... వ్యవసాయ పర్యావరణ వ్యవస్థకు హాని కలిగించకుండా సహజ పంటలను పండించడంలో ఉత్తమ పద్ధతులకు కట్టుబడి ఉండాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలను ఆయన వివరించారు. మన స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం నరం డైరెక్టర్ ఐ/సి హెడ్, ఆర్ఎస్ఎం డివిజన్, డాక్టర్ వి. రామ సుబ్రమణ్యం ముఖ్య అతిథిని సత్కరించారు. రైతులు, నరం శాస్త్రవేత్తలు, ప్రాజెక్ట్, కాంట్రాక్టు సిబ్బంది, పిజిడిఎం-ఎబిఎం విద్యార్థులు సహాయ సిబ్బంది అకాడమీలోని డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ ఆడిటోరియంలో ప్రారంభోత్సవ కార్యక్రమా నికి హాజరై ప్రధానమంత్రి ఆన్‌లైన్ ప్రసంగాన్ని విన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో ..**

రాజేంద్రనగర్‌లోని పివి నరసింహా రావు పశువైద్య విశ్వవిద్యాలయంలో ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి విస్తరణ సంచాలకులు కిషన్‌కుమార్ అతిథిగా హాజరై ప్రసగించారు. ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీలో ధన్‌ధాన్య కృషి యోజన పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ దృశ్యాలను ఆన్‌లైన్ ద్వారా పశువైద్య విశ్వ విద్యాలయంలో అధికా రులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో డా.సిహెచ్ సత్యనారాణ, విస్తరణ సంచాలకులు కిషన్ కుమార్, పశువైద్యాధికారులు, వ్యవ సాయాధికారులు, మహిళలు, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి

# రూ.1.11 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

## సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్

**అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** బిఅశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేదిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముఠాను అశ్వారావుపేట పోలీస్‌లు అరెస్టు చేశారు. మొత్తం 222 కిలోల గంజాయి పట్టుకోగా పట్టుబడిన గంజాయి విలువ రూ.1.11కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగారెడ్డి గూడెం రోడ్‌లో అశ్వారావుపేట పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా జంగారెడ్డిగూడెం నుండి అశ్వారావుపేట వైపు నకు పారిపోతున్న స్విఫ్ట్ కారును వెంబడిరచి కొద్ది దూరంలో పట్టుకున్నారు. అనంతరం విచారించగా హైదరాబాద్ కు చెందిన ఊంగరాల సరిన్ కుమార్, బెల్లంపల్లికి చెందిన బాబర్ ఖాన్‌లను అదుపులోకి తీసుకొని వాహనంలో ఉన్న 222 కిలోల బరువు గల 111 ప్యాక్కెట్ల నిషేదిత గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు విశాఖపట్నంకు చెందిన పంగి శ్రీను వద్ద రూ.4 లక్షలకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఇంతియాజ్‌కు ఎక్కువ మొత్తానికి అమ్మడానికి వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సిఐ నాగరాజు రెడ్డి కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, గంజాయిని తరలించడానికి ఉపయోగించిన వాహనంను, నిందితులు ఉపయోగించిన సెల్‌ఫోన్‌లు, రూ.4వేల నగదును కూడా స్వాదీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వాహన తనిఖీలలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, అశ్వారావుపేట ఎస్సై రామ్మూర్తి సిబ్బంది పాల్గొన్నారు.



## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతమ్ రావు అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సందర్భంగా అంబర్‌పేట లోని మహంకాళి దేవాలయంలో గౌతమ్ రావు ప్రత్యేక పూజలు చేసి బిజెపి రాష్ట్ర కార్యాలయానికి భారీ ర్యాలీతో చేరుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని గౌతమ్‌రావు పేర్కొన్నారు.

# 160 మంది ప్రభుత్వ టీచర్ల విదేశ పర్యటన

## సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ టూర్

## పేర్లను 23లోగా పంపించాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకి ప్రపంచంలోని ఉత్తమ బోధనా పద్ధతులను తెలుసుకోవడం కోసం విదేశీ పర్యటనలకు అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని 160 మంది ఉపాధ్యాయులకి ఈ అవకాశం కల్పించారు. అందులో భాగంగా ఈ నెల, వచ్చే నెలలో సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ దేశాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు పర్యటించి అక్కడి పాఠశాలల్లో బోధిస్తున్న ఉత్తమ పద్ధతులను, ఆధునిక సాంకేతికతను పరిశీలించనున్నారు.

ఇందుకు సంబంధించి ప్రతి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేసి పాఠశాల విద్య డైరెక్టరేట్‌లో పేర్లను ఈ నెల 23లోగా అప్‌లోడ్ చేయాలని కోరుతూ పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ జిల్లా కలెక్టర్లకు లేఖలు రాశారు. జిల్లా మొత్తం ఒక ఎస్‌జిటి/ఎల్‌పి /పిఇటీ/టిజిటి, ఒక స్కూల్ అసిస్టెంట్/పిజిటి.. ఒక జిహెచ్ ఎం/ప్రిన్సిపాల్ ఇలా ముగ్గురిని ఎంపిక చేసి పంపించాలని లేఖలో పేర్కొన్నారు. విదేశాల్లో పర్యటన కోసం ఎంపిక చేసే ఉపాధ్యాయులను ముగ్గురి కమిటీ ఎంపిక చేసి పంపించనుంది. అందులో అడిషనల్ కలెక్టర్ లోకల్‌బాడీస్, జిల్లా విద్యాధికారి(డిఈవో), కలెక్టర్ నియమించిన సీనియర్ అధికారి ఉంటారు. వీరు ఎంపిక చేసిన ముగ్గురి పేర్లను డిఎస్ఈకి పంపించాలని సూచించారు. అలా ఎంపిక చేసిన 160 మంది ఉపాధ్యాయులను 4 బ్యాచ్‌లుగా ప్రతి బ్యాచ్‌లో 40 మందికి విదేశీ పర్యటనకు పంపించనున్నారు. 5 రోజులపాటు విదేశాల్లో పర్యటించి అక్కడి ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేయనున్నారు. విదేశీ పర్యటనకు వెళ్లే వారి వయస్సు 55 సంవత్సరాలు మించకుండా ఉండాలని, అలాగే కనీసం 10 సంవత్సరాల బోధనా అనుభవం ఉన్నవారినే ఎంపిక చేయాలని సూచించారు.



# బిజినెస్‌మాన్ హత్య కేసులో హిందూ మహాసభ ప్రతినిధి అరెస్టు

**లక్నో, అక్టోబరు 11:** టూవీలర్ షాపు యజమాని హత్యకేసులో అఖిల్‌భారత్ హిందూ మహాసభ కార్యవర్గప్రతినిధి పూజా షాకున్ పాండేను ఆలిఘర్‌పోలీసులు అరెస్టు చేసారు. ఆలిఘర్‌లోని రోరావార్ ప్రాంతంలో 25 ఏళ్ల అభిషేక్ గుప్తా అనే టూవీలర్ షోరూమ్ ఓనర్‌ను పూజాషాకున్ ఆమె భర్త ఇద్దరు కిరాయి వ్యక్తులతో హత్యచేయించారని అభియోగాలున్నాయి. అశోక్ పాండే ఇద్దరు షార్ప్‌షూటర్లను ఏర్పాటుచేసాడు. వమ్మద్ ఫాజన్, ఆసిఫ్ అనే ఇద్దరు షూటర్లను కిరాయికి తీసుకని అభిషేక్ గుప్తాను హత్య చేయించారని పోలీసులు రోరావార్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదుచేసారు. గతనెల 26వ తేదీ గుప్తా రోరవార్‌నుంచి హత్రాస్ వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ఈ షార్ప్‌షూటర్లు తుపాకులతో కాల్పులుజరిపి హత్యచేసారని పోలీసులు అభియోగాలుమోసారు. పోలీసులు పూజా, అశోక్ ఇదనదరిపైనా కేసునమోదుచేసారు. ఎస్ఎస్‌పి నీరజ్‌కుమార్ జదౌన్ కథనం ప్రకారం పూజాను రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌నుంచి శుక్రవారం రాత్రి అరెస్టు చేసామన్నారు. అభిషేక్ కుటుంబం ఆమెపై లైంగిక వేధింపుల ఆరోపణలుచేస్తున్నట్లు తెలిపారు. అభిషేక్ అన్నింటినీ వదులుకోవడంతో ఆమె కక్ష పెంచుకుని తమ బిడ్డను హతమార్చిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. అయితే పోలీసుల దర్యాప్తులో వీరిద్దరిమధ్య ఒక బిజినెస్ డీల్ చెడిందని అందువల్లనే కక్షలు పెరిగి హత్యకు దారితీసిందని అనుమానిస్తున్నారు. అశోక్‌పాండే ఇద్దరు షూటర్లు ఇప్పటికే జైలులో ఉన్నట్లు తెలిపారు. షార్ప్‌షూటర్లలో ఆసిఫ్‌పై 24 వేల రివార్డుకూడా ఉంది.

# రాష్ట్రంలో పెరుగుతున్న మ్యూల్ ఖాతాల సైబర్ నేరగాళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు చెందిన బడా నేరగాళ్లతోపాటు వారికి సహకరిస్తున్న చోటా నేరగాళ్లను కటకటాల్లో నెడుతుండడం తెలిసిందే. ఇప్పటి వరకు టి జిసిఎస్‌బి అరెస్టు చేసిన నేరగాళ్లలో ఉత్త ర, పశ్చిమ, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా వున్నారు. అయితే కొంతకాలంగా ఈ జాబితాలో తెలంగాణకు చెందిన వారు చేరుతుండడం సంచలనం రేపుతోంది. ఉమ్మడి హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు చె ందిన కొందరు యువతీ యువకులు విదేశాలతో పాటు రాజస్తాన్, ఢిల్లీ కేంద్రంగా బడా నేరగాళ్లకు సహకరించేందుకు తమ బ్యాంకుల ఖాతాలను అ ందిస్తున్న వైనం పోలీసులను నివ్వెర పరుస్తోంది. ఉన్నత విద్యావంతులైన యువతీ యువకులు, కేవలం ఐదు నుంచి పది శాతం కమీషన్ల కోసం వీరంతా తమ జీవితాలను నాశనం చేసుకుంటుండడం పోలీసులను షాక్‌కు గురిచేస్తోంది. ఇలా ఎందుకు జరుగుతుందనే దానిపై దృష్టి సారించిన టిజిసిఎస్‌బి ఈ తరహా నేరాలను తెలంగాణలో మొగ్గ దశలోనే తుంచి వేసేందుకు నిర్ణయించి ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేసే ందుకు నడుం బిగించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ నగల వ్యాపారి నుంచి కొందరు సైబర్ నేరగాళ్లు విదేశీ పెట్టుబడుల పేరిట 7.88 కోట్ల రూపాయలను కాజేయగా దీనికి సంబంధించిన నగదు తరలింపుకు నిజామాబాద్‌కు చెందిన మ్యూల్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల ఖాతాలకు బదిలీ అయ్యాయని తేలింది. దీనిపై విచారణ సాగుతోంది. అంతకు ముందు టిజిసిఎస్‌బి అధికారులు గుజరాత్, రాజస్తాన్‌లకు చెందిన 40 మంది అంత రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేయగా వీరంతా మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్రంగా (ఈ మూడు దేశాలను సైబర్ నేరాలు ఎక్కువ గా జరిగే గోల్డెన్ ట్రయంగల్‌గా పిలుస్తారు) జరిగే సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నట్లు తేలింది. ఈ మూడు దేశాలలో వుంటున్న బడా సైబర్ నేరగాళ్లకు ఇక్కడ పట్టుబడ్డ నేరగాళ్లు కేవలం బ్యాంకుల ఖాతాలను ఇస్తున్నారని తేలింది. ఇందుకు గానూ ఐదు నుంచి పది శాతం కమీషన్ తీసుకున్నారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను అనేకరకాల మోసాల పేరిట మోసం చేస్తూ కాజేసిన నగదును లోకల్ నేరగాళ్ల బ్యాంకుల ఖాతాలకు మొదట వెళుతు ండడం ఆందోళన కలిగించే అంశంగా అధికారులు చెబుతున్నారు. దీని తరువాత వీరి ఖాతాల నుంచి విదేశాల్లో వుండే బడా నేరగాళ్ల ఖాతాలకు న గదు లేదా క్రిప్టో కరెన్సీ ద్వారా వెళుతోంది. ఇప్పటి వరకు దేశంలో జరిగే సైబర్ నేరాలకు మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్రంగా పని చేస్తున్న బడా సైబర్ నేరగాళ్లు ప్రధాన కారణం కాగా వీరికి భారత్‌లోని కొన్ని ప్రాంతాలకు చెందిన లోకల్ నేరగాళ్లు సహకారం అందిస్తున్నారు. అయితే ఇప్పుడు మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్రంగా పనిచేస్తున్న బడా సైబర్ నేరగాళ్లకు తెలంగాణకు చెందిన యువతీ, యువకులు బ్యా ంకుల ఖాతాలు ఇస్తున్న ఉదంతాలు పెరిగిపోతున్నాయి. ఆరు నెలల వ్యవధిలో ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన 30 ఇదే సైబర్ నేర గాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇచ్చి పోలీసులకు చిక్కారు. దీని తరువాత ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట్‌లోని మూడు గ్రామాలకు చెందిన 20 మ ంది యువతీ యువకులు ఈ తరహా నేరం చేసి పోలీసులకు దొరికిపోయారు. ఇందులో కొందరు మొదటిసారి నేరం చేయగా మరికొందరు రెండు అంతకు ఎక్కువసార్లు బడా నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. బడా నేరగాళ్లకు సహకరించడం అనేది ఇటీవలే తెలంగాణలో మొదలయ్యింది. ఇది మరింత విస్తరించకముందు ఆపాలని టిజిసిఎస్‌బి నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేసింది . అనుమానిత లావాదేవీలు నిర్వహిస్తున్న వారి జాబితాను పోలీసులను పంపి వీటి నిర్వాహకులను కౌన్సెలింగ్ చేయాలని ఆదేశించింది. అయితే టిజిసిఎస్‌బి ప్రయత్నం మంచిదే అయినా ఏ మేరకు ఫలిస్తుందో...? చూడాల్సి వుంది.

## ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో బడా నేరగాళ్లకు బ్యాంకుల ఖాతాలిస్తున్న యువత

# ఉపఎన్నిక అభ్యర్థిని అధిష్ఠానమే ఖరారు చేస్తుంది

## ఢిల్లీకి వెళ్లిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** జుబ్లిహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థి ఎంపిక ప్రక్రియ ఢిల్లీకి చేరింది. అభ్యర్థిని ఖరారు చేసేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీ జాతీయ ముఖ్య నేతలు సునీల్ బన్సల్, బిఎల్ సంతోష్ ఆయన భేటీ కానున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిటీ ఖరారు చేసిన ముగ్గురు అభ్యర్థుల జాబితాను రామచంద్రరావు జాతీయ నాయకత్వానికి అందించనున్నారు. పార్లమెంటరీ పార్టీ బోర్డులో చర్చ అనంతరం భాజపా అభ్యర్థిని ప్రకటించనుంది. కాగా జూబ్లిహిల్స్ ఉపఎన్నికలపై బిజెపి అధిష్టానం దృష్టిసారించి కసరత్తు ముమ్మరం చేసింది. అభ్యర్థుల ఎంపిక కోసం మాజీ ఎమ్మెల్యే ఎం. ధర్మారావు, మాజీ ఎంపి పోతుగంటి రాములు, సీనియర్ నేత, అడ్వకేట్ కోమల ఆంజనేయులుతో వేసిన కమిటీ ఐదుగురి పేర్లను సూచిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుకు నివేదిక అందించిన సంగతి తెలిసిందే. వారిలో ముగ్గురు పేర్లతో కమిటీని జాతీయ నేతలకు అందించారు. ఈ జాబితాతో ఢిల్లీకి చేరిన రాష్ట్ర అధ్యక్షులు అధిష్టానంతో చర్చించి త్వరలోనే ఫైనల్ చేయనున్నారు. అభ్యర్థిని అధిష్టానమే ఫైనల్ చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు స్పష్టం చేశారు.

గతంలో ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌లను కఠినంగా అమలు చేయాలని లేకపోవడంతో జనాలు కోర్టులు చుట్టూ తిరుగుతూ అప్పుల పాలవుతుంటే కబ్జాదారుడు మాత్రం కోట్లు సందిస్తున్నారు. ల్యాండ్ గ్రాబింగ్ చేసే అవకాశం అధికంగా ప్రభుత్వ పెద్దల సహాకారంతో జరగుతుండటంతో దీని జోలికి రెండు ప్రభుత్వాలు వెళ్లడం లేదని ఆరోపణలుకూడా వినిపిస్తున్నాయి. సాధారణంగా ఏ కేసులో అయినా దొంగ అనే ముద్రపడితే ముద్రపడ్డవారు తమ నిజాయితీని రుజువుచేసుకోవాల్సి ఉంటుంది. కాని భూకబ్జాలో మాత్రం యజమానే తన భూమి తనదేఅని రుజువు చేసుకోవాల్సి వస్తోంది. అన్ని వ్యాధులను తగ్గించే సంజీవిని మందు మాదిరిగా భూభారతి అన్ని రెవెన్యూ సమస్యలకు పరిష్కారంకాదని నిపుణులు అభిప్రాయం. డబ్బు, నగలు, విలువలైన పత్రాలను లాకర్లలో దాచుకోవచ్చుకాని భూమిని మాత్రం దాచుకోలేమంటున్నారు. ఉదాహారణకు ఒకవ్యక్తి 10ఎకరాలు ల్యాండ్ కోనుగోలు చేశారు. కొన్ని సమస్యల కారణంగా తాను ఇతర దేశానికి వెళ్ళాల్సి వచ్చింది. తీరా అక్కడ నుంచి వచ్చిన తర్వాత తన భూమినికొందరు కబ్జా చేయగా ఏమీ చేయాలో తోచక సదరు వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు. ఇది సివిల్ వివాదం కనుక సివిల్ కోర్టుకు వెళ్ళండనిఉచిత సలహా ఇచ్చారంటున్నారు. ఇలాంటి సమయంలో కోర్టులకు వెళ్ళాల్సినఅవసరం లేకుండా భూ సమస్యలను ఒక్క భూ భారతిచట్టం ఏవిధంగా పరిష్కరిస్తుంది అనే దానిపైస్పష్టత లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులకు కూడా హక్కులు కల్పిస్తామని చెప్పే ప్రభుత్వం దానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వ లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కౌలు రైతులను ఎలా గుర్తిస్తారు. రోజురోజు భూమి విలువ పెరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి పత్రాలు లేకుండానే కబ్జాల పెరుగుతున్నాయి. ఇటువంటి సమయంలో భూయజమానికి భూమిని రైతులకు ఏ విధంగా కౌలుకు ఇస్తారు.

# భూభారతిలోనూ 'ధరణి' సమస్యలే!

**అమరవాది సంపత్‌కుమార్**

కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ధరణిని మార్చి కొత్తగా భూభారతి తీసుకువచ్చినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి మార్గదర్శకాలే దిక్కు అయిందనే విమర్శలువస్తున్నాయి. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో ఉన్న అధికారులు, సలహాదారులను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించడంతో ఇటువంటి సమస్య ఉత్పన్నమవుతోందన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. నాడు ధరణిలో పొందుపరిచిన అంశాలనే భూభారతిలో యధాతథంగా ఎత్తిపోసింది. 33 మాడ్యూల్స్‌ను 6కు తగ్గించామంటూ గొప్పగా ప్రకటించింది. ఇందులోనూ మాయ చేసింది. ప్రస్తుతం ఉన్న 33మాడ్యూల్స్‌లోని వివిధ అంశాలన్నింటిని కలిపేసి ఆరు మాడ్యూల్స్‌లో పొందుపరిచింది. అన్నీ కలిపేసి మాడ్యూల్స్ తగ్గించామంటూ ప్రకటించేసింది. ఇందులో ఒకటి రెండు మినహా కాంగ్రెస్‌సర్కారు కొత్తగా చేసిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భూభారతి అమలుకు సంబంధించి మాజీ రెవెన్యూ అధికారులు ధరణికి, భూభారతికి పెద్ద తేడాలేదని కేవలం పేరు మాత్రమే మారిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం భూముల వ్యవహారాల కోసం ధరణి స్థానంలో భూ భారతి పేరుతో కొత్తపోర్టల్ అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ పోర్టల్ మీద చాలా మందికి చాలా సందేహాలు వస్తున్నాయి. అవి ఎవరిని అడగాలో తెలియక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టోల్ ఫ్రీనెంబర్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈటోల్ ఫ్రీ నెంబర్ ద్వారా భూమి సమస్యల పరిష్కారంతోపాటు, చాలా సందేహాలను సులభంగా నివృత్తి చేసుకోవచ్చు. అయితే ఇదే అంశంపై దేవాదాయశాఖకు చెందిన భూములు ప్రస్తుత భూ భారతిలోకి చేరాయాని ఒక అధికారిని ప్రశ్నిం చగా గత ధరణిలో ఉన్న భూములను కాపి పేస్టులా భూ భారతిలో కూడాఎక్కించినట్లు సదరు ఉన్నతాధికారి సమాధానం ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి 33 మాడ్యూళ్లు ఉండేవి. ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యూల్‌ను ఏర్పాటుచేశారు. అయితే అవగాహన లేకపోవటం వల్ల చాలా మంది రైతులు ఒకదానికి బదులు మరో మాడ్యూల్లో అప్లికేషన్ పెట్టుకునేవారు. అధికా రులు వాటిని రిజక్ట్ చేసేవారు. దీంతో ప్రతిసారీ రూ.1,200 వెచ్చించి పదేపదే దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ మాడ్యూళ్ల సంఖ్యను 6కు తగ్గించారు. భూ భారతి పోర్టల్లో దరఖాస్తు చేస్తే ఇకపై భూయజమాని ఫోన్ నంబరుకు ఎస్ ఎంఎస్‌లు వస్తాయి. రైతుల అప్లికేషన్ స్టేటస్ చూసుకునేలా ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది.




ధరణి పోర్టల్లో భూదస్త్రాలు కని పించేవి కావు. భూ భారతిలో ఎవరివైనా, ఎక్కడి నుంచైనా భూముల వివరాలు చూసేలా ఏర్పాట్లుఉంటాయి. 2020కి ముందు 32కాలమ్‌లతో పహణీ ఉండేది. అందులో భూయజమాని పేరు, భూ ఖాతా, సర్వే నంబరు ఇలా 32 కాలమ్‌లు ఉండేవి. ధరణి పోర్టల్ ద్వారా రైతు పేరు మాత్ర మే ఉండేలా పహాణీని అమలు చేసింది. ఈక్రమంలో భూముల వివరాల లభ్యతలేక రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా భూభారతిలో 11 కాలమ్‌లతో కొత్త పహణీని ఏర్పాటు చేశారు. ఎమ్మార్వో స్థాయిలో భూ సమస్య పరిష్కారం కాకపోతే ఆపైన ఆర్డీవోకు, అక్కణ్నుంచి కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. కలెక్టర్ ఇచ్చే ఉత్తర్వులతో విభేదిస్తే 30 రోజుల్లో భూపరిపాలనా ట్రైబ్యునల్‌లో సవాల్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. లీగల్‌ఇష్యూస్ పరిష్కా రానికి ల్యాండ్ ట్రెబ్యునళ్లు సైతం ఏర్పాటు చేస్తారు. భూ పరిపాలన ట్రెబ్యునల్ కమిషన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. భూ సమ స్యల విషయాల్లో రైతులకు న్యాయ సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సర్కార్ మండల స్థాయిలో వాలంటీర్లను ఏర్పాటు చేయనుంది. పేదలకు పైసాఖర్చు లేకుండా ఉచితంగా న్యాయసలహాలు అందిస్తారు. 2017 -18లో నాటి ప్రభుత్వం చేపట్టిన భూదస్త్రాల ప్రక్షాళన సందర్భంగా చిన్నచిన్న సమస్యలతో పక్కనపెట్టిన 18లక్షల ఎకరాల భూములకు స్పష్టత తీసుకురానున్నారు. భూభారతి చట్టంలోని 4(1) సెక్షన్‌ను అనుసరించి రాష్ట్రంలోని గ్రామాల్లో ఉన్న అన్ని రకాల భూములహక్కుల రికార్డులను రూపొందిస్తారు. కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్‌లో వివిధ రకాల భూ సంబంధిత సేవలను రెండు ప్రధానవిభాగాలుగా వర్గీకరించారు. ఇందులో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ (ఖాతా మార్పిడి), రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) కరెక్షన్, నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి), అప్పీల్ (సమీక్ష), భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, భూ ముల మార్కెట్ విలువ, నిషేధిత భూముల జాబితా, ఈచలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వంటి ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక మాడ్యూల్స్‌ను రూ పొందించారు. ఈ సేవలు భూవివరాలను మరింత సులభంగా పొందేందుకు ఉపకరిస్తాయి. అంతేకాకుండా భవిష్యత్తుల భూమిత్ర అనే ఒకప్రత్యేకమైన ఆప్షన్‌నుకూడా వెబ్‌సైట్‌లో అం దుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుతం భూ భారతి పోర్టల్ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతంగా కొనసాగుతోంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం, కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలం, ములుగుజిల్లాలోని వెంకటాపురం మండలం, నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలాలను ప్రభుత్వం ఎంపికచేసింది. ఈనాలుగు మండలాల్లో ప్రస్తుతం భూముల క్రయవిక్రయాలు పూర్తిగా భూభారతి పోర్టల్ ద్వారానే నిర్వహిస్తున్నారు. భూ భారతి చట్టం పేరుతో ప్రభుత్వం రైతులపై భారం మోపు తుందనే విమర్శలు వస్తున్నాయి. మ్యుటేషన్ కోసం ఎకరాకు రూ.2,500 వసూలు చేయనున్నది. కొత్త పాస్‌పుస్తకం కోసం రూ.300 చెల్లించాల్సిందే. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన రికార్డు మార్పులు, ఇతర అప్పీళ్ల కోసం రూ.1,000 ఫీజు సమర్పించుకోవాల్సిందే. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే అప్పటి నుంచైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారా, లేదా? అనే సందేహాలు రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమ వుతున్నాయి. తాజాగా పోర్టల్‌ను ప్రారంభించడంతోపాటు మార్గదర్శకాలు విడుదల చేసింది. భూభారతి అంతా సవ్యంగా ఉంటే పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎందుకు ఆసల్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తొలుత నాలుగుమండలాల్లో మాత్రమే అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని భూభారతిలోనూ అమలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యుటేషన్ కూడా పూర్తవుతుంది. ధరణిలోనూ ఇదేవిధానం అమల్లో ఉండేది. ఫౌతీ (వారసత్వ) భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మ్యుటేషన్‌కు 30 రోజుల విచారణ గడువు విధించారు. అయితే ధరణిలో గడువుకు బదులుగా రిజిస్ట్రేషన్ సమయంలోనే కుటుంబ సభ్యుల ఆమోద పత్రం తీసుకునేవారు. భూభారతి చట్టం వ్యవసాయ, వ్యవసాయేతర, ఆబాదీ భూములకు వర్తిస్తుంది. ధరణిలో కూడా ఇదే విధంగా ఉండేది. కానీ, హైకోర్టు ఆదే శాలతో వ్యవసాయేతర భూముల సేవల్ని నిలిపేశారు. ఇప్పుడు భూభారతిలోనూ వ్యవసాయ భూముల సేవలే అందుతున్నా యి. వ్యవసాయేతర భూములపై స్పష్టత లేదు. భూములకు భూధార్ పేరుతో నెంబర్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇది ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయాన్ని వెల్లడించలేదు. భూభారతి ప్రకారం యాజమాన్య హక్కుల నిర్ధారణ కోసం సివిల్ కోర్టును ఆశ్రయించాలి. భూ సమస్యలపై అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్లకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. గతంలో ధరణిలో కలెక్టర్‌కు మాత్రమే ఈ అధికారం ఉండేది. ఇక పాత భూసమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని సర్కారు ప్రకటించింది. కానీ, ఎప్పటి నుంచి వీటిని ప్రారంభిస్తారనేది వెల్లడించలేదు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేశారు. అయితే నెల రోజుల క్రితం సర్వేయర్లను నియమించి సర్వే మ్యాప్‌కు సంబంధించి శిక్షణ ఇవ్వడం కొసమెరుపు. ●

# ఆఖరి పోరాటం!

బీహార్

**ఎ.వి.వి ప్రసాద్**

ఎన్నికలకు ఇసి తాంబూలాలు ఇచ్చేసింది కానీ.. పార్టీలు మాత్రం ఇంకా తన్నుకుంటూనే ఉన్నాయి. కులాల కుంపట్లు రగులుతున్న బీహార్‌లో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు కత్తిమీద సాము వంటిదే అయినా, ఈసారి ఏవిధంగానైనా అధికారంలోకి రావాలనే కాంక్షతో 'మహాఘటబంధన్' గెలుపు గుర్రాలను బరిలోకి దింపుతోంది. అధికార ఎన్డీయే కూటమి కూడా తిరిగి తామే అధికార పగ్గాలు చేపట్టగలమనే ధీమాతో పాత నాయకులకే ఎక్కువ శాతం టిక్కెట్లు ఇస్తూ కొత్తవ్యూహాలతో సాగుతోంది. ఇప్పుడు రాజకీయాల్లో నడుస్తున్న 'ట్రెండ్'కు తగ్గట్టుగా అసాధారణమైన హామీలు సైతం అలవోకగా ఇచ్చేస్తూ మహాఘటబంధన్ (ఎంజిబి) నాయకులు ముందుకు దూసుకువెళ్తుంటే, ప్రధాని మోడీ ప్రకటిస్తున్న వరాలు, డబులింజన్ సర్కార్‌నినాదాలతో ఎన్డీయే పరుగులు తీస్తోంది. ఎంజిబి శిబిరాలవైపు చూస్తే ఎక్కువ కనిపించేది తేజస్వియాదవే. ఆ కూటమిలోని ప్రధాన పక్షమైన ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ 'పుత్రరత్నం'గా తేజస్వి ఇప్పటికే ముందంజలో ఉండగా, ఎన్డీయే కూటమి నుంచి సాక్షాత్తు ప్రధానే ఎన్నికల ప్రచారానికి సారథ్యం వహిస్తూ పార్టీ నేతలకు స్ఫూర్తినిస్తున్నారు. ఈ రెండిటి మధ్యలో 'జన్ సురాజ్' పార్టీ కూడా ఈసారి చక్రం తిప్పగలదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలోకి రావాలనే కాంక్ష ఆ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్‌కు కూడా ఉన్నా , కనీసం 'కింగ్ మేకర్' అయినా కాకపోతానా! అనే ధీమాతో కనిపిస్తున్నారు. ఎన్నికల వ్యూహకర్తగా యాత్ర మొదలుపెట్టి, గత సంవత్సరం పార్టీని స్థాపించిన కిశోర్ ఈఎన్నికల ఫలితాలను ఎంతో కొంత ప్రభావితం చేయగలరనే అనుకుంటున్నారు. అయితే అధికార కూటమిలోని జెడియు అధినేత, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ భవిష్యత్తే ప్రస్తుతం ప్రశ్నార్థకమవుతోంది. ఎన్డీయే కూటమికి ముఖ్యమంత్రి అభ్యర్థి ఆయనే అని బిజెపి అంటున్నా, నితీశ్‌కే నమ్మకం కలిగినట్లు కనిపించడం లేదు. దానికి కారణం. ఇటీవల పలుమార్లు వృద్ధాప్య సమస్యలతో ఆయన నవ్వులపాలు కావడమే. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగుతున్న నేతగా ఉన్న పేరుకు ఇక ఫుల్‌స్టాప్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. బీహార్‌కు తొమ్మిది సార్లు ముఖ్యమంత్రి అయిన నితీశ్ రికార్డు నిజానికి అసాధారణమే కానీ ఈ ఎన్నికల తర్వాత ఆయన మళ్లీ సిఎంకాగలరా! అనే అనుమానాలు అందరిలో కలుగుతున్నాయి. కొన్నిసార్లు ఆర్జేడీతో, మరికొన్ని సార్లు బిజెపితో చేతులుకలిపి నిలకడ లేని నేతగా ఆయన పేరుతెచ్చుకున్నారు. అయినా రాజకీయాల్లో ఆయన గట్టిగానే నిలబడ్డారు. 1998లో ఎన్డీయే కూటమి ఏర్పడిన తర్వాత బీహార్‌లో నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. ఆయన ఏ కూటమిలో ఉన్నా, ముఖ్యమంత్రి అభ్యర్థి ఆయనే అనే ప్రచారంతో కూటములు ముందుకు వెళ్లాయి. కానీ ఈసారి అటువంటి పరిస్థితి లేదనే అంటున్నారు. సభలు, సమావేశాలలో తొందరగా అలసటకుగురి కావడం, పరాకుగా మాట్లాడడం, అనుచరులపై చీకాకు పడడం ఆయన అనారోగ్య లక్షణాలుగా చెబుతున్నారు. మాట్లాడుతున్నప్పుడు గందరగోళానికి గురవుతూ బహిరంగ కార్యక్రమాల్లో అభాసుపాలవుతున్నారు.


సిఎం నితీశ్ కుమార్

ఆయన ఈ విచిత్ర ధోరణిని తేజస్వి, ప్రశాంత్ కిశోర్‌లు తరచుగా ప్రస్తావిస్తూ తమకు అనుకూలంగా వాడుకొంటున్నారు. ముఖ్యమంత్రి సామర్థ్యాన్ని వారిద్దరూ పదేపదే ప్రశ్నిస్తున్నారు. తరచుగా కూటములు మారడంవల్ల నితీశ్ ప్రజల విశ్వసనీయతను కోల్పోయారని తేజస్వి ఘాటుగానే విమర్శిస్తున్నారు. 2020 ఎన్నికల తర్వాత నితీశ్ సిఎం కావడం వెనుక బిజెపి చూపిన ఔదార్యమే కనిపిస్తుంది. ఆ ఎన్నికల్లో ఎంజిబి కంటే ఓ పదిహేను సీట్లు మాత్రమే అదనంగా సాధించి ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. 68 శాతం స్ట్రైక్ రేట్ తో 74 సీట్లలో గెలిచిన బిజెపి 37 శాతం స్ట్రైక్ రేట్ తో 43 సీట్లు మాత్రమే సాధించిన నితీశ్‌ను ముఖ్యమంత్రి పీఠంపైకూర్చో బెట్టింది. అంటే అప్పటికే జెడియు ప్రభావంబాగా తగ్గిందనే విషయం అర్థమవుతుంది. 2005లో జరిగిన ఎన్నికల్లో 88 సీట్లతో 20.46 శాతం ఓట్లు సాధించగా, తర్వాత సీట్లు, ఓట్లు కూడా గణనీయంగా పడిపోయాయి. నితీశ్ సిఎంఅయితే కావొచ్చు కానీ జెడియు పరిధిమాత్రం రాష్ట్రంలో కుదించుకుపోతూనే ఉంది. 2015 నాటికి జెడియు సీట్లు 71కి, ఓట్లశాతం 16.8కి పడిపోయింది. ఆ ఎన్నికల్లోనే జెడియు, ఆర్జేడీ, కాంగ్రెస్ కలిసి మహాఘట్ బంధన్‌గా ఏర్పడి బిజెపికి గట్టి పోటీనిచ్చాయి. 2020లో పరిస్థితి మరింత దిగజారినా 'కూటమి ధర్మం'లోభాగంగా బిజెపితిరిగి నితీశ్‌నే సిఎంను చేసింది. అంతవరకు కథబాగానే నడిచినా, గతరెండేళ్లుగా పరిస్థితిలో చాలామార్పు వచ్చినట్లుగా కనిపిస్తోంది. పలు వురు జెడియు నేతలు గత నాలుగైదు రోజుల్లో పార్టీని వదిలి వెళ్లిపోవడం ఓ పెద్ద కుదుపు అనేచెప్పాలి. సన్నిహితులే నితీశ్ కాలికింద గొయ్యి తవ్వుతున్నారనే అభిప్రాయం వినిపిస్తోంది. దీనిని బట్టి చూస్తే జెడియుకు గత ఎన్నికల కంటే సీట్లు ఇంకా తగ్గవచ్చు. అప్పుడు కూడా బిజెపి ఔదార్యం చూపగలదా! అన్నది సందేహమే. నితీశ్‌నుటార్గెట్‌చేస్తూ తేజస్వి చేసే 'వ్యతిరేక' ప్రచారం కూడా గణనీయమైన ప్రభావమే చూపవచ్చు. మరోవంక కాంగ్రెస్ అగ్రనేతరాహుల్ కూడా నితీశ్‌నే టార్గెట్ చేసి విమర్శిస్తున్నారు. ఇలా అనేకానేక కారణాల వల్ల నితీశ్ కుమార్‌కు ఇవే ఆఖరి ఎన్నికలు అవుతాయనీ మరోమారు ఆయన సిఎం కాలేకపోవచ్చనీ పరిశీలకులు భావిస్తున్నారు. 74 యేళ్లు దాటుతున్న నితీశ్ ఇటీవల తరచుగా అనారోగ్యానికి గురవుతూ రాజకీయాలపై తక్కువ ఆసక్తి చూపుతున్నారనే చెప్పాలి. ఏదిఏమైనా ఎన్నికల తర్వాతబీహార్ రాజకీయదృశ్యంలో చాలామార్పులొచ్చే సూచనలే కనిపిస్తున్నాయి. ఇప్పటికే వెలువడుతున్న సర్వేల్లో ఎన్డీయే ముందంజలో కనిపించినా, ఆ కూటమిలో నితీశ్ గ్రాఫ్ బాగా పడిపోయినట్లు చెబుతున్నారు. ఎన్నికల ఫలితాలు ఏం చెబుతాయో చూడాలి. ●

అఫ్ఘానిస్థాన్

భారత్‌లో ఈవారం పర్యటించిన విదేశీ ప్రముఖుల్లో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఒకరు కాగా రెండో వ్యక్తి అఫ్ఘానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా భారత్ పర్యటనకు వచ్చిన ఆదేశ విదేశాంగమంత్రి అమీర్‌ఖాన్ ముత్తాకీ. ఆయన పర్యటనపైనే ఇప్పుడు అటు అఫ్ఘానిస్థాన్‌తోపాటు పొరుగుననే ఉన్న పాక్, అమెరికా వంటి దేశాలు కూడా ఆసక్తి చూపించాయి. ఎందుకంటే ముత్తాకీ ఐక్యరాజ్య సమితి నిషేధిత ఉగ్రవాదుల జాబితాలో ఉన్న వ్యక్తి కావడమే. అఫ్ఘాన్ తాలిబన్లను ఉగ్రవాదులుగా ముందునుంచీ పేర్కొంటున్న భద్రతా మండలి ఇతర నేతలతోపాటు ముత్తాకీని కూడా ఆ జాబితాలో చేర్చింది. అందువల్లనే ఇప్పుడు ఆయన భారత్‌లో పర్యటించేందుకు ప్రత్యేక అనుమతులు తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితం అధికారం చేపట్టిన తర్వాత ఒక అఫ్ఘాన్ మంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. భారత్ అందించిన మానవతాసాయం, కరోనా కాలంలో అందించిన ఉదారహస్తం తాలిబన్లు గుర్తుంచుకునే ఉన్నారు. మోడీతో కలుస్తారా లేదా అన్నది పక్కనపెడితే విదేశాంగ మంత్రితో ఆయన సమగ్ర చర్చలు జరిపారు. విదేశీ ఉగ్రవాదులను అఫ్ఘాన్ గడ్డపైకి అనుమతించవద్దని భారత్ కోరుతున్నట్లుగానే అఫ్ఘాన్ మంత్రి తమ గడ్డపై విదేశీ ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం ఉపేక్షించమని, అటువంటి సంస్థలకు నూకలు చెల్లు అని ప్రకటించారు. పైగా ఆయన పర్యటనలో ఉన్న సమయంలోనే పాకిస్థాన్ సైనిక దళాలు అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌పై దాడిచేసి తెహ్రీక్ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టారు. అందులో సంస్థ చీఫ్ కూడా ఉన్నట్లు దాయాది ప్రకటించుకుంది. అయితే అఫ్ఘాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని ఇంకా ప్రపంచదేశాలు గుర్తించలేదు. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది. భారత్, రష్యా పర్యటనలకు ఉందే ముత్తాకి తమ అధినేత హైబతుల్లా అఖుంద్‌జాదాతో కాందహార్‌లో చర్చలు జరిపినట్లు తేలింది. అసలు పాకిస్థాన్ వైపు ముందు పర్యటన ఉన్నప్పటికీ ముందు భారత్‌తో సంబంధాలు పెంచుకునే లక్ష్యంతో రష్యా పర్యటనను సైతం పక్కనపెట్టి భారత్ పర్యటకు వచ్చారు. నిజానికి భారత్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘానిస్థాన్‌కు మద్దతుదారే. అయితే తాలిబన్ల పాలన వచ్చినప్పటినుంచి ఆచితూచి అడుగులువేస్తోంది. పొరుగుననే ఉన్న పాక్‌తో సమస్యలు, భద్రతా చిక్కులు, పాక్, తాలిబన్ల మధ్య ఉన్నశతృత్వం వంటి వాటివల్ల భారత్ కొంత వరకూ తాలిబన్లవైపు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మద్దతు ఇవ్వడంపై మన దేశ పరంగా స్పష్టతలేదు.

# 'ముత్తాకీ' పర్యటనపైనే నజర్!

**గన్ని మోహన్**

భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా అఫ్ఘాన్‌లో పర్యటించారు. విదేశాంగ మంత్రికూడా ముత్తాకీతో చర్చలు జరిపారు. ఆదేశ ఆహారవైద్య మంత్రి గత నెలలో నిర్వహించినహెల్త్ ఎగ్జిబిషన్ సందర్శనకు కూడా వచ్చారు. అఫ్ఘాన్ భూకంప సమయంలో భారత్ ఉదారంగాసాయం అందించింది. ఇరాన్ చాబహార్‌పోర్టు ద్వారా మరింతగా సాయం అందించింది. ముత్తాకి పర్యటనలో కీలక అంశం తమ ప్రభుత్వాన్ని భారత్ గుర్తించే విధంగా చర్చలు జరుపుకోవడమేనన్నది తెలిసిందే. అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు క్షీణించడాన్ని భారత్ తనకు అనుకూలంగా మార్చుకుంటుందనే చెప్పాలి. తాలిబన్ల ప్రభుత్వాన్ని కేవలం రష్యా మాత్రమే గుర్తించిం ది. పాక్ సహా మరే ఇతర దేశం కూడా అఫ్ఘాన్ తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించలేదు. చర్చల్లో ప్రధానంగా కాబూల్‌లో భారత రాయబార కార్యాలయం ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు. దీనితో రెండు దేశాల మధ్య ప్రత్యక్ష సంబంధాలు, దౌత్యపరమైన సంబంధాలు పెరుగుతాయని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. భారత్ కనుక తాలిబన్ సర్కారును గుర్తిస్తే అదే దారిలో మరి కొన్ని దేశాలు ముందుకు రాగలవని అందుకే ముత్తాకి భారత్‌లోపర్యటనకు వచ్చినట్లు పరిశీలకులు చేస్తున్న విశ్లేషణల్లో కూడా నిజం లేకపోలేదు. దీనికితోడు అఫ్ఘాన్‌లోని బగ్రామ్ ఎయిర్‌బేస్ తిరిగి ఇచ్చేయాలని లేదంటే స్వాధీనం చేసుకుంటామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలను కూడా తాలిబన్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అందుకే మాస్కోఫార్మా ట్ చర్చలకు కూడా అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి వెళ్లారు. ఈ కూటమి సదస్సు బగ్రామ్ ఎయిర్ బేస్ స్వాధీనాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అఫ్ఘాన్ పొరుగు దేశాల్లో సైనికదళాల మోహరింపు ఆమోదనీయం కాదని రష్యా ఫార్మాట్ సదస్సు లో తీర్మానం చేసారు. దీనికితోడు అఫ్ఘాన్‌పై అమెరికాకు ముందు నుంచీ చిన్నచూపే ఉంది. ఇప్పుడున్న సుంకాల బెడద మరోటి వచ్చిపడింది. ముందు తమ విదేశాంగ విధానం ద్వారా ప్రపంచ దేశాలకు చేరువ కావడం ద్వారా అమెరికా, పాక్ వంటి దేశాల హెచ్చరికలను సునాయాసంగా ఎదుర్కొనవచ్చని అఫ్ఘాన్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ముత్తాకి మొట్టమొదటిసారి భారత్ పర్యటనకు వచ్చారు. చర్చల సారాంశం తెలియకపోయినా అఫ్ఘాన్‌తాలిబన్ ప్రభుత్వానికి భారత్ మద్దతు అనేదికీలక అజెండా అని స్పష్టం అవుతోంది. అయితే భారత్ వైఖరి ఇక్కడ కీలకం అవుతోంది. అఫ్ఘాన్‌కు మద్దతివ్వడం ద్వారా మిత్రదేశాలతో పాటు ప్రపంచ వాణిజ్య, దౌత్యబంధం ఎక్కడా దెబ్బతినకుండా చూసుకోవాలన్నది భారత్ లక్ష్యం ఆదిశగా చూస్తే మరికొంత కాలం వేచిచూసేధోరణి భారత్ అవలంబించక తప్పదు. భారత్ గడ్డపైనుంచే తమదేశంలో విదేశీ ఉగ్రవాదుల స్థావరాలు ఎంతమాత్రం అంగీకరించబోమని, అటువంటి సంస్థలు, నిషేధిత వ్యక్తులకు ఇక నూకలు చెల్లినట్లేనని చెప్పడం ద్వారా ముత్తాకి భారత్‌కు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేసారని భావించాల్సివస్తోంది. ఏది ఎలా ఉన్నా ఇపుడు అఫ్ఘాన్‌తో భారత్ వైఖరి అనేది ఇపుడు ఆదేశంతోపాటు భారత్‌తో ధృఢమైన బంధాలున్న దేశాలకు కూడా కీలకంకాగలదని చెప్పడంలో ఎలాంటి సందేహంలేదు. ●


అమీర్‌ఖాన్ ముత్తాకి

# నిర్వీర్యం అవుతున్న సమాచార హక్కు చట్టం

**బండారు రామ్మోహనరావు**

రెండువేల ఇరవైనాలుగు సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీలతో సహా మిగతా పార్టీలన్నీ కూటమి కట్టి కలిపిన యుపిఏ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 2005లోనే వరసగా కొన్ని అభ్యుదయకరమైన చట్టాలు రూపొందాయి. అందులో మొదట సమాచార హక్కు చట్టంతో పాటు గృహహింస వ్యతిరేకచట్టం, మహాత్మా గాంధీ ఉపాధిహామీ గ్యారెంటీ చట్టం వచ్చాయి. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 2025 అక్టోబర్ 12నాటికి సరిగ్గా 20 సంవత్సరాలు పూర్తవుతుంది. ఆ చట్టం ఉద్దేశం, పరిధి పరిమితులు ఎంతో ఉన్నతంగా ఉన్నా అమలులో 20ఏళ్ల ప్రస్థానంలో ఏం జరిగింది ఏం జరగాలి అనే విషయాలను మనం చర్చించుకుందాం. సమాచార హక్కు చట్టం దేశంలో మిగతా చట్టాల కమిటీ చాలా ప్రత్యేకమైన చట్టంగా చెప్పుకోవచ్చు. ఈ చట్టం మిగతా చట్టాల కంటే విస్తృతమైనది విలువైనది. స్వాతంత్ర్యాంతరం ఇప్పటివరకు పార్లమెంట్ ద్వారా ఏ చట్టం చేసినా నిబంధనలు, విధివిధానాలు రూపొందించినప్పటి నుండే అది అమలవుతుందనే ఒక క్లాజు తప్పనిసరి ఉండేది. ఏదైనా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి మెజార్టీ సభ్యులు ఆమోదిస్తే అది చట్టంగా మారడానికి దేశంలో రాష్ట్రపతి, రాష్ట్రాలలో గవర్నర్లు సంతకం చేయాలి. ఆ చట్టానికి సంబంధించి విధివిధానాలు తయారైనతర్వాత ఆచట్టం వాస్తవంగా అమలులోకి వచ్చేది. ఇలా చాలాచట్టాలు రాష్ట్రపతి గవర్నర్ల సంతకమైన తర్వాత కూడా విధివిధానాలు రూపొందించకుండా శిశుమరణాల లాగానే పురుట్లోనే సంధికొట్టి మరణించేవి. ఒక మాటలో చెప్పాలంటే ఆ చట్టాలు అమలు కాకపోయేవి. అలా 2002లో సమాచార స్వేచ్ఛ హక్కు చట్టం కూడా వచ్చింది. దాని విధివిధానాలు ఖరారు కాకపోవడం వల్ల అది అక్కరకు రాని చుట్టంగా మారిపోయింది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని 2005 జూన్ 15న భారత పార్లమెంటులో సమాచార హక్కు చట్టం బిల్లు పాసై చట్టంగా మారింది. ఆ చట్టంలోనే రాష్ట్రపతి సంతకం అయిన రోజు నుండి 120 రోజుల తర్వాత వెంటనే చట్టం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ఒక్క చట్టంలో మాత్రమే ఇలాంటి ఏర్పాటుచేశారు. ఆ చట్టంలో ఉన్న విధంగానే సరిగ్గా జూన్ 15 2005రోజు నుండి అక్టోబర్ 12, 2005 వరకు 120రోజులు నిండి ఆరోజు నుండి దేశవ్యాప్తంగా ఈ చట్టం అమల్లోకి వచ్చింది. సమాచార హక్కు చట్టానికిఉన్న ప్రాధాన్యత అది. ఆ తర్వాత ఏం జరిగిందంటే ఈ చట్టం ప్రకారం దేశంలో జాతీయ సమాచార హక్కుచట్టం కమిషన్ ఏర్పడింది. అదేవిధంగా రాష్ట్రాలలో ప్రతిరాష్ట్రానికి ఒక సమాచార హక్కుచట్టం కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ సమాచార హక్కు చట్టంలో మొత్తం ఆరు అధ్యాయాలు 31 సెక్షన్లు ఉన్నాయి. ఏ చట్టమైన ప్రజలకు అవగాహన లేకపోతే ఆ చట్టం నిరుపయోగంగా మారిపోతుంది. కనుక సమాచార హక్కు వివిధవర్గాలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం అప్పట్లో మంచి ప్రయత్నంచేసింది. చట్టం పట్ల ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాకు, ప్రభుత్వ అధికారులకు, పౌర సమాజానికి వేరువేరుగా అవగాహన కల్పించడానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఒక మంచి ప్రయత్నం జరిగింది. హైదరాబాదులోని సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ వారితోకలసి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పౌర సమాజానికి శిక్షణ ఇవ్వడానికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఒక ఒప్పందం కుదురుచుకుంది. ఆ ప్రకారం పౌర సమాజానికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 200కు పైగా నియోజకవర్గాలలో ఒక సంవత్సరానికి పైగా సమాచార హక్కు చట్టం గురించి అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ప్రెస్ మీడియా మిత్రులకు అవగాహన కల్పించడానికి ప్రెస్ అకాడమితో పాటు ఆంధ్రప్రదేశ్‌వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ కూడా ఒక ఒప్పందం కుదుర్చుకుని వారు మీడియా మిత్రులకు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చింది. మాజీ ఐఎస్ మాజీ ఆర్డీవోలు వాళ్లందరి ద్వారా




ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ అధికారులకు ఇచ్చిన శిక్షణ తూతూమంత్రంగా ముగిసింది. కొంతమంది బాధ్యత కలిగిన కమిట్మెంట్ ఉన్న అధికారులు ఈ శిక్షణ బాగా ఇచ్చినా కూడా ఆ శిక్షణను స్వీకరించే అధికారులలో కొందరిలో నిర్లిప్తత ఎక్కువమందిలో ఈ సమాచార హక్కు చట్టం పట్ల వ్యతిరేకత ఉండడం వల్ల సమాచార హక్కు ప్రజలకు అందకూడదు. అందితే తమకే నష్టం అని భావించిన అధికారులు ఈశిక్షణను సీరియస్‌గా తీసుకోలేదు. తీసుకున్నా చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని ప్రజలకు సమాచారం ఇవ్వకుండా ఎలా తప్పించుకోవచ్చో ఆ చట్టంలోని క్లాజులను బాగా ఆకలింపు చేసుకున్నారు. అందుకే ఇప్పుడు మీరు ఏదైనా సమాచారం కోరితే ముక్తసరిగా ఇది సమాచార హక్కు పరిధిలోకి రాదని మా వద్ద మీరడిగిన సమాచారం లేదని సమాధానం ఇచ్చి ఊరుకుంటున్నారు. అందుకే అధికారుల సహకారం లేనిదే ఈ సమాచారహక్కు చట్టం అమలు సాధ్యం కాదని తేలిపోయింది. ఇక సమాచార హక్కు చట్టం కమిషన్ల నియామకంలో కూడా మొదట కొంచెం చిత్తశుద్ధితో పనిచేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమాచార హక్కుచట్టం వల్లతమ అవినీతిపరులు బయటపడుతున్నాయని తమ చాపకిందికి నీళ్లు వస్తున్నాయని తెలుసుకొని ఉద్దేశపూర్వకంగానే మెల్లమెల్లగా సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించే విషయంలోనిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టాయి. చాలా రాష్ట్రాలలో సమాచార హక్కు కమిషన్లు ఉనికిలో లేకుండా పోయాయి. ఆఫీసుస్టాఫ్ ఉంటారు కానీ సమాచారహక్కు కమిషనర్లు ప్రధాన ఎన్నికప్రధాన కమిషనర్‌ల నియామకం లేకపోవడంవల్ల ఏళ్లతరబడి సమాచార హక్కు కమీషన్లు పనిచేయడం లేదు. ఒకవేళ సమాచార హక్కు కమిషనర్లను నియమించినాకూడా వారి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు నాయకులకు అడుగులకు మడుగులొత్తే అధికారులను మాత్రమే కమిషనర్లుగా నియమిస్తున్నారు. పౌర సమాజంలో సమాచార హక్కుచట్టం గురించి పోరాడిన అనేకమంది ఉద్యమకారులను కాదని తమ తాబేదారులుగా ఉన్న తమపార్టీ సానుభూతిపరులను అనధికారులను కూడా సమాచార హక్కు కమిషనర్లుగా నియమించుకుంటున్నారు. దాని ద్వారా సమాచార కమిషన్ కమిషన్లు చాలా పెద్ద తప్పులు చేసిన అధికారులను కూడా కేవలం మందలించి ఊరుకుంటున్నారే తప్పఎవరికైతే న్యాయం చేయాలో వారికి సరైన న్యాయం చేయడంలేదు. కిందిస్థాయి అధికారులు సమాచారం ఇవ్వని సందర్భంగా పై సమాచార హక్కు కమిషనర్లను ఆశ్రయిస్తే ఫిర్యాదుదారులను అప్పీలుదారులనేమో విచారణ సందర్భంగా దోషిగా నిలబెట్టిన విధంగా నిలుచుండబెట్టే మాట్లాడిస్తున్నారు. అదే సమాచార ఇవ్వకుండా అలసత్వం చేసి తప్పిదాలకు పాల్పడ్డ అధికారులను కూర్చుండబెట్టి విచారణ జరుపుతున్నారు. సమాచార హక్కు కోసం తపించే ఫిర్యాదుదారులకు కమిషన్లు ఇచ్చే మర్యాద ఈ విధంగా ఉంది. అలాగే సమాచార హక్కు కమిషన్లకు విచారణ నిమిత్తం వచ్చిన అధికారులు తాము ఆ కమిషన్ల ముందు హాజరైనందుకు టీఏ, డీఏలు కూడా క్లైమ్ చేసుకుం టున్నారు. కానీ ఫిర్యాదుదారు తన సొంత ఖర్చుతో ఈ కమిషన్ల ముందు హాజరు కావలసి వస్తుంది. సమాచారం ఇవ్వని అధికారులు నేరస్తులుగా ఉండికూడా వారు అధికార దర్పంతో విచారణ ఎదుర్కొంటే సమాచారం పొందని దర ఖాస్తుదారులు బేలగా కమిషన్ ముందు నిలబడే పరిస్థితి తయారయింది. ఇప్పటికి కూడా పౌర సమాజం ఈ సమాచార హక్కును ఉపయోగించుకోవడానికి ఎంతో ఉత్సాహం చూపుతుంది. కానీ అధికారుల సహాయ నిరాకరణ పెద్ద అవరోధంగా మారింది. అలాగే సమాచార హక్కు అమలు చేసే అధికారులు కమిషన్లు ప్రవర్తిస్తున్న తీరువల్ల సమా చారహక్కు చట్టం రెండు దశాబ్దాల తర్వాత తుప్పు పట్టిన చట్టంగా మిగిలిపోయింది. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు సమాచార హక్కు నిర్వీర్యం కావడానికి మొదట ప్రభుత్వం తర్వాత ప్రభుత్వంలో పని చేసే అధికారులు కమీషనర్ల పనితీరు చివరికి ప్రజలలో సమాచార హక్కు పేరు మీద బ్లాక్ మెయిల్ చేసే కార్యకర్తలు వెరసి సమా చార హక్కు చట్టం ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలిపోతుం ది. ఇది మారాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వచ్ఛందంగా వెల్లడించే క్లాజు 4.1బి ప్రకారం 17 అంశాలతో కూడుకున్న సమాచారాన్ని ఆయా ఆఫీసులలో మొదట వెల్లడించాలి. అప్పుడు సమాచారం అడిగే అవసరం చాలావరకు ప్రజలకు తప్పుతుంది. ●

# పప్పు దినుసుల సాగు మరింత పెరగాలి

## పిఎం ధన్‌ధాన్య కృషి యోజనను ప్రారంభించిన ప్రధాని మోదీ
## రైతుల ఆదాయం పెంచేదిశగా చర్యలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికంగా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన దేశంలో పండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే, తమ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని ఆయన తెలిపారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని మోదీ అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటినీ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు వేయించలేదని, అలాంటి ప్రాంతాలను తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందని అన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని, పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.



# వయనాడ్ పంటపొలంలో మోదీ ఆకృతిలో సాగుచేసిన రైతు!

**తిరువనంతపురం, అక్టోబరు 11:** ప్రధాని నరేంద్ర మోదీపై తనకున్న అభిమానాన్ని కేరళకు చెందిన ఓ రైతు తయ్యిల్ ప్రసీద్ తన పొలంలో వివిధ రకాల, రంగుల వరి వంగడాలతో మోదీ చిత్రం ఆకృతిలో సాగు చేశారు. 40మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ పొలాన్ని పై నుంచి చూసినప్పుడు అందులో మోదీ చిత్రం ఓ అందమైన పెయింటింగ్‌లా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దశాబ్దానికి పైగా ఆయన వివిధ ఆకృతుల్లో పంటలు సాగు చేస్తున్నారు. గతంలోనూ బుద్ధుడు, స్వామి వివేకానంద, ఆదియోగి వంటి పలు ఆకృతుల్లో పంటలు పండించినట్లు ప్రసీద్ పేర్కొన్నారు. మొదటిసారి భారతదేశ పటం ఆకృతిలో సాగు చేసినట్లు తెలిపారు. వాస్తవానికి సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రధాని చిత్రం ఆకృతిని రూపొందించడానికి ప్రయత్నించినప్పటికీ పంట పెరుగుదల ఆలస్యం కావడంతో మోదీ చిత్రం ఆకృతిలోని సాగు ఇప్పుడు చేతికి వచ్చిందన్నారు. వివిధ రకాల వరిని పెంచడంతో పాటు తయ్యిల్ ప్రసీద్ దేశంలో దొరికే 350కి పైగా రకాల వరి వంగడాలను సేకరించి బతేరీలో ఓ మ్యూజియం ఏర్పాటు చేశారు. సంప్రదాయ వరి వంగడాలను సంరక్షించడం కోసమే దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2023లో తయ్యిల్ ప్రసీద్ ఉత్తమ రైతుగా నేషనల్ ప్లాంట్ జీనోమ్ అవార్డును పొందారు.



## డబ్లిన్‌లో భారతీయ మహిళపై జాత్యహంకార దూషణలు


**డబ్లిన్, అక్టోబరు 11:** ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో నివసిస్తున్న స్వాతి వర్మ అనే భారత యువతికి ఒక భయానక అనుభవం ఎదురైంది. జిమ్ నుంచి ఇంటికి నడిచి వెళ్తున్న ఆమెపై గుర్తు తెలియని మహిళ జాత్యహంకార దూషణలకు పాల్పడింది. ఈనెల 8న జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగుతోంది. స్వాతి వర్మ తన ఇంటికి సమీపంలో ఉండగా, డబ్లిన్ సిటీ యూనివర్సిటీ (డీసీయూ) బ్యాడ్జ్ ధరించిన ఒక మహిళ ఆమెను సమీపించింది. దారి అడుగుతుందేమోనని స్వాతి భావించగా ఆమె అనూహ్యంగా నువ్వు ఐర్లాండ్‌కు ఎందుకొచ్చావు, ఇక్కడ ఏం చేస్తున్నావు మీ దేశానికి తిరిగి వెళ్ళిపో అంటూ దురుసుగా ప్రశ్నించడం ప్రారంభించింది. ఈ అనూహ్య పరిణామంతో స్వాతి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ మహిళ అక్కడితో ఆగకుండా నీకు వర్క్ వీసా ఉందా అని ప్రశ్నించింది. దానికి స్వాతి బదులిస్తూ అవును, నేను ఇక్కడ ఉచితంగా ఉండటం లేదు. పన్నులు చెల్లిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు నా వంతు సహకారం అందిస్తున్నానని స్పష్టం చేశారు. అయితే, ఆ మహిళ నువ్వు చేసిన అతిపెద్ద తప్పు అదే వెంటనే ఇండియాకు తిరిగి వెళ్లు అని బదులిచ్చింది. ఈ సంభాషణలో కొంత భాగాన్ని స్వాతి తన ఫోన్‌లో రికార్డ్ చేశారు. ఆ వీడియోలో, నువ్వు ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుని యజమానులకు డబ్బులిస్తున్నావు. వాళ్లకు అధికారం ఇస్తున్నావు. కానీ, నేనే అధికారం, నేనే శక్తిని అంటూ ఆ మహిళ వింతగా మాట్లాడటం వినిపిస్తోంది. ఈ క్రమంలో ఒక బాటసారి కల్పించుకోగా, అతడిపై కూడా ఆమె అదే విధంగా దూషణలకు దిగింది. ఈ దాడితో తాను తీవ్రంగా భయపడ్డానని, షాక్‌కు గురయ్యానని స్వాతి తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. తాను సురక్షితంగా ఉండాలన్నదే తన మొదటి ఆలోచన అని తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, స్వాతికి భారీగా మద్దతు లభిస్తోంది. ఆమె ధైర్యాన్ని, సంయమనాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# ట్రంప్ వయసు 79.. ఆయన గుండెకు 65!



## వైట్‌హౌస్ డాక్టర్లు వెల్లడి

**వాషింగ్టన్, అక్టోబరు 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (79) అసాధారణ ఆరోగ్యంతో ఉన్నారని వైట్‌హౌస్ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన అత్యధిక వయసు కలిగిన వ్యక్తిగా ట్రంప్ గుర్తింపు పొందారు. అయితే ఆయన గుండె వయస్సు మాత్రం అతని వయస్సు కన్నా 14 యేళ్లు చిన్నదిగా ఉన్నది వైట్‌హౌస్ వైద్యవర్గాలు పేర్కొన్నాయి. గత జనవరిలో వైట్‌హౌస్‌లో తిరిగి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన 79 యేళ్ల ట్రంప్ తన పరిపాలనలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. 'ట్రంప్ అసాధారణ ఆరోగ్యంతో ఉన్నారు. అతని గుండె ఎంతో చక్కగా పనిచేస్తున్నదని ట్రంప్ వ్యక్తిగత వైద్యుడు సీన్ బార్బబెల్లా తెలిపారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మీడియాకు వెల్లడించారు. ట్రంప్ తన అంతర్జాతీయ ప్రయాణానికి ముందుగా కోవిడ్-19 బూస్టర్ టీకాలు తీసుకోవడంతో పాటు పలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. మంచి రోగనిరోధక శక్తి పొందారని కరోలిన్ లీవిట్ తెలిపారు. ట్రంప్ గుండె పని తీరు అతనికన్నా 14 యేళ్ల చిన్న వయసులో అంటే 65 యేళ్ల వయసులో ఉన్న గుండె మాదిరిగా చురుకుగా పని చేస్తున్నదన్నారు. ట్రంప్ ఆరోగ్యంపై యేడాదిగా పలు వార్తలు వెలువడుతున్నాయి. 2024 ఎన్నికల సమయంలో నాటి అధ్యక్షుడు జో బైడెన్ వయసు, ఆరోగ్యంపై అప్పటి ప్రత్యర్థి ట్రంప్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో బైడెన్ అధ్యక్ష పోటీ నుంచి తప్పుకున్నారు. ఆ సమయంలో ట్రంప్ తాను ఆరోగ్యంపరంగా ఫిట్‌గా ఉన్నానని ప్రకటించుకున్నారు. తాజాగా ట్రంప్ మేరీల్యాండ్‌లోని బెథెస్డాలోని వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరు నెలల తర్వాత ట్రంప్ చేయించుకున్న వైద్య పరీక్షల్లో కొలెస్ట్రాల్‌నియంత్రణలో ఉందని వెల్లడయ్యింది. గత జూలైలో అధ్యక్షుడు ట్రంప్ తన కాళ్ల దిగువ భాగంలో వాపు, కుడి చేతిలో గాయాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. దీనికి సంబంధించిన ఫొటోలు కూడా అప్పట్లో దర్శనమిచ్చాయి. ఈ సమయంలో వ్యక్తిగత వైద్యుడు సీన్‌బార్బబెల్లా మాట్లాడుతూ 70 యేళ్లు పైబడిన వారిలో కాళ్లలో వాపు కనిపించడం సాధారణమైన స్థితి అని తెలిపారు. అలాగే తరచూ కరచాలనం చేయడం, ఆస్పిరిన్ వాడకం కారణంగా ట్రంప్ చేతికి గాయాలు కనిపిస్తున్నాయని తెలిపారు. 2020లో ట్రంప్ తన మొదటి పదవీ కాలంలో కోవిడ్-19 బారిన పడి కోలుకున్నారు.



## కరూర్ బాధిత కుటుంబాలకు 17న విజయ్ పరామర్శ
### ప్రత్యేక వేదిక వద్ద వారితో సమావేశం

**చెన్నై, అక్టోబరు 11:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో విజయ్ భారీ భద్రత నడుమ బాధిత కుటుంబాలను కలవనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బాధిత కుటుంబాలను వారి ఇళ్ల వద్ద కాకుండా ఓ ప్రత్యేక వేదికలో ఈ నెల 17న పరామర్శించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే వేదికకు సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడించలేదు. విజయ్ బాధితులను కలిసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేయాలని టివికె పార్టీ విజ్ఞప్తి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ధృవీకరించారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో మాత్రమే మీడియాను అనుమతిస్తామని తెలిపారు. తిరుచ్చి విమానాశ్రయం నుంచి కరూర్‌లోని సమావేశ వేదిక వద్దకు విజయ్ చేరుకునే వరకు దారిలో ఎక్కడా జనం గుమిగూడకుండా విమానాశ్రయ, ట్రాఫిక్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. కరూర్‌లోని వేదిక నుంచి ఒక కిలోమీటరు మేర ప్రజలెవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ వర్గాలు కోరినట్లు తెలిపారు. కేవలం బాధిత కుటుంబ సభ్యులకు మాత్రమే వేదిక వద్దకు ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టివికెకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. మరోవైపు ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.

# తేజస్వి యాదవ్‌కే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రజల ఓటు!



**పాట్నా, అక్టోబరు 11:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. తాజాగా వెలువడిన సీ ఓటర్ ఒపీనియన్ పోల్ ఫలితాలు ఈ ఉత్కంఠను మరింత పెంచాయి. ఈ సర్వే ప్రకారం, అధికార బీజేపీజేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు 40 శాతం అవకాశాలు ఉన్నాయని తేలింది. అయితే, ముఖ్యమంత్రి అభ్యర్థిగా మాత్రం ఆర్జేడీ యువనేత తేజస్వి యాదవ్‌కే ప్రజలు పట్టం కట్టారు. సీ ఓటర్ సర్వే అంచనాల ప్రకారం ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ కూటమి 38.3 శాతం ఓట్లతో ఎన్డీఏకు గట్టి పోటీ ఇస్తోంది. మరోవైపు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన ప్రశాంత్ కిశోర్ జన్‌సురాజ్ పార్టీ కూడా 13.3 శాతం మద్దతుతో మూడో స్థానంలో నిలిచి కీలక పాత్ర పోషించనుంది. కూటముల వారీగా ఫలితాలు ఇలా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిగా ఎవరిని చూడాలనుకుంటున్నారనే ప్రశ్నకు భిన్నమైన సమాధానాలు వచ్చాయి. ఏకంగా 36.5 శాతం మంది ప్రజలు తేజస్వి యాదవ్‌కు మద్దతు తెలిపారు. ఆ తర్వాత 23.2 శాతంతో ప్రశాంత్ కిశోర్ రెండో స్థానంలో నిలవగా, ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేవలం 15.9 శాతం మద్దతుతో మూడో స్థానానికి పరిమితం కావడం గమనార్హం. ఎన్నికల తేదీలు సమీపిస్తున్నా, రెండు ప్రధాన కూటముల్లోనూ సీట్ల పంపకాలపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఎన్డీఏలో జేడీయూ 102, బీజేపీ 101 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 45 సీట్లు డిమాండ్ చేస్తుండటంతో చర్చలు కొలిక్కి రావడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాట్నా చేరుకుని నేతలతో సమావేశమయ్యారు. ఇక విపక్ష మహాఘట్‌బంధన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్జేడీ 135 నుంచి 140 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తుండగా, మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 50నుంచి 52 సీట్లు ఆఫర్ చేసింది. అయితే, కాంగ్రెస్ 70 సీట్లు కావాలని పట్టుబడుతోంది. గత ఎన్నికల్లో 70 స్థానాల్లో పోటీ చేసి కేవలం 19 సీట్లే గెలుచుకున్న నేపథ్యంలో, ఈసారి కాంగ్రెస్ డిమాండ్‌కు ఆర్జేడీ తలొగ్గడం లేదు. సీపీఐ (ఎంఎల్) కూడా తమకు కేటాయించిన సీట్లపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు. ఈ నేపథ్యంలో, య్వరలో సీట్ల సర్దుబాట్లు పూర్తి చేసుకుని అభ్యర్థులను ప్రకటించేందుకు పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి.



## దగ్గుమందు మరణాలకు అధికారుల నిర్లక్ష్యమే కారణం: వెల్లడించిన కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** దగ్గుమందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కంపెనీని ఇప్పటివరకు వారు ఒక్కసారి కూడా తనిఖీ చేయ లేదన్నాయి. దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ పలు వైఫల్యాలను గుర్తించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కోల్డ్‌రిఫ్ దగ్గుమందు వద్ద మధ్యప్రదేశ్‌లో 20 మందికిపైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీ పురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా సిరప్‌లో 48.6శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తన దర్యాప్తులో పలు లోపాలను గుర్తించినట్లు సమాచారం.

# సంక్షిప్తంగా..



## పోలీసు శిక్షణా కేంద్రంపై ఆత్మాహుతి దాడి: ఏడుగురు మృతి

**ఇస్లామాబాద్, అక్టోబరు 11:** దాయాది పాకిస్థాన్‌లో ఉగ్రమూక మరోసారి రెచ్చిపోయింది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ పోలీసు శిక్షణా కేంద్రంపై ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఏడుగురు పోలీసులు మరణించారు. దాడి తర్వాత అక్కడ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని రట్టా కులాచి పోలీసు శిక్షణా పాఠశాలపై ఉగ్రవాదులు శుక్రవారం రాత్రి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. పేలుడు పదార్థాలు నిండిన ట్రక్కు శిక్షణ పాఠశాల ప్రధాన ద్వారాన్ని ఢీకొట్టింది. ఈ దాడిలో ఏడుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దాడికి ప్రతీకారంగా పోలీసులు ఆప్రాంతంలో కాల్పులు జరిపారు. ఈ ప్రతీకార కాల్పుల్లో తొలుత ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, ఆ ప్రాంతంలో మరింత మంది ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న అనుమానంతో దాదాపు 5 గంటల పాటు భద్రతా సిబ్బంది ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మరో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. ఇక ఈ ఘటనలో 13 మంది పోలీసులు కూడా గాయపడ్డారు.

## ముత్తాకి ప్రెస్‌మీట్‌కు అనుమతిలేని మహిళలు!
### తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసిన మహిళా జర్నలిస్టులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ సమావేశానికి మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో భారత ప్రభుత్వం తాజాగా స్పందించింది. ఈ ప్రెస్ మీట్ నిర్వహణలో తమకు ఎలాంటి పాత్ర లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయంలో ఈ మీడియా సమావేశం జరిగింది. అయితే, దీనికి మహిళా జర్నలిస్టులెవరినీ అనుమతించలేదు. కొంతమంది మహిళా రిపోర్టర్లను లోపలికి రాకుండా అడ్డుకున్నారని కూడా వార్తలు వచ్చాయి. దీంతో పలువురు జర్నలిస్టులు సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. తామంతా నిబంధనల ప్రకారం డ్రెస్ కోడ్ పాటించినా అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ వివరణనిచ్చింది. ముంబైలోని ఆఫ్ఘన్ కాన్సుల్ జనరల్ కార్యాలయం నుంచి ఢిల్లీలోని కొందరు జర్నలిస్టులను ఎంపిక చేసి ఆహ్వానాలు పంపారని తెలిపింది. ఆఫ్ఘన్ రాయబార కార్యాలయ ప్రాంగణం భారత ప్రభుత్వ పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఘటన రాజకీయ రంగు పులుముకుంది. మహిళా జర్నలిస్టులను అవమానించడంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీవాద్రా ఈ విషయంపై స్పందిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశానికి గర్వకారణమైన మహిళలకు ఇలాంటి అవమానం జరగడం దారుణమని ఆమె అన్నారు. పర్యటనలో భాగంగా ఆఫ్ఘన్ మంత్రి ముత్తఖీ భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు. వాణిజ్యం, అభివృద్ధి సహకారం వంటి అంశాలపై చర్చించారు. అయితే, ఆ తర్వాత జరిగిన మీడియా సమావేశానికి మాత్రం చాలా మంది జర్నలిస్టులకు సమాచారం ఇవ్వలేదు. కేవలం 1516 మందిని మాత్రమే ముంబై కాన్సులేట్‌కు చెందిన తాలిబన్ అధికారి ఇక్రముద్దీన్ కామిల్ స్వయంగా ఫోన్ చేసి పిలిచినట్లు తెలిసింది. ఇలా కొందరినే ఎంపిక చేసి పిలవడం, మహిళలను పూర్తిగా దూరం పెట్టడం పత్రికా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆఫ్ఘనిస్థాన్‌లో మహిళలపై తాలిబన్ల కఠిన ఆంక్షల నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది.

## కాల్పుల విరమణ అమలుకు వచ్చిందన్న ఇజ్రాయెల్ మిలటరీ

**టెల్‌అవీవ్, అక్టోబరు 10 :** ఇజ్రాయెల్‌హమాస్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం శుక్రవారం నుంచి అమలులోకి వచ్చినట్టు ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. చర్చల్లో పేర్కొన్న విధంగా మోహరించిన తమ దళాలు వెనుదిరుగుతున్నట్టు ఐడీఈ ఎక్స్‌లో తెలిపింది. కాగా, సదరన్ కమాండ్‌లో మోహరించిన ఐడీఈ దళాలు మాత్రం కొనసాగుతూ ఏదైనా ముప్పు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటాయని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులతో స్వస్థలాలను వీడిన పాలస్తీనీయులు తిరిగి వెనక్కి వస్తున్నారు. ఒప్పందంలో భాగంగా హమాస్‌కు 72 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఆ డెడ్‌లైన్ లోగా హమాస్ తన వద్ద ఉన్న బందీలందరినీ ఇజ్రాయెల్‌కు అప్పగించాల్సి ఉంది. ప్రస్తుతం ఐడీఈ దళాల ఆధీనంలో 53 శాతం గాజా ప్రాంతం ఉంది. కాగా, హమాస్ చేతిలో ఉన్న బందీలందరూ సజీవంగానే ఉన్నారని భావిస్తున్నామని, వారిని సోమవారం మధ్యాహ్నం 12 గంటలలోగా అప్పగించాల్సి ఉందని ఇజ్రాయెల్ అధికారి పేర్కొన్నారు. ఇంతకు ముందు జరిగిన అప్పగింత రెడ్‌క్రాస్ చేతుల మీదుగా జరిగింది. ఒప్పందంలో భాగంగా 28 మంది బందీల మృతదేహాలను కూడా అప్పగించాల్సి ఉంది. అయితే దీనిని ఎప్పుడు చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. అలాగే ఇజ్రాయెల్ జైళ్లలో జీవిత ఖైదును అనుభవిస్తున్న 250 మంది పాలస్తీనావాసులు, గాజా నుంచి 1700 మంది ఖైదీలను కూడా విడుదల చేయాల్సి ఉంది.



## లాహోర్‌లో అల్లర్లు:11 మంది మృతి

**ఇస్లామాబాద్, అక్టోబరు 11:** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ (టిఎల్‌పి) కార్యకర్తలు గురువారంనుంచి పాకిస్థాలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ అల్లర్లలో పంజాబ్ పోలీసులు తమ 11 మంది కార్యకర్తలను హత్య చేసినట్లు ఆపార్టీ చీఫ్ సాద్‌రిజ్వి ఆరోపించారు. ఘర్షణల సమయంలో 24 మందికిపైగా కార్యకర్తలు గాయపడినట్లు పేర్కొన్నారు. వారిని ఆస్పత్రులకు తీసుకువెళ్తే వైద్యం చేయడానికి కూడా అక్కడి వైద్యులు నిరాకరించారన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు ఉద్దేశపూర్వకంగానే దాడులు చేస్తున్నారని సాద్ రిజ్వి ఆరోపించారు. శాంతియుతంగా చేపట్టిన నిరసనలను హింసాత్మకంగా అణచివేయాలని చూస్తున్నారన్నారు. ఎవరి ఆదేశాలతో తమపై కాల్పులు జరుపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. తన నివాసంపై దాడిచేసి తన తల్లిని, భార్యా పిల్లలను అదుపులోకి తీసుకున్నారని మండిపడ్డారు. గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు గురువారం పాక్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు.



## అమెరికాలోని టెన్నెస్సీలో భారీ పేలుడు: 19 మంది గల్లంతు

**వాషింగ్టన్, అక్టోబరు 11:** అమెరికాలోని టెన్నస్సీ రాష్ట్రంలో భారీ పేలుడు సంభవించింది. స్థానిక మిలిటరీ యుద్ధ సామగ్రి ప్లాంట్‌లో ఒక్కసారిగా భారీపేలుడు జరగగా 19మందివరకు గల్లంతైనట్లు సమాచారం. పేలుడు దాటికి సమీపంలోని కార్లు చెల్లాచెదురయ్యాయి. చాలా కార్లు మంటల్లో దగ్ధమయ్యాయి. దీంతో ఆఅటవీప్రాంతమంతా దట్టంగా పొగ వ్యాపించింది. స్థానిక అక్యురేట్ ఎనర్జెటిక్‌సిస్టమ్స్ (ఎఇఎస్)అనే కంపెనీ ప్రాంగణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భారీపేలుడు జరిగినసమయంలో ఫ్యాక్టరీలో 19మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. ప్రమాదతీవ్రతకు వారంతా గల్లంతయ్యారు. వీరిలో చాలా మంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు.



## నా తలరాత నాకు తెలుసు: డికె శివకుమార్

**బెంగళూరు, అక్టోబరు 11:** కర్ణాటకలో కొంతకాలంగా సిఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో ముఖ్యమంత్రి మార్పు ఉండవచ్చన్న కథనాలపై శనివారం డిప్యూటీ సిఎం డికె శివకుమార్ స్పందించారు. తనకేంతొందరలేదని, తన తలరాత ఏంటో తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే ఆశ తన కు ఉందనేలా పరోక్షంగాబదులిచ్చారు. కర్ణాటక ప్రభుత్వంలో ప్రస్తుతం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న 50శాతంమంది మంత్రులను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇస్తారన్న కథనాలు వినిపిస్తున్నాయి.

## ఉత్తరకొరియాలో 'హాస్వాంగ్ 20' క్షిపణి ప్రదర్శన

**ప్యాంగ్యాంగ్, అక్టోబరు 11:** అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నప్పటికీ తన సైనిక శక్తిని ప్రదర్శించడంలో ఉత్తర కొరియా వెనక్కి తగ్గడం లేదు. రష్యా, చైనా వంటి అగ్రరాజ్యాల మద్దతుతో మరింత ధీమాగా కనిపిస్తున్న ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్, తాజాగా అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. అధికార వర్కర్స్ పార్టీ 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్యాంగ్యాంగ్‌లో భారీ స్థాయిలో నిర్వహించిన సైనిక కవాతులో ఈ ఆయుధ ప్రదర్శన చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి రష్యా, చైనాలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధులు హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భారీ సైనిక కవాతులో 'హ్వాసోంగ్20' అనే సరికొత్త ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని (ఐసీబీఎం) ఉత్తర కొరియా ప్రదర్శించింది.

## అమేథిలో రాహుల్‌కు ఎదురైనట్లే రఘోపూర్‌లో తేజస్వికి తప్పదు
### జన్‌సురాజ్ పార్టీ అధినేత జోస్యం

**పాట్నా, అక్టోబరు 11:** కాంగ్రెస్ కంచుకోట అమేథీలో 2019లో రాహుల్ గాంధీకి ఎదురైన పరాభవం లాంటిదే, రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు కూడా తప్పదని జన్‌సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తేజస్వీ ప్రాతినిధ్యం వహిస్తున్న రఘోపూర్ నియోజకవర్గంలోనే ఈ ఎన్నికల్లో ఆయన అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. పాట్నాలోని రఘోపూర్‌లో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్‌కు 15 ఏళ్లుగా కంచుకోటగా ఉన్న అమేథీలో రాహుల్ గాంధీ, బీజేపీ నేత స్మృతి ఇరానీ చేతిలో అవమానకర రీతిలో ఓడిపోయారు. ఇప్పుడు ఆర్జేడీకి, తేజస్వీ యాదవ్‌కు కూడా అదే గతి పడుతుందని స్పష్టం చేశారు. రఘోపూర్ నియోజకవర్గం దశాబ్దాలుగా లాలూ కుటుంబం ఆధిపత్యంలోఉందని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. 1995, 2000లలో లాలూ ప్రసాద్ యాదవ్, 2005లో రబ్రీ దేవి, ఆ తర్వాత 2015, 2020లలో తేజస్వీ యాదవ్ ఇక్కడి నుంచే గెలిచారని గుర్తు చేశారు.

## అడవిపందులను చంపి తినేందుకు కేంద్రం అనుమతించాలి
### కేరళ మంత్రి ప్రసాద్ సంచలన వ్యాఖ్యలు



**తిరువనంతపురం, అక్టోబరు 11:** అడవి పందులు పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, వాటి నుంచి పంటలను కాపాడాలని తన వద్దకు వచ్చిన గ్రామస్తులకు ఒక మంత్రి ఇచ్చిన సమాధానం వారిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ అడవి పందులను చంపి తినడమే మార్గమని, మరో మార్గంలేదని ఆయన సూచించడంతో గ్రామస్తులు కంగుతిన్నారు. కేరళలోని పాలమేల్ గ్రామ పంచాయతీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేరళ వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పంట పొలాలలో అడవి పందుల సమస్యను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరారు. స్పందించినమంత్రి, వాటిని చంపడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించదన్నారు. కానీ, పంట నష్టాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అడవి పందులను చంపడమే మార్గమని అన్నారు. అడవిపందులను చంపి తినేందుకు కేంద్రం ప్రజలకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా అడవి పందుల సమస్యను వేగంగా పరిష్కరించి పంటలను కాపాడుకోగలమని అన్నారు.

# వికలాంగురాలిపై అత్యాచారం..నిందితుడి అరెస్టు



**కోల్‌కతా, అక్టోబరు 11:** పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో తాజాగా మరో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరిగిన ఘటన నుంచి తేరుకోకముందే ఇంకో ఘోరం చోటుచేసుకుంది. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వికలాంగు రాలిపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోర్ట్ డివిజన్లోని నైదాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు. శనివారం ఉదయం నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అయితే నిందితుడి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. అతడిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కాగా, గతంలో ఆర్జీకర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో వైద్యవిద్యార్థినిపై అత్యా చారం, హత్యఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ ఘటన తాలూకూ చేదు జ్ఞాపకాలను మరువకముందే తాజాగా ఒకే రోజు రెండు జరిగాయి. ఒకటి వికలాంగురాలిపై అత్యాచారం కాగా, మరొకటి ఒడిశా నుంచి వచ్చిన వైద్యవిద్యార్థినిపై అత్యాచారం. రెండో ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాష్ట్రంలో జాతీయ ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయండి

## కేంద్రమంత్రికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాతీయ స్థాయి ఆయుర్వేద ఇనిస్టిట్యూట్(ఏఐఐఏ)ను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి దేశంలో 10 ఆల్ ఇండియా ఆయుర్వేద ఇనిస్టిట్యూట్లను నెల కొల్పాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని.. అందులో ఒకటి తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర ఆయుష్, ఆరోగ్యశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌కి మంత్రి దామోదర్ రాజనర్సింహ లేఖ రాశారు. తెలంగాణ అడవుల్లో అద్భుతమైన ఆయుర్వేద సంపద ఉన్నదని, మెడిసినల్ వాల్యూస్ ఉన్న మూలికలు, మొక్కల జాతులు ఉన్నాయని మంత్రి లేఖలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవలే సుమారు 800 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని తెలిపారు. ఆయుష్ హాస్పిటళ్లను బలోపేతం చేస్తున్నామని లేఖలో స్పష్టం చేశారు. రాష్ట్రంలో వందల సంవత్సరాలుగా ఆయుష్ వైద్య విధానాలకు మంచి ప్రాచుర్యం ఉన్నదని, ఇక్కడి ప్రజలు ఆయుష్ వైద్య సేవలను కూడా వినియో గించుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం ఏర్పాటు చేయబోయే ఆయుర్వేద ఇనిస్టిట్యూట్స్ లో ఒకటి తెలంగాణకు కేటాయిం చాలని, అవసరమైన భూమి, ఇతర వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కేంద్రానికి రాసిన లేఖలో వివరించారు. తెలంగాణ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు శనివారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్రమంత్రి ప్రతాప్ రావుజాదవ్‌ని కలిసి మంత్రి రాసిన లేఖను అందజేశారు.

# బిజెపి మండల అధ్యక్షుడు ఆత్మహత్యకు కారకులైన 13 మందిపై కేసు నమోదు

## ఎస్‌ఐ కోటేశ్వర్‌పై బదలీ వేటు

**వేమనపల్లి, అక్టోబరు 11, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి బిజెపి మండల అధ్యక్షుడు ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అట్రాసిటీ కేసు, రాజకీయ వేధింపులు ఆరోపణలపై మనస్తాపంతో ఏట మధుకర్ శుక్ర వారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు, కుల సంఘాల నాయకులు మృతదేహంతో నిన్నరాత్రి ధర్నా చేయగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మంచిర్యాల ఎసిపి ప్రకాష్, బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ చేరుకొని ఆత్మహత్యకు గల కాలకులపై చర్యతీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చెన్నూరు తరలించారు. మృతుడి సోదరుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు శనివారం మృతికి కారకులైన 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏ1 ఆర్ సంతోష్‌కుమార్, ఏ2 గాలి మధు, ఏ3 చింతకింది కమల, ఏ4 చెన్నూరు సమ్మయ్య, ఏ5 సయ్యద్ షాబిర్ అలీ, ఏ6 మంత్రి రమేష్, ఏ7 జడగల్ల శారద, ఏ8 అద్దరపల్లి రాజేశ్వరి, ఏ9 మానపల్లి ప్రమీల, ఏ10 జంపం మారక్క, ఏ11 కొండపల్లి లక్ష్మి, ఏ12 మానపల్లి మల్లేష్, ఏ13 నాయన శైలజ కాగా కేసు విషయంలో నిరక్ష్యంగా వ్యవహరించిన నీల్వాయి ఎస్సై కోటేశ్వర్‌ను ఉన్నతా ధికారులు బదలీ చేశారు. మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, సిర్పూర్ ఎమ్మె ల్యే పాల్వాయి హారీశ్‌బాబు, ఇరువురు ఏట మధుకర్ పాడె మోశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, దుర్గం అశోక్, బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళ అత్యాచారానికి గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# చెట్టుకు కట్టేసి మహిళపై అత్యాచారం

**కొల్చారం, అక్టోబరు 11, ప్రభాతవార్త:** గుర్తుతెలియని వ్యక్తులు ఒక గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఘటన కొల్చారం మండలం ఏడు పాయల వెళ్లే రహదారి పక్కన చోటుచేసుకుంది. కొల్చారం పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ మండలం రాళ్లమడుగు పంచాయతీ పరిధిలోని జానకంపల్లి సంగాయిగూడ తండా కు చెందిన గిరిజన మహిళ పోతంశెట్టిపల్లి టీ జంక్షన్ నుండి ఏడుపాయలకు వెళ్లే రహదారిలో ఉన్న గాలి అనిల్‌కుమార్ ఖాళీస్థలం వెనక భాగంలో ఉన్న చెట్లకు కట్టేసి అత్యాచారానికి పాల్పడ్డారు. విషయం తెలిసిన కొల్చారం పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మహిళను మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ జార్జ్, కొల్చారం ఎస్సై మోహినుద్దీన్ సందర్శించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ఎంచగూడెంలో విషాదం..

# ఇద్దరు చిన్నారులు బావిలో పడి మృతి

**కొత్తగూడ అక్టోబరు 11, ప్రభాతవార్త :** మండలంలోని ఎంచగూడెం గ్రామంలో ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో విషాదం చోటుచేసుకుంది. దసరా పండగ సందర్భంగా ఎంచగూడ గ్రామానికి చెందిన ఇటికాల నర్సయ్య స్వాతి దంపతుల కుమారుడు రిథిక్ (10) నర్సయ్య సోదరి అనిత శ్రీనివాస్ దంపతుల కుమారుడు జతిన్(9) అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు అందరు వారి బంధువులు చనిపోవడంతో వేరే గ్రామానికి వెళ్లారు. వీరు ఇద్దరు ఇంటివద్ద ఉన్నారు. ఇంటి పక్కనేఉన్న వ్యవసాయ బావి వద్ద బహిర్భూమి కి వెళ్లిన చిన్నారులు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందారు. బావి వద్ద చెప్పులు బట్టలు ఉండ డంతో గ్రామస్తులు వెతకడంతో ఇటికాల రితిక్ అనే బాలుడి మృతదేహం లభ్య మైంది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై రాజ్‌కుమార్ స్వయంగా రంగంలోకిదిగి గ్రామస్తుల సహాయంతో మరో బాలుడు జతిన్ మృతదేహం కూడా లభ్యమైంది. ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

# రూ.1.3 లక్షల కోట్లు పెరిగిన స్థూల ఉత్పత్తి

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణ స్థూల ఉత్పత్తిలోఏడాదిలో రూ.1.3 లక్షల కోట్లు వద్ధి రేటు నమోదైంది. దీంతో తెలంగాణ తలసరి స్థూల ఉత్పత్తి రూ.3.79 లక్షలకు చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం 2023-24లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.13,22,808 కోట్లు కాగా, ఏడాది కాలంలో రూ.1.3 లక్షల కోట్లు పెరిగి అది 2024-25కు రూ.14,56,837 కోట్లుగా రికార్డయింది. 2024-25లో రూ.3,79,751 గా తలసరి స్థూల ఉత్పత్తి నమోదు కాగా, ఇది 2023-24తో పోలిస్తే రూ.33 వేలు పెరిగిందని వెల్లడించింది. తెలంగాణ ఏర్పాటైన ఏడాది 2014-15లో తలసరి స్థూల ఉత్పత్తి రూ.1,24,104 కాగా, ఇప్పుడు మూడురెట్లు కంటే ఎక్కువ పెరుగుదల చోటుచేసుకుంది. పదేళ్లలో రూ. 2.55 లక్షలు పెరిగింది. ఇక రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణాంకాలు కూడా ఇదే నిష్పత్తిలో పెరిగాయి. రాష్ట్రం ఏర్పాటైన ఏడాది తెలంగాణ స్థూల ఉత్పత్తి రూ.4,56,280కోట్లు కాగా, పదేళ్ల తర్వాత రూ.10 లక్షల కోట్లు పెరిగింది.

# 'స్థానికం' ఆగినా సంస్థాగత బలోపేతానికి కసరత్తు

**ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఏఐసిసి పరిశీలకుడు మహేంద్రన్**

**కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో డిసిసి పట్టు కోసం ఔత్సాహికుల పోటీ**

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడంతో నిలిచిపోవడంతోడిసిసి అధ్యక్షుల నియామకం దిశగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. నాలుగు జిల్లాల పరిధిలో ఒకట్రెండు రోజుల్లో అభిప్రాయ సేకరణ ప్రారంభమవనుంది. ఎఐసిసి నియమించిన 22 మంది ప్రతినిధులు వారికి కేటాయించిన తెలంగాణ జిల్లాల్లో పర్య టించి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలవను న్నారు. పార్టీ సీనియర్ నాయకుల మనోభావాలను కూడా తెలుసుకోనున్నారు. ఆశావహుల సమాచారం సేకరించి వారు పార్టీకి అందించిన సేవ, గత రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. 2023లో శాసనసభ ఎన్నికలు జరిగి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డిసిసిలకు కొత్త అధ్యక్షులను నియమించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. తెలంగాణలో ప్రస్తుతం అనేక జిల్లాల డిసిసి ల అధ్యక్షులు గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరు అటు నియోజకవర్గ అభివృద్ధి.. ఇటు పార్టీ కార్యకలాపాలతో తీరిక లేకుండా ఉంటున్నారు. వీరి స్థానంలో వేరేవారికి పూర్తి బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని ఎఐసిసి వ్యవహారాల రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. తెలంగాణలో పలు నియోజకవర్గంలో ఆమె పాదయాత్ర చేపట్టిన సందర్భంలో నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టగా చాలామంది కొత్తవారిని నియమించాలని విన్నవించారు. ఈ మేరకు ఇప్పటికే తమకు కేటాయించిన జిల్లాలకు చేరుకున్న అబ్జర్వర్ల కమిటీ పిసిసి కమిటీ సభ్యులతో కలిసి డిసిసిల విషయంలో ఆశావహుల నుంచి దరఖాస్తులు, జిల్లా నాయకుల అభిప్రాయా లను సేకరిస్తోంది. వారం రోజులపాటు ఈ పర్యటనలు కొనసాగనున్నాయి. రాబోయే రోజుల్లో పార్టీలో డీసీసీలతే కీలక పాత్ర కాబోతోందని ఏఐసీసీ ఇప్పటికే ప్రకటించింది. స్థానిక ఎన్నికలు, ఎమ్మెల్యేల అభ్యర్థుల ఎంపికలో డీసీసీలు కీలకం కాబోతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీని సమర్థవంతంగా నడిపించగల సత్తా కలిగిన సమర్థులైన డిసిసి కోసం హైకమాండ్ ప్రత్యేక దృష్టి సారించింది. శనివారం ఖమ్మంలో ఏఐసిసిఅబ్జర్వర్ మహేంద్రన్ పర్యటించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 వరకు ఆసక్తి కలిగిన నేతలు దరఖాస్తులు చేసుకోవాలని వచ్చిన దరఖాస్తులను తాము క్షుణ్ణంగా పరిశీలించి వాటిని ఏఐసిసి కార్యాలయానికి పంపిస్తామన్నారు. అక్కడ పార్టీ పెద్దలు డీసీసీలను నియమిస్తారని చెప్పారు. పార్టీ పెద్దల సమక్షంలో జరగనున్న ఈ నియామకాలు పారదర్శకంగా ఉంటాయన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగు జిల్లాలుగా విభజించబడ్డాయి. ఆ నాలుగు జిల్లాలకు చెందిన ప్రస్తుత అధ్యక్షులు ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో ఎలాగైనా డిసిసి అధ్యక్షులు కావాలని పట్టుదలతో నాయకులు ఉన్నారు. కరీంనగర్ డిసిసి అధ్యక్షుడిగా ప్రస్తుతం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వారసుడిగా జిల్లా పగ్గాలు పట్టడానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పార్టీ కరీంనగర్ ఎంపిగా పోటీ చేసిఓడిపోయిన వెలిచాల రాజేందర్రావు, డిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు పద్మాకర్రెడ్డితోపాటు భాస్కర్రెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మహిళా కోటాలో సత్య ప్రసన్నలక్ష్మి పోటీ పడుతున్నట్లు ఆ పార్టీ చర్చజరుగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉండగా ఆయన తరువాత పార్టీ నిర్వహణ బాధ్యతలు చేపట్టడానికిసంగీతం శ్రీనివాస్, చక్రధర్రెడ్డి, గడ్డం నర్సయ్య తదితరులు ప్రయత్నిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా డిసిసి అధ్యక్షుడైన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ స్థానంను పొందాలని కాచె శశిభూషణ్, తిరుపతి యాదవ్, సదానందం, సారయ్యగౌడ్ ప్రయత్నాలు చేస్తున్నారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్థానంలో అందుకోవాలని సుజిత్‌రావు, కొమిరెడ్డి కరంచంద్, జువ్వాడి కృష్ణారావు తదితర నాయకులు దస్తీవేయాలని చూస్తు న్నారు. నిజామాబాద్,కామారెడ్డిలో కూడా రెడ్డి,మున్నూరు కాపు సామాజికవర్గం మధ్య అధ్యక్షపీఠంపై పాగావేసేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

# బిజెపి కార్యకర్తలు ఆత్మహత్యలకు పాల్పడవద్దు

## అధైర్య పడవద్దు.. పార్టీ అండగా ఉంటుంది

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**వేమనపల్లి, అక్టోబరు 11, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి బిజెపి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్య చేసుకొని మరణించిన విషయం తెలిసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వారి కుటుంబ సభ్యులను శనివారం రోజున పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడి సూచన మేరకు ఏటా మధుకర్ కుటుంబానికి పరామర్శిచడానికి రావడం జరిగిందని వారి కుటుంబానికి బిజెపి తరుపున ప్రగాడ సానుభూతి తెలిజేస్తున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధుకర్ ది ఆత్మహత్య కాదని కాంగ్రెస్ నాయకుల హత్యగా భావిస్తున్నట్లు తెలిపారు. బిజెపి కార్యకర్త ఆత్మహత్య చేసుకోడని కాంగ్రెస్ నాయకులు, పోలీసులు ఎంత ఇబ్బంది పెడితే తప్ప ఆత్మ హత్యకు చేసుకోవడం జరిగిందని అన్నారు. వచ్చేది తమ బిజెపి ప్రభుత్వం అని కాంగ్రెస్, బిఆర్ఎస్ చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు.

బిజెపి కార్యకర్తలకు ఆత్మ హత్యలు అనేవి పరిష్కారం కావని సమాజానికి బరోసా ఇచ్చేది బిజెపి పార్టీ అని అన్నారు. మధుకర్ కుటుంబానికి,ప్రతి ఒక్క బిజెపి కార్యకర్తలకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు బరోసా ఇచ్చారని అన్నారు.

మధుకర్ ఆత్మహత్యకు కారకులను 48 గంటలలో అరెస్ట్ చేయాలని అలాగే సంబంధించి పోలీస్ అధికారులను కూడా సస్పెండ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరితో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నాగునూరి వెంకటేశ్వర్లు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో

# హైకోర్టు చీఫ్‌జస్టిస్ ప్రత్యేక పూజలు



**వర్చువల్‌గా మంచిర్యాల జిల్లా కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన**

**పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు, అధికారులు**

**భువనగిరి, అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ యాదాద్రి శ్రీలక్ష్మీ ్మనరసింహ స్వామివారిని శనివారం ఉదయం భక్తిపూర్వకంగా దర్శించుకున్నారు. ఉదయం 10:25 గంటలకు కొండపైకి చేరుకున్న సిజె అతిథి గృహంలో సాంప్రదాయ దుస్తులు ధరించి, పోలీసుల గౌరవవందనం స్వీకరిం చారు. అనంతరం 10:45 గంటలకు తూర్పు రాజగోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించారు. క్షేత్ర పాలక ఆంజనేయ స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు నామ తిలకం, చందనం బొట్టుపెట్టి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ధ్వజస్తంభ దర్శనం అనంతరం సిజె ప్రధాన గర్భాలయంలోకి ప్రవేశించి స్వయంభు నరసింహస్వామి వారి సన్నిధిలో పది నిమిషాలపాటు ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర సువర్ణ పుష్పార్చన పూజలను అర్చకస్వాములు మంగవెల్లి సాందీపని, అరుణ్‌కుమార్‌చార్యులు నిర్వహించారు. అనంతరం అండాళ్ అమ్మవారి దర్శనం చేసుకున్న సిజెకు ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, బట్టర్ సురేంద్ర చార్యులు, ఇతర అర్చక బృందం వేద, దివ్య ప్రబంధ ఆశీర్వచనములు చేసి అభిషేక లడ్డు ప్రసాదంను అందజేశారు. ఆలయ ఇఒ రవినాయక్, చీఫ్‌జస్టిస్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహుమతిగా అంద జేశారు. పశ్చిమ రాజగోపురం గుండా ఉదయం 11:10 గంటలకు ఆలయం నుంచి బయలుదేరి, ప్రత్యేకబ్యాటరీ వాహనంలో తిరిగి అతిథి గృహానికి చేరు కున్నారు. అనంతరం సిజె వర్చువల్ మోడ్ ద్వారా మంచిర్యాల జిల్లా నరసాపురం నూతన జిల్లా కోర్టు భవన సముదాయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు కే శరత్, కే లక్ష్మణ్, కె.సృజన, వాకిటి రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఏ.జయరాజు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, పలువురు న్యాయాధికారులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

# బిసి రిజర్వేషన్లపై తక్షణమే అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు విషయంలో హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర సర్కార్ కులగణన నిర్వహించి, శాసనసభలో ఏకగ్రీవంగా బిల్లును రూపొందించి కేంద్రానికి పంపిస్తే, 6 నెలలైనా రాష్ట్రపతి నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. గతంలో కొన్ని తీర్పులలో సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారం రాష్ట్రపతి అయినా సరే మూడు నెలల్లోగా తేల్చాలని, లేదంటే బిల్లులను వెనక్కి పంపించాలని సూచించిందని.. కానీ ఇది జరగలేదన్నారు. మూడు నెలలు పూర్తయినందున చట్టంగా తీసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పినందున .. బిసిలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేసుకునే అవకాశం ఉందని, అలా సాధ్యం కాకపోతే మొత్తం బిసి రిజర్వేషన్స్ మీద కేంద్ర ప్రభుత్వంతో పోరాడి బిల్లును అమలు చేసే విధంగా 9వ షెడ్యూల్లో చేర్చే విధంగా పోరాటం సాగించాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా చేయాల్సిన ప్రయత్నం చేస్తూనే, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి సాధించడం కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని జాన్‌వెస్లీ సూచించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంనరద మంత్రులు, మరికొందరు ఎమ్మెల్యేలు ఉన్నారని.. వాళ్ళందరూ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్స్‌కు అనుకూలంగా మాట్లాడుతూ, కేంద్రంలో మాత్రం వ్యతిరేకంగా ఉంటున్నారని విమర్శించారు. కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి అమలు చేయించాల్సిన బాధ్యత బీజేపీ నాయకులు, ఆ పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రుల మీద ఉందన్నారు. అది సాధ్యం కాకపోతే వారే బాధ్యత వహించి రాజీనామాలు చేయాలన్నారు. బిజెపి మనువాద పార్టీ, రిజర్వేషన్లకు వ్యతిరేకమైన పార్టీ అని ఆ పార్టీ ఇదే వైఖరి కొనసాగిస్తే రాష్ట్రంలో జూబ్లిహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు, ఏ ఎన్నికలు జరిగినా బీజేపీకి ఓట్లు వేయకుండా సామాజిక తరగతులన్ని తగిన గుణపాఠం చెప్పాలని జాన్ వెస్లీ పిలుపునిచ్చారు.

# నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై చర్యలు తీసుకోండి

## మంత్రి కోమటిరెడ్డికి ఫిర్యాదు చేసా: ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్




**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మాగాంధీ పట్ల అనుచిత వాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం మాట్లాడుతూ ఇప్పటికే నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై సిసిఎల్‌లో ఫిర్యాదు చేశానని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు, మా అసోసియేషన్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామని వివరించారు. శ్రీకాంత్ అయ్యంగార్‌పై కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరారు. నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌ను మా అసోసియేషన్ నుంచి సభ్యత్వం తొలగించాలని సూచించారు. అల్లు అర్జున్ విషయంలో స్పందించిన ఫిల్మ్ ఇండస్ట్రీ వారు.. శ్రీకాంత్ అయ్యంగార్ గాంధీజీపై చేసిన కామెంట్స్ పై స్పందించకపోవడం బాధాకరమని రాష్ట్రవ్యాప్తంగా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేయాలని కోరారు. మహాత్మాగాంధీజీపై సోషల్ మీడియాలో అసభ్యకర, అనుచితవ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు.

# గిరిజన జాతుల జనాభాకు అనుగుణంగా బడ్జెట్ పెట్టాలి

## బంజారా భారత్ వ్యవస్థాపకుడు మాజీ ఎంపి రవీంద్రనాయక్

**హైదరాబాద్, అక్టోబరు 11,ప్రభాతవార్త:** గిరిజన జాతుల జనాభా నిష్పత్తికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని బంజారా భారత్ వ్యవస్థాపకులు మాజీ ఎంపి రవీంద్రనాయక్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సెక్రటరీ సవ్యచాచిలను కలిసి గిరిజనుల మధ్య సమన్వయం కోసం నిజనిర్థారణకమిటి వేయాలని కోరారు. తెలంగాణలో లంబాడాలు, ఎరుకలు 8శాతం ఉండగా, గోండ్లు,కోలాం,కోయ తదితర జాతులు కేవలం మూడు శాతంలోపే ఉంటాయని బడ్జెట్ ఆయా జనాభా దామాషపద్దతిలో కేటాయించాలని దీనితో అక్రమాలు జరగకుండా కట్టడి చేయగలమని ఆయన వివరించారు. రాజకీయనిరుద్యోగులు ఉద్దేశ పూర్వకంగానే గిరిజనలను విడదీస్తున్నారని లంబాడాలను వలసవచ్చినవారిగా చిత్రీకరణ చేస్తూ దాడులకు పురికగొల్పుతున్నారని ఆయన ఆవేదన చెందారు. బంజారాభారత్ మహిళా కన్వీనర్ నాగమణి నాయక్ బంజారా భారత్ చైర్మన్ జగన్‌నాయక్ విశ్వలత తదితరులు ఉన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో వేలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారని, అయితే వారిని ప్రైవేట్ ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రైవేట్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఈపిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వకపోవడంతోపాటు దాదాపు 20శాతం వరకు వేతనాల్లో కోత విధిస్తున్నారని, పైగా ఆ వేతనాలు కూడా ప్రతి నెల ఆలస్యం చేస్తున్నారని చిన్నారెడ్డి సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం ప్రభుత్వ పరంగా నూతనంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని చిన్నారెడ్డి ఆ లేఖలో వివరించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం 2023 కంపెనీస్ యాక్ట్ 8 ప్రకారం ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం ఇదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్‌ను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేయాలని చిన్నారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

# ఆర్థికమంత్రిగా హరీశ్ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చేసింది శూన్యం

## రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి

**హైదరాబాద్, అక్టోబరు 11,ప్రభాతవార్త:** రేవంత్ సర్కార్ అమలు చేస్తున్న గల్ఫ్ సంక్షేమ కార్యక్రమాలపై అబద్దాలు ఆడుతున్న హరీశ్‌రావును గల్ఫ్ కార్మికులు తిరగబడే పరిస్థితి ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి హెచ్చరించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రెండువేల మంది తెలంగాణ కార్మికులు గల్ఫ్ దేశాలలో చనిపోతే వారికి ఎక్స్ గ్రేషియా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల పాలిట కెసిఆర్ ఒక నరరూప రాక్షసుడని, కెటిఆర్, కవిత, హరీష్ చిన్న రాక్షసులని అనిల్ విమర్శించారు. ఆర్థిక మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఒక్క రూపాయి కేటాయించలేదని ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నాడని ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ ప్రశ్నించారు. బొగ్గుబాయి బొంబాయి దుబాయి అనే నినాదంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోవలస కార్మికులను రెచ్చగొట్టి వాడుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని వదిలేసి, నట్టేట ముంచిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు అన్నారు. గల్ఫ్ కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిన కెసిఆర్, కెటిఆర్, కవిత తో పాటు ఆర్థిక మంత్రులుగా పనిచేసిన ఈటల రాజేందర్, తన్నీరు హరీశ్‌రావు మాట తప్పారని కమిటీ సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ అయిదుగురూ 'గల్ఫ్ ద్రోహులు'గా చరిత్రలో నిలిచిపోయారని అన్నా రు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి మాట్లాడుతూ హరీష్ రావు గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గల్ఫ్ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని, ప్రవాసీ ప్రజావాణి ని సందర్శించాలని సూచించారు. బిఆర్ఎస్ హయాంలోని రెండు వేల మంది గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల చొప్పున వంద కోట్ల రూపాయలను బిఆర్ఎస్ పార్టీ నిధుల నుండి చెల్లించి పాపానికి ప్రాయచిత్తం చేసుకోవాలని హితవు పలికారు.




గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి



సజ్జనార్ నగర కొత్వాల్ అయిన సందర్భంగా శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెగాస్టార్ చిరంజీవి

# బనకచర్ల డిపిఆర్ అప్రైజల్‌పై స్పందించని సిఎం రేవంత్

## ఎపి ప్రభుత్వం కేంద్ర సహకారంతో బనకచర్లపై ముందుకెళ్తోంది: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 11:** బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వ్యతిరేకించడం లేదు..? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల డీపీఆర్ అప్రైజల్‌పై సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని హరీశ్‌రావు నిలదీశారు. శనివారం బనకచర్ల ప్రాజెక్టుపై హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్ టెక్నో ఎకనమిక్ అప్రైజల్ ప్రాసెస్ కొనసాగిస్తున్నా మని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ లేఖ రాశారు. 20 రోజుల కింద సీఆర్ పాటిల్ ఈ లేఖ రాసినా రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు స్పందించలేదు. మన దేశంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నిబంధనలు, రాజ్యాంగం పరంగా వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ జరగదు.

కానీ ఏపీ ప్రభుత్వం ఈ వరద జలాల మీద బనకచర్ల డీపీఆర్ అప్రైజల్ సబ్మిట్ చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి లేఖ రాశారు. మరి రేవంత్ రెడ్డి వరద జలాల మీద డీపీఆర్ అప్రైజల్ సాధ్యం కాదని నిలదీయాలి.. కానీ దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు అని హరీష్ రావు పేర్కొన్నారు. 463 టీఎంసీలు నీళ్ల గోదావరి నుండి కృష్ణా నదికి





ఆంధ్రప్రదేశ్ మళ్లిస్తుంది.. మేము ఆల్మట్టిలో 112 టీఎంసీలు ఆపుకుంటామని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుందని చెప్పారు. ఎపి ప్రభుత్వం కేంద్రం సహకారంతో బనకచర్లపై ముందుకెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం పట్టించుకోకుండా పరోక్షంగా సహకరిస్తోందని, వరద జలాలపై ప్రాజెక్టు రిపోర్టులు ఆమోదించకూడదు అని.. కానీ, బనకచర్ల ప్రాజెక్టు పిఎఫ్ఆర్ పరిశీలిస్తున్నామని కేంద్రం రాసిన లేఖపై రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించలేదని ధ్వజమెత్తారు. కేంద్రం అండతో ఎపి ప్రభుత్వం బనకచర్లపై ముందుకెళ్తోందని, రేవంత్‌రెడ్డి దీన్ని అడ్డుకోపోగా.. పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పాలిట బనకచర్ల ప్రాజెక్టు పెను ప్రమాదంగా మారబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై బిఆర్ఎస్ చెప్పినవన్నీ నిజమవుతున్నాయన్నారు. ఎపి 463 టిఎంసిలు, కర్ణాటక 112 టిఎంసిలు, మహారాష్ట్ర 74 టిఎంసిల నీటిని ఆపుకుంటే మన తెలంగాణ పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించారు. కింద గోదావరి, పైన కృష్ణా నీళ్ల వాళ్లు తీసుకుపోతే మన బతుకులు ఏం కావాలి..? అని అడిగారు. ఇంత జరుగుతున్నా సిఎంగా ప్రజా ప్రయోజనాలు కాపాడతారా.. స్వార్థ ప్రయోజనాలు చూసుకుంటారా..? అని ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రాలు కృష్ణా, గోదావరి జలాలను తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో సిఎం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ఇటీవల కర్ణాటకకు వెళ్లిన రేవంత్ రెడ్డి, అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుతుందన్న కనీస సోయి రేవంత్ రెడ్డికి లేదని మండిపడ్డారు.

# రాష్ట్రంలో పది కొత్త మార్కెట్ యార్డులు

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణలోని రైతులు పండించిన పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మరింత వెసులుబాటు కల్పించేందుకు మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో కొత్తగా 10 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు, పెద్దకొత్తపల్లి. వనపర్తి జిల్లాలోని పానగల్, వీవనగండ్ల, ఖిలాఘన్‌పూర్, గోపాల్‌పేట. పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి. నల్గొండ జిల్లాలోని దామరచర్ల. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని మత్కేపల్లిల్లో ఈ కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 197 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి.

వీటికి అదనంగా మరో 10 మార్కెట్ యార్డులు ఏర్పాటు చేస్తూ సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ కొత్త మార్కెట్లు యార్డులు అందుబాటులోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా వాటి సంఖ్య 207కి చేరనుంది. ఈ మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో స్థలాలను సైతం గుర్తించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. వీటి ఏర్పాటుకు గాను ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కానందున ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటితోపాటు మరో ఐదు మార్కెట్ యార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలియవచ్చింది.





# బెంగాల్ సిఇఒను బెదరించిన సిఎం మమతా బెనర్జీ!

### మమత విడియోక్లిప్ కావాలని ఆదేశించిన ఇసి

**కోల్‌కతా, అక్టోబరు 11:** పశ్చిమబెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారిని ముఖ్య మంత్రి మమతా బెనర్జీ బెదిరిస్తూ వ్యాఖ్యలు చేశారంటూ వార్తలు రావడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో కావాలని ఈసీ అడిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బెంగాల్ సీఈఓ మనోజ్ అగర్వాల్ హద్దులు దాటితే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలు బయటపెడతామని ఒక సమావేశంలో మమతా బెనర్జీ పేర్కొన్నట్టు సమాచారం. ఈ సమావేశానికి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్, మంత్రి అరూప్ బిశ్వాస్ కూడా హాజరైనట్టు తెలుస్తోంది. రాష్ట్ర అధికారులను కూడా సీఈఓ బెదిరించినట్టు ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ఆరోపించారని చెబుతున్నారు. 2011లో మమతా బెనర్జీ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర పోలింగ్ అధికారిపై ఇలాంటి తీవ్ర ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి. ముఖ్యమంత్రి వ్యాఖ్యల వీడియోను శనివారం సాయంత్రంలోగా తమకు పంపాలని సీఈఓ కార్యాలయాన్ని ఈసీ ఆదేశించినట్టు కోల్‌కతా సీఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఎన్నికల అధికారిని బెదిరించిన ముఖ్యమంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అసెంబ్లీలో బీజేపీ విపక్ష నేత సువేందు అధికారి ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే ఒక లేఖ సమర్పించారు. సీఈఓపై మమతాబెనర్జీ చేసిన ఆరోపణలను బహిర్గతం చేయాలని, లేకుంటే సీఎంపై చర్యలు తీసుకునేంత వరకూ ఈసీ కార్యాలయం వెలుపల తమ పార్టీ నిరవధిక నిరసన చేపడుతుందని సువేందు అధికారి హెచ్చరించారు.

# రాష్ట్రంలో ఖరీఫ్ పత్తికి కష్టకాలం

**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖరీఫ్ పత్తికి కష్టకాలం వచ్చింది. ఇటీవల కాలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలపై ప్రధానంగా పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పత్తి, వరి పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు పడడంతో రైతులు నష్టపోతున్నారు. పంటల సాగు కోసం పెట్టిన ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరో రెండు, మూడు రోజుల వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చేలల్లో మూడు వారాల నుంచి పత్తి రావడం మొదలైంది.

అయితే పత్తి ఏరేందుకు కూలీల కొరత ఉండడంతో చాలా మంది రైతులు పత్తి తీయకుండా అలాగే ఉంచారు. గత నెల 24 నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రోజు విడిచి రోజు వారం రోజుల నుంచి ప్రతి రోజూ సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. దీని ప్రభావం చేతికొచ్చిన పత్తి పంటపై పడింది. వర్షాలకు నీళ్ల చేలల్లో నిలిచి మొక్కలకు వైరస్ సోకుతోంది.

కొన్ని ఏరియాల్లో మొక్కలు ఎండిపోయాయి. పంట చేతికొచ్చిన చోట పత్తి మొత్తం వర్షానికి తడిసి రాలిపోతోంది. కాయలోని పత్తి నల్లబారుతోంది. దీంతో కొన్ని చోట్ల రైతులు పత్తి ఏరి రోడ్లపై ఆరబోస్తున్నారు. అయినా రంగు మారుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పంటను అమ్మకానికి తీసుకుపోతే సరైన మద్దతు ధర వస్తుందా? లేదా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే వేలల్లో పెట్టుబడులు పెట్టగా.. గిట్టుబాటు ధర రాకుంటే అప్పులే మిగుతాయని ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు భయపడి గత్యంతరం లేక కొందరు రైతులు చెట్ల నుంచి తీసిన పత్తిని ప్రైవేట్లో అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.8,200 ఉండగా.. రూ.2 వేల నుంచి రూ.వెయ్యి తక్కువకు ప్రైవేట్లో అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు. సకాలంలో సీసీఐ సెంటర్లను కూడా ఓపెన్ చేయకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు.

# రాష్ట్రంలో 4 రోజులపాటు వర్షాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు11:** రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో... సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మంగళవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# సచివాలయం వద్ద వీధికుక్కల స్వైరవిహారం

### వాటిని పట్టుకున్న మున్సిపాలిటీ సిబ్బంది

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు11:** తెలంగాణ సచివాలయం వద్ద వీధి కుక్కల స్వైర విహారం కలకలం రేపింది. సాయంత్రం ముగ్గురిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. సచివాలయం ప్రాంగణంలోని మీడియా పాయింట్, క్యాంటీన్, విజిటర్స్ పాస్ లాంజ్ పరిసరాల్లో కుక్కలు విచ్చలవిడిగా జీహెచ్ఎంసీ కార్యాలయం సచివాలయం పక్కనే ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సందర్శకులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఘటనపై స్పందించిన మున్సిపల్ అధికారులు వెంటనే చర్యల్లోకి దిగి పలు కుక్కలను పట్టుకున్నారు. పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల కోసం గాలింపు కొనసాగుతోంది. సచివాలయం పరిసరాల్లో కుక్కల సమస్యను పూర్తిగా నివారించేందుకు మరో బృందాన్ని పంపారు. సందర్శకులు, ఉద్యోగుల భద్రత కోసం జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై అన్ని రాష్ట్రాలతో చర్చిస్తాం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర జలవనరుల మంత్రి సిఆర్ పాటిల్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు11:** గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ లేఖ రాశారు. ఏపీ విభజన చట్టం 2014, గోదావరి ట్రెబ్యునల్ తదితర చట్టాలకు విరుద్ధంగా గోదావరి బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నారని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ అభ్యంతరాలు తెలుపుతూ పలుమార్లు కేంద్రానికి లేఖలు రాయగా.. వాటిపై సీఆర్ పాటిల్ స్పందించారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్రం లేవనెత్తిన అభ్యంతరాలు తమకు అందినట్లుగా సీఆర్ పాటిల్ లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రీ ఫ్రీజిబిలిటీ నివేదికను కూడా పరిశీస్తున్నామని, ప్రాజెక్ట్ ప్రాథమిక సాధ్యా సాధ్యాలు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గోదావరి బేసిన్ లో ఉన్న అన్ని రాష్ట్రాల అభిప్రాయాల మేరకు సాంకేతిక అంశాలను నిబంధనల మేరకు పరిశీలిస్తామని లేఖలో పేర్కొన్నారు.

# బెంగాల్‌లో ఒడిశా వైద్యవిద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి

**కోల్‌కతా, అక్టోబరు 11:** దేశంలో ఎక్కడో ఒకచోట ప్రతిరోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తెచ్చినప్పటికీ నిందితులకు ఎలాంటి భయం లేకుండా పోతుంది. మనుషుల్లా కాకుండా మానవ మృగాల్లాగా దారుణానికి పాల్పడుతున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మరో గ్యాంగ్ రేప్ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీ సమీపంలో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. సదరు విద్యార్థిని ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి పశ్చిమ బెంగాల్‌లో ఎంబీబీఎస్ చదువుతోంది. ఒడిషా రాష్ట్రం జలేశ్వర్ కు చెందిన యువతి శుక్రవారం రాత్రి పానీపురి తినేందుకు తన స్నేహితు డితో కలిసి కాలేజీ నుంచి రాత్రి 8:30 గంటల సమయంలో బయటకు వెళ్లింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో గమనించిన రాకాసి మూకలు దుర్మార్గానికి ఒడిగట్టారు. అమ్మాయితో ఉన్న అబ్బాయిని పక్కకు నెట్టేసి గట్టిగా కొట్టారు. ఆ అమ్మాయిని దుర్మార్గులు కాలేజీ వెనకాల ఉన్న అడవిలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలి ఫోన్ లాక్కుని దూరంగా పడేసి అక్కడి నుంచి పారిపోయారు. విద్యార్థిని స్నేహితుడు జరిగిన విషయమంతా తన హాస్టల్ లోని విద్యార్థులకు చెప్పగా అందరు కలిసి బాధితురాలిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి పేరెంట్స్‌కు జరిగిన విషయం తెలియజేయగా ఒడిషాలోని జలేశ్వర్ నుంచి బయల్దేరి పశ్చిమ బెంగాల్ కు చేరుకున్నాయి. తమ కూతురికి జరిగిన ఘటనపై గుండెలవిశేలా రోధించారు. తక్షణమే ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాలేజీలో సరైన భద్రతా చర్యలు లేవని యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మరోవైపు ఈ ఘటనపై దుర్గాపూర్ న్యూ టౌన్‌షిప్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పశ్చిమ బెంగాల్ మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి షశి పంజా మాట్లాడుతూ విద్యార్థిని చికిత్స పొందుతోందని, వైద్యులు అప్రమత్తంగా ఉండి చికిత్స అందిస్తున్నారని చెప్పారు. యువతిపై సామూహిక అత్యాచారం చేయడం దారుణమని పేర్కొన్నారు. పోలీసుల విచారణపై తల్లిదండ్రులు నమ్మకంతో ఉన్నారన్నారు. ఇలాంటి నేరాలను రాజకీయం చేయవద్దని కోరారు.

# ఎపిలో వైద్య రంగాన్ని, ఆరోగ్యశ్రీ పథకాన్ని దెబ్బతీస్తున్నారు : వైఎస్సార్సీ నేత విడదల రజనీ

**విజయవాడ,అక్టోబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోవైద్య రంగాన్ని, ఆరోగ్యశ్రీ పథకాన్ని దెబ్బతీస్తు న్నారని వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి విడదల రజనీ అన్నా రు. రజనీ మీడియాతో మాట్లాడుతూ జగన్ నేతృత్వంలోని తమ ప్రభుత్వంన వైద్య, ఆరోగ్యరంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకుని వచ్చిందన్నారు. ఫలితంగా ఆధునాత ఆరోగ్యసేవలు ప్రజలకు అందేవన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో రూ.25లక్షల వరకు వైద్య సేవలకు వీలు కల్పించామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వైద్యసేవలు నిర్వీర్యం చేసిందన్నారు. ఆస్పత్రులను పట్టించుకో పోగా వాటిని ప్రైవేటీకరిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో తాము చికిత్సలు చేయలేమంటూ ప్రభుత్వానికిలేఖ రాశారని తెలిపారు. గతంలోనూ ఇలాగే చెబితే డబ్బులు ఇస్తామంటూనే ఇవ్వలేదని విమర్శించారు. దీంతో తాము వైద్యం చేయలేమంటూ చేతులెత్తేశారని తెలిపారు.



# అనూహ్యంగా పెరిగిన పెరటాసి రద్దీ

## కాలినడకన భారీగా గోవిందమాల భక్తులు కొండకు

## సర్వదర్శనానికి 24 గంటలు

**తిరుమల, అక్టోబరు 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరు మల దివ్యక్షేత్రం భక్తులతో జనసంద్రంగా మారింది. వారాంతం సెలవులు, రెండవ శని వారం, ఆదివారం రావడంతోబాటు పవిత్రమైన పెరటాసిమాసం నాల్గవశనివారంతో తిరుమలలో లక్షలాదిమంది భక్తులు ఉన్నారు. ఏకంగా వీరంతా ఆ దేవదేవుని దర్శనానికి సర్వదర్శనం క్యూలైన్లలో శిలాతోరణం వద్దనుండి నిరీక్షిస్తున్నారు. సాధారణంగా దసరా సెలవులు తరు వాత భక్తుల రద్దీ మోస్తరుగా ఉంటుంది. అయితే పెరటాసి మాసం కూడా కావడంతో గత పదిరోజులుగా భక్తుల రద్దీ తిరుమలలో అలాగే కొనసాగు తోంది. ముఖ్యంగా శనివారం మరింతమంది భక్తులు తమిళ నాడు, కర్నాటక నుండి తరలి వచ్చారు.. కొండపై దర్శనానికి వెళ్ళలేని భక్తులు భక్తితో కాటేజీల వద్ద, ఆలయం ముందు పిండిదీపాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయానికి ఎదురుగా అఖి లాండం వద్ద కొబ్బరికాయకొట్టి ఏడు కొండలస్వామీ గోవిందా గోవింద నామస్మరణతో పునీతులవుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుమలకు కాలినడకన 25వేలమంది భక్తులు చేరుకున్నట్లు టిటిడి సమాచారం.

దీంతోబాటు తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం వెంకటాద్రి నిలయం అందుబాటులోకి రావడంతో నాలుగు వేలమంది సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు సులభమైంది. పెరటాసిమాసం నాల్గవశనివారం కావడంతో తిరుమలకొండపై భక్తుల రద్దీ భారీగా పెరిగింది. సామాన్యభక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 24గంటలుపాటు నిరీక్షించాల్సిన అవసరం కనిపిస్తోంది. భక్తులకు క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తున్నాడని గోవింద నామంతో ఉన్నారు.

ఉదయం నుండి వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోకి ప్రవేశించే భక్తుల సంఖ్య అంతకంతకూ పెరిగింది. తమిళభక్తులకు అత్యంత పవిత్రమైన మాసం కావడంతో అనూహ్యంగా రద్దీ పెరిగింది. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ శ్రీవారి సేవకులతో నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ, పాలు అందించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ,, విఎస్ఒలు ఎస్టీవిరామ్ కుమార్, సురేంద్ర, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, సెల్వం, పోమన్నా రాయణ పర్య వేక్షిస్తున్నారు. సాయంత్రంవరకు 43వేలమంది భక్తులు మహాలఘులో గోవిందుని దర్శనం చేసు కున్నారు.

ఈ రద్దీ వారంరోజులు కూడా ఇలాగే వుండవచ్చని టిటిడి అధికారులు భావిస్తున్నారు. దర్శనం సమయం వివరాలను, వసతిసౌకర్యంపై టిటిడి అధికారులు ఎప్పటికప్పుడు ప్రసార సాధనాల ద్వారా భక్తులకు తెలియజేస్తున్నారు.

# పూరన్ కేసు విచారణ పారదర్శకం



**హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** హర్యానాలో సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనలో కీలక పరిణామాలు చో టు చేసుకున్నాయి. పూరన్ కుమార్ ఆత్మహత్య కేసు విచారణ నిస్పక్షపాతంగా, పూర్తి పారదర్శకంగా వుంటుందని, ఈ విషయంలో కేంద్రం సహా యం తీసుకుంటామని ఆ రాష్ట్ర సిఎం నాయబ్ సింగ్ సైని శనివారం వెల్లడించారు. మరోవైపు పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనపై కాంగ్రెస్ అధినే త సోనియా గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ విషయమై పూరన్ కుమార్ సతీమణి, సీనియర్ ఐఎఎస్ అధికారి అమ్నీత్ కుమార్‌కు ఆమె లేఖ రాశారు. పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటన బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికార పక్షపాత వైఖరికి ఇది నిదర్శనమని సోనియా గాంధీ వెల్లడించారు. బిఎస్‌పి అధినేత మాయవతి కూడా ఈ ఘటనను ఖండించడంతో పాటు దీనిపై సిబిఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. హర్యానా రాష్ట్రంలో పోలీసు శాఖను కుదిపేసిన సీనియర్ ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనపై పరిణామాలు వేగంగా మారుతున్నాయి. దీనిపై ప్రభుత్వ విచారణ వేగం పుంజుకుంది. ఈ నెల ఏడవ తేదీన పూరన్ కుమార్ ఛండీఘఢ్‌లోని తన బావమరిది ఇంట్లో సర్వీస్ రి వాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. దీనిపై ఆయన సతీమణి సీనియర్ ఐఎఎస్ అధికారి అమ్నీత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మే రకు రాష్ట్ర డిజిపి శత్రుజిత్ సింగ్ కపూర్, రోహ్‌తక్ ఎస్‌పి నరేంద్ర బిజ్రానియా సహా పది మంది ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయడం విదిత మే. ఈ ఘటనను జాతీయ ఎస్‌సి కమిషన్ కూడా తీవ్రంగా ఖండించి, నివేదిక కోరడంతో హరియాణా సర్కారు దిద్దుబాటు చర్యలు చేబట్టింది. ఈ ఘటనలో తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న డిజిపి శత్రుజిత్ సింగ్ కపూర్, రోహ్‌తక్ ఎస్‌పి నరేంద్ర బిజ్రానియాలపై సర్కారు వెంటనే బదిలీ వే టు వేసి వారిద్దరిని దీర్ఘకాలిక సెలవులపై పంపింది. వీరి స్థానంలో కొత్తవారిని నియమించింది. కాగా ఈ ఘటనపై శుక్రవారం నాడు మరిన్ని పరి ణామాలు వెలుగు చూశాయి. మొదట పంచకులలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర సిఎం నాయబ్ సింగ్ సైని ఆత్మహత్య చేసుకున్న పూరన్ కుమార్ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనపై తమ సర్కారు నిస్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేస్తుందని, ఇందుకోసం ఆరుగురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేసులో దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని ఆయన వెల్లడించారు. ఈ కేసు విషయంలో కేంద్రం సహాయం తీ సుకుంటామని ఆయన తె లిపారు. పూరన్‌కుమార్ ఆత్మహత్య దురదృష్టకర మని, దీనిపై రాజకీయం చేయవద్దని ఆయన రాజకీయ పార్టీలను కోరారు. ఈ ఘటనపై విచారణ కు ఏర్పాటైన సిట్‌కు ఐజి పుష్పేంద్ర కుమార్ నాయకత్వం వహిస్తారని, ఆయన బృందంలో ఛండీఘడ్ సీనియర్ ఎస్‌పి కన్వర్‌దీప్ కౌర్‌తో పాటు సి టీ ఎస్‌పి ప్రియాంక, దక్షిణ విభాగం డిఎస్‌పి చరణ్‌జిత్ సింగ్ విర్క్, సెక్టార్ 11 ఎస్‌హెచ్ఓ జైవీర్ రాణాలు సభ్యులుగా నియమించినట్లు సిఎం తె లిపారు. పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనపై సిట్ అన్ని కోణాల్లో విచారించి, నిపుణుల సూచనలను పరిగణలోకి తీసుకుని సర్కారుకు నివేదిక ఇ స్తుందని ఆయన తెలిపారు.

> **కేంద్ర సాయం కూడా తీసుకుంటాం: హర్యానా సిఎం నాయబ్‌సింగ్‌సైని**
>
> **సీనియర్ ఐపిఎస్ అధికారి పూరన్‌కుమార్ కేసులో కీలక పరిణామాలు**
>
> **ఆయన సతీమణికి సోనియాగాంధీ లేఖ**
>
> **సిబిఐ విచారణకు మాయావతి డిమాండ్**

### పూరన్‌కుమార్ సతీమణికి సోనియాగాంధీ లేఖ

ఇదిలావుండగా హరియాణా రాష్ట్రంలో ఆత్మహత్య చేసు కున్న సీనియర్ ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్‌కు కాంగ్రెస్ అధినేత, పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ లేఖ రాశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని సోనియా గాంధీ తన లేఖలో వివరించారు. ఆయ న కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటన బిజెపి పాలిత రాష్ట్రాల్లో అధికార పక్షపాత వైఖరికి నిదర్శనమని సోనియా గాంధీ తెలి పారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో సామాజిక న్యాయం ఏ మేరకు అమలవుతుందో...? ఇది ఒక నిదర్శనమని ఆమె తెలిపారు. పూరన్‌కుమార్ సతీమణికి ఆమె సంఘీ భావం తెలిపారు.

### కుల వివక్ష వల్లే దళిత అధికారి ఆత్మహత్య బిఎస్‌పి అధినేత మాయావతి వెల్లడి

పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనపై బిఎస్‌పి అధినేత మాయావతి ఒక లేఖ విడుదల చేస్తూ కుల వివక్షత వల్లే దళిత అధికారి బలయ్యారనని తె లిపారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని ఆమె తన లేఖలో తెలిపారు. పూరన్ కుమార్ దళిత అధికారి కాగా ఆయన సతీమణి ఐఎఎ స్ అధికారి అయి వుండి కూడా వివక్షతను ఎదుర్కోవడం హేయమైనదిగా ఆమె అభివర్ణించారు. దేశంలో ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి, మైనారిటీలపై కుల వివక్ష, వేధింపులు ఇప్పటికీ కొనసాగుతుండడం సిగ్గుచేటని మాయావతి తెలిపారు. ఈ ఘటనపై సిబిఐ చేత విచారణ చేబట్టి, దోషులను కఠి నంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

# తెర



రాశి ఖన్నా

## కథ చాలా యూనిక్‌గా ఉంటుంది ఆడియన్స్‌కి ఖచ్చితంగా నచ్చుతుంది

**'మిరాయ్'** లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తెలుసు కదా అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రాశి ఖన్నా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'తెలుసుకదా' లో మిమ్మల్ని ఎక్సయిట్ చేసిన ఎలిమెంట్స్?**

చాలా ట్రయాంగిల్ లవ్ స్టోరీస్ చూసుకుంటాం. కానీ ఇందులో ఒక యూనిక్ పాయింట్ వుంది. ఆ పాయింట్ మీరు థియేటర్స్‌లో చూడాలి. అది ఆడియన్స్‌ని ఎక్సయిట్ చేస్తుంది.ఈ సినిమా షూటింగ్‌లో చాలాసర్‌ప్రైజ్ అయ్యాను. అలాంటి సర్ ప్రైజ్ ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. చాలా కొత్తఎక్స్ పీరియన్స్ ఇస్తుంది.

**కథ విన్నప్పుడు ఏం అనిపించింది?**

కథ చాలా ఎంజాయ్ చేశాను. నీరజ ప్రతి క్యారెక్టర్‌ని అద్భుతంగా రాసింది. చాలా లేయర్స్ వున్నాయి. ఇందులో మూడు పాత్రలు చాలా డిఫరెంట్ గా వుంటాయి. ఆ మూడు పాత్రలు బ్యాలెన్స్ చేయడం చాలా టఫ్. నేను చాలా లవ్ స్టోరీస్ చేశాను. కానీ ఇది చాలా డిఫరెంట్. వెరీ న్యూ ఎక్స్ పీరియన్స్. ఈ సినిమా చేస్తున్నపుడు చాలా ట్రిగ్గర్ అయ్యాను.

**సిద్దుతో వర్క్ ఎక్స్ పీరియన్స్ గురించి ?**

సిద్దు ఆన్ సెట్ లో క్రాఫ్ట్ మీద చాలా సీరియస్‌గా వుంటారు. ఆయనకి ప్రతి క్రాఫ్ట్ మీద చాలా గ్రిప్ వుంటుంది.

**డైరెక్టర్ నీరజ గురించి?** నీరజకథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. అంతయూనిక్ స్క్రిప్ట్ ఎలా రాయగలిగారనిపించింది. తనకు ప్రతి విషయంపై నాలెడ్జ్ వుంది. ఒక ఎక్స్ పీరియన్స్ డైరెక్టర్ తో వర్క్ చేసినట్లుగానే అనిపించింది.

**మీకు ఎలాంటి కథలు చేయాలనీ వుంది?** నాకు మైథలాజిక్ సినిమాలు ఇష్టం, అలాగే హారర్ బ్యాక్ డ్రాప్ వున్న కథలు కూడా ఇష్టం.

**తమన్ మ్యూజిక్ గురించి?** తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. చాలా పాషన్ తో వర్క్ చేస్తారు. మల్లిక గంధ పెద్ద హిట్ అయ్యింది. పాటలన్నీ చాలా అద్భుతంగా వచ్చాయి.

**శ్రీనిధి గురించి ?** మా కాంబినేషన్‌లో చాలా మంచి సీన్స్ వున్నాయి. తను చాలా ఫన్ పర్శన్. మేము మంచి ఫ్రెండ్స్ అయ్యాం.

**అప్ కమింగ్ ప్రాజెక్ట్స్ గురించి? పవన్ కళ్యాణ్ గాతో ఉస్తాద్ భగత్ సింగ్** చేస్తున్నాను. పవన్ కళ్యాణ్ తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్. ఆయన ఫాలోయింగ్, ఒరా నెక్స్ట్ లెవల్. హిందీలో నాలుగు ప్రాజెక్ట్స్ చేస్తున్నాను.ఆల్ ది బెస్ట్ థాంక్ యూ .

## ప్రొడక్షన్ నంబర్1గా రాబోతోన్న 'అమీర్ లోగ్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



**యూత్ ఫుల్** కామెడీతో వచ్చే కంటెంట్‌కు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. యూత్‌ను ఆకట్టుకునే చిత్రాల్ని తెరకెక్కించడంలో మేకర్స్ ఎప్పుడూ ముందుంటారు. ఈ క్రమంలో అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ నుంచి ప్రొడక్షన్ నంబర్ 1గా రానున్న చిత్రంలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా.. వేదశ్రీ, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమణ రెడ్డి సోమ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మాధవి రెడ్డి సోమ నిర్మాతగా, మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.ఈ క్రమంలో ఈ ప్రొడక్షన్ నెం.1 చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను మేకర్స్ అధికారికంగా ఆవిష్కరించారు. సక్సెస్ ఫుల్ హీరో శ్రీ విష్ణు చేతుల మీదుగా రిలీజ్ చేయించిన 'అమీర్ లోగ్' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేసిన అనంతరం నటుడు శ్రీ విష్ణు టీంకి ఆల్ ది బెస్ట్ తెలిపారు. 'అమీర్ లోగ్' పేరుతో ఉన్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ చూస్తుంటే.. ముగ్గురు స్నేహితుల చుట్టూ తిరిగే ఓ వినోదాత్మకమైన కథ అని తెలుస్తోంది. పోస్టర్‌లో ఛార్మినార్, ఇరానీ చాయ్ అని రాసి ఉన్న బోర్డుని చూస్తుంటే ఈ స్టోరీ అంతా కూడా హైదరాబాద్ నేపథ్యంలోనే సాగనున్నట్టుగా అనిపిస్తోంది.

ఈ చిత్రానికి ఎస్‌వికె సినిమాటోగ్రఫీని అందిస్తుండగా.. స్మరన్ సాయి సంగీతం అందిస్తున్నారు. రోహిత్ పెనుమత్స ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఫస్ట్ లుక్ పోస్టర్ పాజిటివ్ ఇంప్రెషన్ ఇవ్వడంతో 'అమీర్ లోగ్' ప్రేక్షకులలో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసింది. ఈ మూవీకి సంబంధించిన ఇతర విషయాల్ని త్వరలోనే ప్రకటించనున్నారు.తారాగణం: ఎంసీ హరి, మనోజ్, శశిధర్, వేదశ్రీ, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి తదితరులు.

## ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంతాన ప్రాప్తిరస్తు

**టీజర్,** లిరికల్ సాంగ్స్ వంటి ప్రమోషనల్ కంటెంట్ తో ప్రేక్షకుల్లో కావాల్సినంత బజ్ క్రియేట్ చేస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ సంతాన ప్రాప్తిరస్తు రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఈ సినిమాను నవంబర్ 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు ఈ రోజు మేకర్స్ ప్రకటించారు. నేటి సమాజంలో యూత్ కపుల్స్ ఎదుర్కొంటున్న ఓ సమస్య నేపథ్యంగా కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్, ఛాట్ బస్టర్ మ్యూజిక్‌తో రూపొందిన 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రంలో విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్ డాక్టర్ భ్రమరం క్యారెక్టర్‌లో నవ్వించబోతున్నారు. మధుర ఎంటర్ టైన్ మెంట్, నిరి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న 'సంతానప్రాప్తిరస్తు'.చిత్రాన్ని దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. నటీనటులు విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, హర్షవర్ధన్, బిందు చంద్రమోళి, జీవన్ కుమార్, సత్య కృష్ణ, తాగుబోతు రమేష్, అభయ్ బేతిగంటి, కిరీటి, అనీల్ గీల, సద్దాం తదితరులు.టెక్నికల్‌టీమ్:డైరెక్టర్ : సంజీవ్‌రెడ్డి, ప్రొడ్యూసర్:మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి,స్టోరీ,స్క్రీన్ ప్లే సంజీవ్ రెడ్డి, షేక్ దావూద్ జి.మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్: బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్: అజయ్ అరసాడ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎ మధుసూదన్ రెడ్డి,సినిమాటోగ్రఫీ మహి రెడ్డి: పండుగుల



## దిల్‌రాజు, విజయ్ దేవరకొండ.. కొత్త సినిమా ప్రారంభం



**పూజా కార్యక్రమాలతో** ఘనంగా ప్రారంభమైన స్టార్ హీరో విజయ్ దేవరకొండ, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్, టాలెంటెడ్ డైరెక్టర్ రవికిరణ్ కోలా కాంబినేషన్ క్రేజీ మూవీస్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న కొత్త సినిమా ఈ రోజు హైదరాబాద్ లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రాజా వారు రాణి గారు సినిమాతో ప్రతిభావంతమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్వీసీ సంస్థలో వస్తున్న 59వ సినిమా ఇది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేష్ నాయికగా నటిస్తోంది.ఈ చిత్ర ముహూర్తపు సన్నివేశానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ క్లాప్ ఇవ్వగా, ప్రొడ్యూసర్ నిరంజన్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో తెరకెక్కనున్న ఈ సినిమా ఈ నెల 16వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లనుంది. ఈ ప్రెస్టీజియస్ మూవీని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.నటీనటులు విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్, తదితరులు.

## కె - ర్యాంప్‌లో కంప్లీట్ ఎనర్జిటిక్ క్యారెక్టర్ చేశా ఈవెంట్ లో సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం

**సక్సెస్‌ఫుల్ హీరో** కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "కె -ర్యాంప్. ఈసినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కె ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహి స్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈరోజుఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో డైలాగ్ రైటర్ రవి మాట్లాడుతూ 'కె ర్యాంప్' సినిమా కథ విన్నప్పుడు చాలా ఎంటర్ టైనింగ్ గా అనిపించింది. ఈ కథను ఎంతో మెచ్యూర్డ్ గా తెరకెక్కించారు మా డైరెక్టర్ నాని. ప్రొడ్యూసర్ రాజేశ్‌కి ప్రతి డైలాగ్ గుర్తుంటుంది. హీరో కిరణ్ అబ్బవరం ఎనర్జిటిక్ గా పర్ ఫార్మ్ చేశారు. మీరు ట్రైలర్ లో చూసింది కొంతే. సినిమా కంప్లీట్‌గా ఎంటర్ టైన్ చేస్తుంది. ఈ సినిమా చేస్తున్న టైమ్ లోనే తప్పకుండా సక్సెస్ అవుతుందనే నమ్మకం కలిగింది. అన్నారు..డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ, ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నా. ట్రైలర్ లోని ఎనర్జీకి సినిమా ఏమాత్రం తగ్గదు., ఈ దీపావళికివస్తున్న నాలుగు సినిమాలు హిట్ కావాలి. అందులో మన తెలుగు హీరో కిరణ్ చేసిన 'కె ర్యాంప్'ఒక మెట్టు పైనే ఉండాలి. మా సినిమా రిలీజ్ డేట్ ను చాలా రోజుల కిందటే ఫిక్స్ చేశాం. మిగతా చిత్రాలతో పాటు మా మూవీ కూడా సక్సెస్ అయ్యివారి బ్యానర్స్ లాగే మా సంస్థకూ పేరు తెస్తుందని ఆశిస్తున్నాం.యాక్టర్ వీకేనరేష్ మాట్లాడుతూ దీపావళి పండక్కి మీరు కొనే టపాసు రెండు నిమిషాలే ఉంటుంది. కానీ మీరు కొనే టిక్కెట్టుతో మా సినిమా రెండు గంటలు ఎంటర్ టైన్ మెంట్‌ఇస్తుంది. ఈదీపావళి నైట్‌కెర్యాంప్ థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుందాం సామజవరగమన సినిమాతో ఈసంస్థ నన్ను కొత్తగా చూపించింది. ఈ చిత్రంతో మరింత వైవిధ్యమైన పాత్రతో మీ ముందుకు వచ్చే అవకాశం కల్పించింది. కిరణ్‌తో కలిసి



నటించడాన్ని ఎంజాయ్ చేశాను. ఈ తరంలో టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ జైన్స్ నానితో కె ర్యాంప్ మూవీ చేయడం హ్యాపీగా ఉంది. ఈ కాంబో నుంచి మరిన్ని కె ర్యాంప్ వంటి ఎనర్జిటిక్ మూవీస్ రావాలని కోరుకుంటున్నానని అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.కె ర్యాంప్ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఇంతభారీగా వస్తారని మేమూ ఊహించలేదు. లేకుంటే మరో ప్లేస్‌లో చేసేవాళ్లం. ఈవెంట్ లోపలికి రాలేక బయటే ఉండిపోయిన వారికి సారీ చెబుతున్నా. కొత్త స్క్రిప్ట్ చేద్దామనే ఉద్దేశంతో క అనే సినిమాను చేశాను. అయితే కె ర్యాంప్' ర్యాంప్ మాత్రం మీకోసం నా ఫ్యాన్స్ కోసం చేశాను. అప్పటికి నేను ఒక్క సినిమానే చేసినా నా రెండో చిత్రం ఎస్ఆర్ కల్యాణమండపంను థియేటర్స్ లో చూసి మీరంతా ఆదరించారు. నాపర్ ఫార్మెన్స్ ను ఎంజాయ్ చేశారు. అప్పటి నుంచి నాని నాతో మూవీ చేయాలని అడుగుతూ వచ్చారు. "కె ర్యాంప్"మూవీకి కర్త కర్మ క్రియ అన్నీ నానీనే. ఈ సినిమా చేస్తున్నంతసేపూ నా నవ్వు ఇలాగే ఉంది. దీపావళి కంటే ఈ దీపావళికి ఇంకా బాగుంటుంది నన్ను చూసి నమ్మండి. మీరు థియేటర్స్‌లో గట్టిగా నవ్వుకుంటారు.

## మాస్టర్ మహేంద్రన్ నటించిన 'వసుదేవసుతం' టీజర్ విడుదల..



బేబీ చైత్ర శ్రీ బాదర్ల, మాస్టర్ యువ్వాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్న చిత్రం 'వసుదేవసుతం'. మాస్టర్ మహేంద్రన్ హీరోగా వైకుంఠ్ బోను దర్శకత్వం వహించిన ఈ మూవీకి సంబంధించిన టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను తాజాగా ప్రముఖ హీరో సత్య దేవ్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్..ఈ కథ ధర్మానికి అడ్డొస్తే.. మేనమామ అయినా, లక్షల బంధుగణమైనా, ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణహోమానికైనా ఎదురెళ్లే ఓ యువకుడిది అంటూ ఎంతో పవర్ ఫుల్‌గా సాగిన డైలాగ్‌తో టీజర్‌ను అద్భుతంగా ప్రారంభించారు. హీరో ఎంట్రీ.. గుడి, గుప్త నిధిని చూపించినట్టుగా వేసిన షాట్స్, హీరో హీరోయిన్ల ట్రాక్.. హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో టీజర్‌ను గూస్ బంప్స్ వచ్చేలా కట్ చేశారు.మరీ ముఖ్యంగా టీజర్ చివర్లో కత్తితో నరికే సీన్ మాత్రం రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంది. ఇక ఈ టీజర్ మణిశర్మ ఇచ్చిన ఆర్ఆర్ మాత్రం నెక్స్ట్ లెవెల్లో ఉంది. ఇక పార్కింగ్ మూవీ ఫేమస్ జిజ్జు సన్నీ సినిమాటోగ్రఫీ మాత్రం అద్భుతంగా అనిపిస్తోంది. ఈటీజర్‌లోనే ఇంత గ్రాండ్‌నెస్ కనిపిస్తుందంటే.. సినిమా వేరే లెవెల్లో ఉంటుందని అర్థం అవుతోంది.రిలీజ్ డేట్‌కు సంబంధించిన వివరాల్ని త్వరలోనే చిత్రయూనిట్ ప్రకటించనుంది.తారాగణం: మాస్టర్ మహేంద్రన్, అంబికావాణి, జాన్ విజయ్, మిమ్‌గోపి, సురేష్‌చంద్ర మీనన్, ఈశ్వర్య లక్ష్మీ, తులసి, రాజీవ్ కనకాల, టార్జన్, రామరాజు, బ్రిథమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్ తదితరులు.

## "ఫెయిల్యూర్ బాయ్స్ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్



**క్రాంతి,** అవితేజ్, ప్రదీప్,సుపర్ణ, పవని ప్రధానపాత్రల్లో నటించినసినిమా ఫెయిల్యూర్ బాయ్స్. ఇతర కీలక పాత్రల్లో సుమన్, నాజర్, తనికెళ్లభరణి నటించారు .ఈ చిత్రాన్నిశ్రీ గురుదక్షిణ మూర్తి ఫిలింస్ బ్యానర్ పై వీవీఎస్ కుమార్, ధన శ్రీనివాస్ జామి, లక్ష్మీ వెంకట్ రెడ్డి నిర్మించారు. వెంకట్ రెడ్డి ఉసిరిక దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న"ఫెయిల్యూర్ బాయ్స్" సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనిర్మాత ధన శ్రీనివాస్ జామి మాట్లాడుతూ ఈ రోజు మా "ఫెయిల్యూర్ బాయ్స్" చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇచ్చేలా ఈ చిత్రాన్ని నిర్మించాం. చిత్ర నిర్మాణంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్నీ కుదిరితే ఈ నెలలోనే మా చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం. చిత్ర నిర్మాణంలో నాకు సపోర్ట్ గా నిలిచినా నా స్నేహితుడు వెంకట్ రెడ్డికి థ్యాంక్స్. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కూడా నిర్వహించబోతున్నాం. ఆ రోజు మూవీ గురించి మరింత డీటెయిల్డ్ గా మాట్లాడుతాను. అన్నాంట్రెస్టింగ్ గా ఉంది. ఈ చిత్రంలో సుమన్, నాజర్, తనికెళ్ల భరణి లాంటి మంచి నటులు ఉన్నారు. యంగ్ టీమ్ అంతా ఈ సినిమాకు వర్క్ చేసింది. "ఫెయిల్యూర్ బాయ్స్" సినిమా పెద్ద సక్సెస్ అందుకుని దర్శక నిర్మాతలకు, మూవీ టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా. అన్నారు. ఈ కార్యక్రమంలో "ఫెయిల్యూర్ బాయ్స్"చిత్రానికి పనిచేసిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొని సినిమా విజయంపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## మిత్రమండలి సెన్సార్ పూర్తి

**యు/ఎ సర్టిఫికెట్ ప్రియదర్శి,** నిహారిక ఎన్ ఎం హీరో హీరోయిన్లుగా విజయేందర్ దర్శకత్వంలో బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్తాస్వ మీడియా వర్క్స్ మీద కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్స్, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న క్రమంలో సెన్సార్ కార్యక్రమాల్ని కూడా చిత్రయూనిట్ పూర్తి చేసుకుంది.మిత్ర మండలిఆద్యంతం వినోదభరితంగా ఉందని, సమాజంలోని వ్యవస్థల మీద సున్నితంగా విమర్శనాస్త్రాల్ని సంధించారని కొనియాడారు. మిత్ర మండలిని బడ్డీ కామెడీ యాంగిల్‌లో చూపిస్తూనే మంచి సెటైరికల్ మూవీగా తెరకెక్కించారని అభినందించారు. అన్నివర్గాల ప్రేక్షకులు చూడాల్సిన చిత్రమని యు/ఎ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా మిత్ర మండలిని తెరకెక్కించారు. మిత్ర మండలిచిత్రంలో ప్రియదర్శి, నిహారిక ట్రాక్.. విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా కామెడీ హైలెట్ కానుందని అర్థం అవుతోంది. ఇక స్పెషల్ అట్రాక్షన్‌గా వెన్నెల కిషోర్,సత్య,వీటీవీ గణేష్ పాత్రలు ఉండబోతోన్నాయి. అందరినీ సర్ ప్రైజ్ చేసేందుకు బ్రహ్మానందం కూడా కనిపించబోతోన్నారు. పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన ఈ మూవీని అక్టోబర్ 16న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.నటీనటులు : ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్, విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా నటించారు, వీరిలో వెన్నెల కిషోర్, సత్య, విటివి గణేష్తదితరులు.సాంకేతిక బృందం:బ్యానర్: సప్తఅశ్వమీడియా వర్క్స్, వైరా



ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ బివివర్క్స్ బ్యానర్, బన్నీవాస్, నిర్మాతలు: కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల,స హనిర్మాత: సోమరాజు,పెన్మెట్సా, ఎగ్జిక్యూటివ్ నిర్మాత : రాజీవ్‌కుమార్, రామ సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్‌నిమాటోగ్రఫీ : సిద్ధార్థ్ ఎస్జెఎడిటింగ్ పీకే ప్రొడక్షన్ డిజైన్: గాంధీ నడికుడికర్:కాస్ట్యూమ్స్ శిల్ప టంగుటూరు పీఆర్వో : లక్ష్మీమీ వేణుగోపాల్.

## సురేశ్ ప్రొడక్షన్స్ గోదావరి సిరీస్ 'ఆనందలహరి'

సురేశ్ ప్రొడక్షన్స్ ఎస్‌పిఐ మినీ సగర్వంగా ప్రజెంట్ చేస్తున్న 'ఆనందలహరి' తూర్పు, పశ్చిమ గోదావరి నేపథ్యంలో సాగే హార్ట్ టచ్చింగ్ ఫ్యామిలీ రొమాంటిక్ కామెడీ. ప్రేమ, నవ్వులు కలిపిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోంది.

ఈ సిరీస్‌ను 13వదాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సాయి వనపల్లి రచన,దర్శకత్వంవహించగా, ప్రవీణ్ ధర్మపురి నిర్మించారు. ఈ అద్భుతమైన ప్రాజెక్ట్‌ని విజనరీ సురేశ్ దగ్గుబాటి బ్యానర్ పై సమర్పిస్తున్నారు.ద్వారాయువ దర్శకులు, రచయితలు, టెక్నీషియన్లకు తమ కథలు, ఆలోచనలను అత్యుత్తమ నాణ్యతతో రూపొందించడానికి అవకాశం కల్పించడం సురేశ్ బాబు లక్ష్యం. రామానాయుడు స్టూడియోస్‌లో ఆధునిక సదుపాయాలతో ఈ కలనునిజంచేస్తోంది.ఆనందలహరిలోఅభిషేక్ బొడ్డేపల్లి, బ్రమరాంబి కాటుటిక ప్రధానపాత్రల్లో నటించారు, జాయ్ సోలమన్ సంగీతాన్ని అందించారు.ఈట్రైలర్ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. రిఫ్రెషింగ్ టోన్,ప్లజెంట్ విజువల్స్ హ్యూమర్‌తో సిరీస్ కోసం అంచనాలను పెంచింది.

ఈదీపావళికి అక్టోబర్ 17న, ఎహెచ్ఎలో విడుదలకానున్న"ఆనందలహరి"తో గోదావరి కుటుంబాల ఆనందాలు, ఎమోషన్స్‌ని మనసారా ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండండి.



# వారికి పువ్వులంటే ఇష్టం



ఓనమ్ పండుగ సందర్భంగా మల్లెల మాలలో కొంత తలలో తురుము కుని, మరికొంత బ్యాగులో పెట్టుకుని తీసుకెళ్లినందుకు మలయాళీ నటి నవ్యా నాయర్‌కి మెల్‌బోర్న్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు బయో సెక్యూరిటీ పేరుతో రూ.1.14 లక్షలు జరిమానా విధించిన విషయం తెలిసిందే. ఆ సంగతలా ఉంచితే... స్త్రీలకు పువ్వులంటే ఎందు కంత ఇష్టం... తలలో ఎందుకు పెట్టుకుంటారు... వాటితో మనకు ఉన్న సంబంధం ఏమిటి... అన్న పరిశీలన శాస్త్రీయ కోణంలో విశ్లేషిస్తే... రంగురంగుల్లో అందంగా కనిపించే పువ్వులంటే ఎవరికి ఇష్టం ఉండదు. ఆడమగా సంబంధం లేకుండా ఆ పూరేకల సోయగానికీ పరిమళానికీ ఎవరైనా ఫిదానే. కాకపోతే స్త్రీలకీ పువ్వులకీ ఉన్న అనుబంధం ప్రకృతి పంచిన సహజ బంధం. పువ్వులు వృక్షజాతి అభివృద్ధికి ఆహారోత్పత్తికీ మానవ జీవనానికి మూలాధారం. పూత వచ్చిందంటే ఆరోగ్యకరమైన ఫలాలు వచ్చేరోజు దగ్గరలోనే ఉన్నాయని అర్థమయ్యేది. పూర్వం సంతానోత్పత్తిలో ఉన్న స్త్రీలకి పూలను అందించడం ద్వారా ప్రేమను వ్యక్తం చేసినవారు పురుషులు, తమలోని స్త్రీత్వాన్ని గుర్తించి ఆ పూల అందం, పరిమళం ఇంద్రియాలను సంతృప్తి పరచడంతో పాటు ఇచ్చిన వారి పట్ల సానుకూల దృక్పథాన్ని ప్రేమ భావనలు కలిగిస్తాయి. పూలను అందుకున్నప్పుడు మహిళల్లో ఆనందాన్ని కలిగించే డోపమైన్, సెరటోనిన్లు విడుదలవుతాయనీ; అవి ఆందోళనను తగ్గించి, నమ్మకాన్ని పెంచి, బంధాన్ని బలపరుసా రట్జెర్స్ విశ్వవిద్యాలయ పరిశోధనలు చెబుతున్నాయి. వాటిని అందుకోవడం వల్ల ఆనందం... ఆ క్షణంతోనే సమసిపోదు... దీర్ఘకాలం ఆనందంగా ఉండేటటువంటి రంగులు ఆహ్లాదాన్ని కలిగిస్తే, వాటి మృదువైన రేకల స్పర్శతో సాంత్వన లభిస్తుంది. పూలు అందుకోవడాన్ని మగవాళ్లతో తాజా మహిళలే ఎక్కువగా ఆనందిస్తారు. ఇక, దక్షి ణాది స్త్రీలే వీటిని ఎందుకు ఎక్కువగా జడ లోనో సిగలోనో పెట్టు కుంటారు ఆయుర్వేదం ప్రకారం శరీరం పంచభూత నిర్మితం. స్త్రీల శారీరక, మానసిక ఆరోగా అగ్ని(పిత్త) గుణాన్ని మార్చడానికి ఇవి దోహదపడతాయి. ముఖ్యంగా జాజులు, గులాబీల పరిమళం మనసునీ శరీరాన్నీ చల్లబరుస్తుంది. అదీగాక, దక్షి ణ వాతావరణం వేడిగానూ తేమతోనూ నిండి ఉంటుంది. కాబట్టి మల్లెల్లోని ఔషధం గ చల్లదనాన్ని అందిస్తాయి. చెమటను నియంత్రించడంలోనూ సాయపడతాయి. అంజ పెళ్లి పేరంటాలు, పండుగలు, వేడుకల్లోనే కాదు, ప్రతిరోజూ ఇక్కడి స్త్రీలు పూలు సంప్రదాయంగా వస్తోంది. □

# 'లోపాలు శరీరానికే కానీ సంకల్పానికి కాదు '



మనలోని లోపాల్ని తలచుకుంటూ కూర్చుంటే అక్కడే ఆగి పోతాం.. అదే వాటిని అధిగమించే యత్నం చేస్తే నలుగురికీ స్ఫూర్తినివ్వ గలుగుతాం.. తాజాగా ఈ విషయం మరోసారి నిరూపించి చూపించింది యువ ఆర్చర్ శీతల్ దేవి. పుట్టుక తోనే చేతులు లేకపోయినా.. సమాజంలో తనకంటూ గుర్తింపు సంపాదించు కోవాలనుకుంది. ఈ పట్టుదలే తనను విలు విద్యలో ఆరితేరేలా చేసింది. చేతుల్లేకపోతేనేం.. కాళ్లతో బాణం వేయడం నేర్చుకొని.. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొడుతోంది. ఇక ప్రస్తుతం జరుగుతోన్న పారా వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్ షిప్స్‌లో అత్యద్భుత ప్రదర్శన చేసింది శీతల్. ఈ పోటీల్లో మహిళల పాండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణంతో మెరిసిన ఈ యువ ఆర్చర్.. ప్రపంచ కాంపియన్ గా అవతరించింది. అంతేకాదు.. ఈ పోటీల్లో ఈ బంగారు పతకం సాధించిన చేతుల్లేని తొలి ఆర్చర్గా చరిత్ర సృష్టించింది. అంతకుముందు ఈ పోటీల్లో మరో మెడల్ని తన ఖాతాలో వేసుకుందామె. తన విజయాలతో నిరూపి స్తోన్న శీతల్ స్ఫూర్తి దాయక క్రీడా ప్రస్థానం తెలుసుకుందాం..

18 ఏళ్ల శీతల్ జమ్మూకశ్మీర్‌లోని ఓ మారుమూల గ్రామంలో పుట్టి పెరిగింది. ఆమెది నిరుపేద కుటుంబం. తండ్రి రైతు. తల్లి మేకల కాపరి. Phocomelia Syndrome అనే అరుదైన సమస్య రెండు చేతుల్లేకుండానే పుట్టింది శీతల్. దీంతో తమ కూతురిలోని వైకల్యాన్ని చూసి మొదట చాలా బాధపడ్డారు. అయినా తనకు ఆసక్తి ఉన్న రంగంలో సహకరించాలనుకున్నారు.



**ఫోన్ కాల్ ఇచ్చిన ఆలోచన!...** శీతల్ కూడా తన శారీరక లోపాన్ని చూసి ఎప్పుడూ అధైర్యపడలేదు. దీన్ని అధిగమించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనుకుంది. ఆ సమయం కోసం వేచి చూసింది. అనుకోకుండా ఓ రోజు స్థానిక ఆర్చరీ కోచ్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ తన జీవితాన్నే మార్చేసిందంటోంది శీతల్. అసలు నేను క్రీడల్లోకి అడుగుపెడతానని కలలో కూడా చేతులు లేకపోయినా ఆర్చరీలో రాణిస్తానని అస్సలు ఊహించలేదు వైష్ణోదేవి ష్రైన్ బోర్డ్ ఆర్చరీ అకాడమీ కోచ్ కుల్‌దీప్ సర్ ద్వారా నా గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. ఓసారి అక్కడికెళ్లాక.. ఎంతోమంది శారీరక, మానసిక లోపాలను చూశారు.. తమ లోపాల్ని గమనిస్తూ రాణించడం చూసి స్ఫూర్తి పొందా.. అప్పుడే నేనూ విలువిద్య సాధన చేయాలని నిర్ణయించుకున్నా.. అంటోందీ పారా అథ్లెట్.

**ఆరు నెలల్లోనే ఆరితేరింది !..** విల్లు ఎక్కు పెట్టి బాణం సంధించాలంటే రెండు చేతులే కీలకం! కానీ చేతుల్లేని శీతల్ కాళ్లతో ఆర్చరీ సాధన చేయాలనుకుంది. ఇలా తనలోని పట్టుదలను గుర్తించిన కోచ్ కుల్‌స్టాప్ ఆమె కోసం. ప్రత్యేక విల్లును తయారుచేయించారు. రెండు కాళ్లతో విల్లును ఎక్కు పెట్టి.. మెడ భుజం సహాయంతో బాణాన్ని సంధించడం నేర్చుకుందామె. ఇలా ఆరు నెలల్లోనే ఈ క్రీడల్లో ఆరితేరింది శీతల్. చేతుల్లేకుండా కాళ్లతో బాణం వేయడానికి ముందుగా చాలా ఇబ్బంది పడ్డా. ఈ సమయంలో కుర్దీప్ సర్ నాకు ఓ స్ఫూర్తిదాయక వీడియో చూపించారు. ప్రపంచంలోనే చేతుల్లేని తొలి ఆర్చర్‌గా గుర్తింపు పొందిన అమెరికన్ ఆర్చర్ మట్ స్టుజ్మ్యాన్ కూడా కాళ్లతో బాణం వేస్తూ కీర్తి గడించారు. ఆ వీడియో చూశాక నాలో పట్టుదల పెరిగింది. ఫలితంగా నేను ఆరు నెలల్లోనే పర్ఫెక్ట్ లక్ష్యానికి గురిపెట్టేలా బాణం వేయగల నైపుణ్యాలను సాధించ గలిగాను.. అంటోన్న ఈ యువ ఆర్చర్.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా రాణిస్తోన్న ఆరుగురు ఆర్చర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. వీరిలో శీతల్ ఒక్కరే అమ్మాయి కావడం విశేషం!

**ఆ ఘనత శీతల్‌దే !..** ప్రస్తుతం శీతల్ ఆర్చరీ క్రీడలోకి అడుగుపెట్టి దాదాపు నాలుగేళ్లు పూర్తి కావస్తోంది. ఈ సమయంలోనే అంతర్జాతీయ స్థాయిలో పోటీపడుతూ పలు పతకాలు సాధించిందామె. 2023 మేలో జరిగిన 'యూరోపి యన్ పారా ఆర్చరీ కప్'లో రజత పతకం కైవసం చేసుకున్న మరో అంతర్జాతీయ పోటీలో కాంస్యం చేజిక్కించుకుంది. ఆపై అదే ఏడాది చెక్ రిపబ్లిక్ జరిగిన 'ప్రపంచ పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్' లో పసిడి పతకమే లక్ష్యంగా బరిలోకి దింపి రెండు పాయింట్ల తేడాతో రన్నరప్ రజత పతకం తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ ఫైనల్స్ చేరిన చేతుల్లేని తొలి మహిళా ఆర్చర్ చరిత్ర శ్రీతల్. కల నెరవేరిన వే! ప్యారిస్ పారాలిపిక్స్‌లో కాంస్య పలితకం నెగ్గిన శీతల్.. పారాలింపిక్స్‌లో పతకం గెలిచిన పిన్న భారతీయ క్రీడాకారిణిగా కీర్తి గడించింది. పోటీ ఏదైనా పతకం ఖాయం అనేంత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగే ఈ యువ ఆర్చర్‌కి.. 'పారా వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్'లో పసిడి పతకం గెలవాలన్నది కల. రెండేళ్ల క్రితం తృటిలో అవకాశం చేజారి రన్నరప్‌గా నిలిచిన ఆమె.. ఈసారి మాత్రం గురి తప్పలేదు. ప్రస్తుతం దక్షిణ కొరియా వేదికగా జరుగుతోన్న ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో 'మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగం'లో స్వర్ణ పతకం చేజిక్కించుకుంది శీతల్. ఈ పోటీల్లో ఈ బంగారు పతకం సాధించిన చేతుల్లేని తొలి ఆర్చర్ గా చరిత్ర సృష్టించింది. అంతేకాదు.. ఫైనల్లో తుర్కియేకు చెందిన ప్రపంచ నెం.1 ఆర్చర్ ఓజ్నూర్ క్యూర్ గిర్డిపై 146-143 తేడాతో గెలవడం మరో విశేషం! ఇక ఈ టోర్నీలోనే కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్, కాంపౌండ్ మహిళల ఓపెన్ టీమ్.. విభాగాల్లోనూ తన సహ క్రీడాకారులతో కలిసి వరుసగా కాంస్య, రజత పతకాలు కొల్లగొట్టింది పారా ఆర్చర్. ఇలా తాజాగా ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించడంతో ప్రస్తుతం శీతల్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ప్రపంచ ఛాంపియన్గా నిలిచిన క్షణం నేనెప్పటికీ మర్చిపోలేను. లోపాలు మన శరీరానికే కానీ, సంకల్పానికి కాదు. ఆత్మవిశ్వాసం, ధైర్యం.. మనం కన్న కలలు నెరవేర్చుకోవాలంటే ఈ రెండే కీలకం! అంటూ తన మాటలతోనూ నేటి యువతలో స్ఫూర్తి నింపుతోన్న శీతల్ క్రీడా ప్రస్థానం అనన్య సామాన్యం అని చెప్పడంలో సందేహం లేదు. □

# హద్దులు తప్పనిసరి



**భార్యాభర్తల మధ్య ఎంత ప్రేమైనా ఉండొచ్చు. కానీ కొన్ని హద్దులు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. అవే భవిష్యత్తులో మీరు**

★ పెళ్లి నిశ్చయం అవగానే అతనితో ప్రతి చిన్న విషయాన్నీ చర్చించడం మొదలు పెడుతున్నారా? ఈ తీరు సరి కాదు. అప్పటికి అవి సంతోషంగా అనిపించినా తర్వాత అవే సమస్యలుగా మారతాయి. మన ఇష్టాయిష్టాలను పంచుకోవడంలో తప్పులేదు. కానీ మన గతం గురించి పూసగుచ్చినట్లు ప్రతిదీ చెబితే భవిష్యత్తులో వైవాహిక జీవితంలో సమస్యలు తలెత్తవచ్చు.

★. మీ బలహీనతలను అవతలి వారితో విపులంగా పంచుకోవడమూ మంచిది కాదు. భవిషత్తులో అవే వారికి ఆయుధాలుగా మారతాయి.

★ మనమధ్యలో డబ్బు ప్రస్తావన రాకూడదు లాంటి మాటలు పక్కనపెట్టి.. ఆర్థికాంశాల గురించి తప్పనిసరిగా మాట్లాడుకోవాలి. జీతం.. ఖర్చులు వంటివి ముందుగానే ప్రణాళిక వేసుకుంటే మంచిది. ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఇంటిపని పంచుకోవడం వంటివి చర్చించు కోవడం తప్పనిసరి. అవతలి వ్యక్తి వీటికి సానుకూలంగానే ఉన్నారా తెలుసుకోండి. లేంటే పెళ్లి తర్వాత చిన్న విషయాలు అనుకున్నవే పెద్దగా మారి ఇబ్బందులు తెచ్చిపెడతాయి. □

# కుంగుబాటుని గుర్తించడం ముఖ్యం..



**వెనుకపడుతుంటారు. అలసట, ఇతరత్రా ఆందోళనలు అన్నీ సాధారణమే అని కొట్టిపారేస్తుంటారు. కానీ, దీన్ని నియంత్రించకపోతే మరెన్నో అనారోగ్యాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు మానసిక నిపుణులు. మరి దీన్నెలా గుర్తించాలో తెలుసా?**

♦ ఒక్కోసారి కంటిమీదకు కనుకురాదు. వచ్చినా కలత నిద్రే. మరోసారి ఏడెనిమిది గంటలు నిద్రపోయాక కూడా అలసటగానే అనిపిస్తుంది. ఈ అలసట మనసునే కాదు.. శరీరాన్నీ ప్రభావితం చేస్తుంది. దాంతో ఒళ్లనొప్పులూ, తలనొప్పి వంటివి సహజంగానే ఇబ్బంది పెడతాయి. వీటికి ఒత్తిడీ, కుంగుబాటే కారణం కావొచ్చట. మరి ఇలాంటి లక్షణాలు తరచూ కనిపిస్తుంటే చికిత్స తీసుకోవడానికి వెనుకాడొద్దు!

♦ చిన్నచిన్న విషయాలు గుర్తుండవు. తెలియని దిగులు వెంటాడుతుంది. దేనిమీదా ఏకాగ్రత ఉండదు. అప్పటికప్పుడు భావోద్వేగాల్లో తీవ్ర మార్పులు కనిపిస్తాయి. చిన్న విషయానికే ఏడవడం, తీవ్రమైన కోపం, అపరాధభావం వంటివన్నీ కలగలపి కనిపిస్తుంటాయి.

♦. లైంగిక వాంఛలు తగ్గడం కూడా కుంగుబాటు లక్షణమే. మెదడులోని అనేక విషయాలు అలజడి రేపడమే ఇందుకు కారణం. ఎక్కువ రోజులు భాగస్వామికి దూరంగా ఉండటానికి యత్ని స్తుంటే ఓసారి వైద్యులను సంప్రదించడమే మేలు. □

# చింతకాయ రుచులు



చింతకాయ తింటే.. నాలుక జివ్వుమంటుంది. పళ్లు పులిసినట్లవుతాయి. వీటితో వంటలు మాత్రం కమ్మగా ఉంటాయి. వేడివేడి అన్నంలో చెంచాడు చింతకాయ పచ్చడి కలిపి తిన్నామంటే.. నాలుక్కి పండగే నాలుగు ముద్దలు ఎక్కువ లాగించేస్తాం. మీ కోసం కొన్ని చింతకా స్పెషల్స్..

## ఊరగాయ

**కావలసినవి:** చింతకాయలు పావు కిలో, పసుపు 4 చెంచాలు, మెంతులు చెంచా **తయారీ:** చింతకాయలను కడిగి తడి లేకుండా తుడవాలి. వచ్చినంత వరకూ కచ్చాపచ్చా దంచాలి. ఈ తొక్కును తడి లేని జాడీలో లేదా అనువైన పాత్రలోకి తీసివేసి బిగించాలి. మూడు రోజుల తర్వాత చేత్తో మెదుపుతూ గింజలు తీసేసి.. మరోసారి నా మెంతులను వేయించి, చల్లారాక గ్రైండ్ చేసి తొక్కులో కలపాలి. దీన్ని సీసాలో అదిమి ఏడాదికి పైగా నిలవుతుంది. తినదలచినప్పుడు కొంత నూరుకోవాలి. కప్పు చింతకాం ఎండుమిర్చి 25, వెల్లుల్లి ఒక పాయ, నూనె పావు కప్పు, ఆవాలు, మినప్పప్పు చెంచా చొప్పున, ఎండుమిర్చి 2, వెల్లుల్లి ఐదారు రెబ్బలు, కరివేపాకు రెబ్బలు, ఇంగువ చెంచా **తయారీ:** చెంచాలో మిరప కాయలను వేయించాలి. వెల్లుల్లి జోడించి గ్రైండ్ చేసి కప్పు చింతకాయ తొక్కులో కలపాలి. కడాయిలో నూనె ఆవాలు, శనగపప్పు, మినప్పప్పులను వేయించాలి. అవి కాస్త వేగాక వెల్లుల్లి, ఎండుమి ఇంగువలను ఒకదాని తర్వాత ఒకటిగా జోడించి.. మంచి వాసన వస్తుండగా సెగ తీ పూర్తిగా చల్లారనిచ్చి.. పచ్చడిలో కలపాలి. ఇక తిని ఆనందించడమే తరువాయి.



ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, మెంతులు, జీలకర్ర చొప్పున, వెల్లుల్లి రెబ్బలు 6, ఎండుమిర్చి 4, **తయారీ:** వెల్లుల్లి రెబ్బలకు పొట్టు తీయాలి. చింతకాయలను కడిగి తడి లేకుండా బరకగా గ్రైండ్ చేయాలి. అందులో పసుపు, ఉప్పు, మెంతుల పొడి, వెల్లుల్లి జతచే గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాకనిచ్చి.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, వెల్లుల్లి, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువలను ఒకదాని తర్వాత ఒకటిగా వేయాలి. వేగిన తర్వాత.. పచ్చడి వేసి కాస్త వేయించి సెగ తీయాలి. అంతే.. ఘుమ చింతకాయ పచ్చడి సిద్ధమైపోతుంది.



## చారు

**కావలసినవి:** కందిపప్పు పావు కప్పు, చింతకాయలు ఆరేడు, ఎండుమిర్చి 3, రెబ్బలు, రసంపొడి ముప్పావు చెంచా, జీలకర్ర చెంచా, బెల్లంపొడి 2 చెంచాల రుచికి కావలసినవి, నూనె ఒకటిన్నర చెంచా, ఆవాలు, మిరియాలపొడి అర చెంచాకు, ఎండుమిర్చి 1 పావు కరివే 1 చెంచా **తయారీ:** కందిపప్పు ఉడికించి, మెత్తగా మెదపాలి. కడిగిన చింతకాయలకు వెల్లుల్లి, సగం జీలకర్ర జతచేసి బరకగా దంచాలి. ముప్పావు లీటరు నీళ్లలో పప్పు, చింతకాయ పసుపు, ఉప్పు, రసంపొడి, బెల్లం వేసి మరిగించాలి. సన్న సెగ మీద ఏడెనిమిది నిమి దించాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు, మిగిలిన జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువలతో తాలింపు వేస్తే నోరూరించే రసం తయారవుతుంది.

## రోటి పచ్చడి

**కావలసినవి:** చింతకాయలు 200 గ్రాములు, ఉప్పు రుచికి సరిపడా, పసుపు చెంచా, వెల్లుల్లి ఒక పాయ, పచ్చిమిర్చి 20, వేయించిన మెంతుల పొడి అ నూనె 2 టేబుల్ స్పూన్లు,



## పులిహోర



**కావలసినవి:** బియ్యం అర కిలో, చింతకాయలు వంద గ్రాములు, ఎండుమిర్చి పచ్చిమిర్చి 8, కరివేపాకు 3 రెబ్బలు, పల్లీలు గుప్పెడు, ఉప్పు రుచికి సరిపడా చెంచాలు, అల్లం అంగుళం ముక్క, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, పసుపు చెంచా ఇంగువ **తయారీ:** అల్లం పొట్టు తీసి సన్నగా తరగాలి. కడిగి, తుడిచిన చింతకాయలను గ్రైండ్ అన్నం కొంచెం పొడిపొడిలాడేలా వండి ఉంచాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవా శనగపప్పు, మినప్పప్పు, పల్లీలను వేయించాలి. ఆవాలు చిటపటలాడుతున్నప్పుడు.. ఎం అల్లం ముక్కలు, కరివేపాకు, ఇంగువ, సాగానికి చీల్చిన పచ్చిమిర్చి, పసుపు జోడించాలి చింతకాయల పేస్టు, ఉప్పు కలపాలి. పచ్చివాసన పోయే వరకూ వేయించి దించే మిశ్రమాన్ని అన్నంలో కలిపితే.. వారెవా అనిపించే పులిహోర సిద్ధం.

## బెండకాయలతో...

**కావలసినవి:** చింతకాయలు 8, బెండకాయలు పావుకిలో, ఉల్లిపాయలు నూనె 3 చెంచాలు, ఉప్పు రుచికి తగినంత, కారం చెంచా, పసుపు పోపు దినుసులు **తయారీ:** బెండకాయలను కాస్త పెద్ద ముక్కలుగా కోయాలి. చింతకాయలను ఉల్లి, పచ్చిమిర్చిలను గ్రైండ్ చేయాలి. కడాయిలో సగం నూనె వేడిచేసి.. ఉల్లి ముక్కలు, నూరిన చింత కాయలు, కారం, ఉప్పు, పసుపు జతచేసి. సన్న సెగ మీ ముక్కలు మెత్తబడ్డాక.. మిగిలిన నూనెతో తాలింపు వేయాలి. ఇది ప్రత్యేకంగా నచ్చేస్తుంది.



# ప్రభువుకు మహిమకరంగా సేవ చేయాలి..



'అంతట పేతురు-వెండి బంగారములు నాయొద్ద లేవుగాని నాకు కలిగినదే నీకిచ్చుచున్నాను, నజరేయుడైన యేసుక్రీస్తు నామమున నడువుమని చెప్పి..వాని కుడిచెయ్యి పట్టుకొని లేవనెత్తెను, వెంటనే వాని పాదములును చీలమండలును బలము పొందెను' (అపొస్తలుల కార్యములు 3:6,7). పేతురు యేసుక్రీస్తు 12మంది శిష్యులలో ఒకడు. అంతేకాదు ప్రభువుకు మరింత సమీపంగా ఉన్న ముగ్గురు శిష్యులలో పేతురు కూడా ఒకరు. ప్రభువు జీవించినంత కాలం ఈ 12మంది శిష్యుల్లో ఎన్నో లోపాలు ఉన్నాయి. సంకుచితమైన మనసు, అనుమానపు మనసు, స్వార్థం ఇలా మనందరిలో లాగానే వీరిలో కూడా ఉన్నాయి. కానీ యేసుక్రీస్తు మరణించి, పునరుత్థానమైన తర్వాత వీరిలో గొప్ప మార్పు వచ్చింది. ఆ మార్పు ఎంతలా అంటే చివరికి ప్రభువు సువార్త నిమిత్తం హతసాక్షులుగా మారారు. పేతురు, యోహానులు దేవాలయంలోకి ప్రార్థన చేసుకునేం దుకు వెళ్తున్న సమయంలో పుట్టినది మొదలు కొని కుంటివాడైన ఒక వ్యక్తి దేవాలయం బయట భిక్షం అడుక్కునేవాడు. ఈ వ్యక్తి పేతురు, యోహానులను చూచి భిక్షమడిగాడు. కానీ వారివద్ద డబ్బు, వెండి, బంగారం లేదు. ఆ కుంటివాడికి భిక్షం కంటే స్వస్థత అవసరమని, రక్షణ అవసరమని పేతురు, యోహానులు గ్రహిం చారు. వారిలో పరిశుద్ధాత్మ కార్యం వల్ల, ఆ వ్యక్తిని పేతురు యేసుక్రీస్తు నామంలో స్వస్థపరిచాడు. వెంటనే అక్కడ ఉన్న ప్రజలంతా విస్మయంతో పేతురువైపు, కుంటివాడుగా ఉండి, బాగుపడి, నడుస్తున్న అతనివైపు చూస్తున్నారు. వెంటనే పేతురు ధైర్యంగా మీరెందు మా సొంతశక్తితో ఆయనకు స్వస్థత ఇచ్చామని చూస్తున్నారు..కానేకాదు. యేసుక్రీస్తు ద్వారానే ఇతడు బాగయ్యాడు. మీరు సిలువ వేసి, హతమార్చిన నజరేయుడైన యేసుక్రీస్తు నామం వల్లే ఇతడు బాగుపడ్డాడు. 'రక్షణ' యేసుక్రీస్తు నామంలో తప్ప మరెవరీ నామంలో లేదని బోధించాడు. అతడి బోధ విన్న దాదాపు ఐదు వేలమంది పురుషులు దేవుడిని విశ్వసిం చారు. వీరేకాదు ఇంకా అనేకులు ప్రభువు ను నమ్మారు. ఇంత గొప్ప ఉజ్జీవ ప్రసంగం పేతురు చేశారు. దేవుడి నామంలో స్వస్థపరిచాడు. పేతురు తన సేవాపరిచర్య అంతా దేవుడికి మహిమకరంగా చేశారు. ఎక్కడా ప్రభువు మహిమను దొంగలించ లేదు. నేడు పేతురులాంటి సేవను చేస్తున్నామా? అని ప్రతిఒక్కరూ ప్రశ్నించుకోవాలి. అపొస్తలుడైన పౌలు కూడా ఇదే కదా చెబుతున్నది.. మీరేమీ చేసినా దేవుడికి మహిమకరంగా చేయమన్నాడు. మనం ఏదీ చేసినా అదంతా దేవుడికే మహిమ, ఘనత చెందేలా చేయాలి. అప్పుడే మన సేవ ఫలిస్తుంది. మనకు ఏ తలాంతు ఉన్నా అదంతా ప్రభువు కృపనుబట్టి మాత్రమేనని గ్రహించి, కేవలం దేవుడే మహిమ పొందేలా చేయాలి. లేకపోతే ఆ సేవ ఎంతోకాలం నిలవదు. దేవుడికి మహిమ లేని పరిచర్య అది ఎంత గొప్పదైనా, ప్రజలకు మేలు జరుగుతుందేమో కానీ దేవుడు ఆ పరిచర్యను త్రోసివేస్తాడు. జాగ్రత్త సుమా!

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# ఆభరణాలు మన్నాలంటే ..



✻ అభరణా లను జాగ్రత్తగా వాడుకుంటే చాలాకాలం వస్తాయి. నగలను కొనేటప్పుడు వాటి ధరగూర్చి కాక నాణ్యతగూర్చి ఆలోచించడం ముఖ్యం. ✻ అభరణా లకు మురికి పడితే పాలిష్ పెట్టించ కూడదు. పాలిష్ పెట్టించ కుండా రెండు చెమ్చాల సర్ఫ్‌ఫౌడర్‌ను అరగ్లాసు నీటిలో కరిగించి ఆ మిశ్ర మంలలో బంగారు నగలను ఒక రాత్రంతా నాననిచ్చి తెల్లవారాక బ్రష్‌తో శుభ్రపరుచుకోవాలి. ఆ పిదప క్లాత్‌తో తుడిచి పెట్టుకోవాలి. □

## మెర్సిడిస్ వరల్డ్ గోల్ఫ్ ఫైనల్‌లో

# మెరిసిన ఇండియా టీమ్!



**స్టట్‌గార్ట్, అక్టోబరు 11:** జర్మనీలోని స్టట్‌గార్ట్‌లో జరిగిన మెర్సిడెస్ గోల్ఫ్ ట్రోఫీ వరల్డ్ ఫైనల్ 2025లో టీమ్ ఇండియా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది, ప్రపంచ గోల్ఫ్ కప్ నెట్ విభాగంలో మొత్తం 163 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది, చైనీస్ తైపీ (156) మరియు స్వీడన్ (155) కంటే ముందుంది. భారత జట్టులో విజయ్ కుమార్ రెడ్డి (హైదరాబాద్), ఈశ్వర్ కాప్సి (బెంగళూరు) మరియు శివ్ అగర్వాల్ (ముంబై) మెర్సిడెస్‌బెంజ్ యొక్క ప్రధాన అమెచ్యూర్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌కు నిలయమైన 'డెర్ ఓష్‌బర్గ్‌హాఫ్'లో ఆకట్టుకున్నారు. రెండురౌండ్లలోను విజయ్‌కుమార్‌రెడ్డి 43 మరియు 34 పాయింట్లు సాధించగా, కాప్సి 38 మరియు 34, మరియు అగర్వాల్ 23 మరియు 48 పాయింట్లు సాధించి భారతదేశం మొట్టమొదటి మెర్సిడెస్ గోల్ఫ్ ట్రోఫీ వరల్డ్ ఫైనల్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ప్రతి ఏటా జరిగే వరల్డ్ ఫైనల్ 60 కి పైగా దేశాలలో జరిగే మెర్సిడెస్ ట్రోఫీ జాతీయ క్వాలిఫైయర్‌ల నుండి విజేతలను ఎంపికచేస్తుంది, ఇందులో మూడు రౌండ్లలో దాదాపు 200 మంది గోల్ఫర్లు పోటీ పడుతున్నారు. 2025 ఈవెంట్ మెర్సిడెస్‌బెంజ్ గ్లోబల్ కార్యాలయం స్టట్‌గార్ట్‌లో జరిగే ట్రోఫీ ఇండియా సిరీస్ యొక్క దీర్ఘకాలిక విజయలక్ష్యాన్ని సాధించింది, ఈ సిరీస్ ప్రతి ఏటా 60వేల మందికి పైగా భారతీయ గోల్ఫర్లను ఆకర్షిస్తుంది. భారతదేశ జాతీయ ఫైనల్స్ విజేతలు 'స్టట్‌గార్ట్'లో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందారు, అయితే ప్రత్యేకమైన"డ్రైవ్ టు మేజర్" పోటీ మరోసారి ఒక విశిష్ట భారతీయుడికి ది ఓపెన్ ఛాంపియన్‌షిప్‌కు వీఐపీ ట్రిప్‌ను అందించింది. ఈ సంవత్సరం "డ్రైవ్ టు మేజర్" విజేత కేదార్ థాపర్, గత జూలైలో ఉత్తర ఐర్లాండ్‌లోని రాయల్ పోర్ట్‌రష్‌లో జరిగిన ది ఓపెన్ ఛాంపియన్‌షిప్‌కు అన్ని ఖర్చులతో కూడిన ట్రిప్‌ను సంపాదించాడు, అక్కడ అతను ది ఓపెన్ యొక్క అధికారిక ఆటోమొబైల్ భాగస్వామి అయిన మెర్సిడెస్‌బెంజ్ అతిథిగా చివరి రౌండ్ తర్వాత ఛాంపియన్ షిప్ వేదికలో ఫైనల్స్ ఆడాడు. మెర్సిడెస్‌బెంజ్ యొక్క ప్రపంచ ప్రధాన కార్యాలయం స్టట్‌గార్ట్‌లో ఏటా జరిగే మెర్సిడెస్‌ట్రోఫీ వరల్డ్ ఫైనల్ అమెచ్యూర్ గోల్ఫ్ యొక్క అత్యంత ప్రతిష్టాత్మక ఈవెంట్‌లలో ఒకటిగా ఉంది ఈ పోటీ వివిధ దేశాలమధ్య స్నేహం మరియు బ్రాండ్ ప్రభావిత ఆతిథ్యరంగాన్ని కలపడం లక్ష్యాలుగా ఈ ఈవెంట్ జరుగుతుంటుంది.



## జోహోర్ కప్ తొలి మ్యాచ్‌లో భారత్ విక్టరీ

**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025, తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ గ్రేట్ బ్రిటన్‌ను భారత్ ఓడించింది. మలేషియాలోని జోహోర్ బహ్రులో శనివారం జరిగిన 2025 సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్‌లో భారత పురుషుల హాకీ జట్టు గ్రేట్ బ్రిటన్‌తో తన ప్రచారాన్ని ప్రారంభించింది. గ్రేట్ బ్రిటన్ జట్టుతో తలపడిన భారత్ 3-2 తేడాతో ఉత్కంఠభరితమైన విజయంతో టోర్నమెంట్‌ను ప్రారంభించింది. 22వ నిముషంలో భారత్ ఎదురుదాడిలో మ్యాచ్‌లో తన తొలి గోల్ సాధించింది. 26వ నిముషంలో గ్రేట్ బ్రిటన్ భారత రక్షణకు వ్యతిరేకంగా 3 ఆన్ 2 పరిస్థితిలో 1-1తో సమం చేసింది.



మొదటి క్వార్టర్ తర్వాత రెండు జట్లు గోల్ కోసం చేసిన గట్టి ప్రయత్నంలో రెండు గోల్స్ వచ్చాయి. రెండవ అర్ధభాగంలో భారత్ ఆటను తన ఆధీనంలో ఉంచుకుంటూ బ్రిటిష్ రక్షణ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చింది. ఆట ముగియడానికి కేవలం 2 సెకన్లు మాత్రమే ఉండగా, భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. 45వ నిముషంలో కెప్టెన్ రోహిత్ గోల్ కీపర్ శక్తివంతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో సులభంగా గోల్‌గా మార్చాడు. అయితే 46వ నిముషంలో బ్రిటన్ చివరి క్వార్టర్ మొదటి నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌తో స్కోరును 2-2గా సమం చేసింది. 52వ నిముషంలో రోహిత్ తన రెండవ పెనాల్టీ కార్నర్ కన్వర్షన్ తర్వాత రెండు గోల్స్ పూర్తి చేసి భారత్‌ను తిరిగి 3-2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లి బ్రిటన్‌ను ఓడించాడు.




# కంగారూలకు టెర్రర్

## ఆస్ట్రేలియాను హారెత్తించిన బౌలర్లు

**న్యూఢిల్లీ:** టీమిండియా, ఆస్ట్రేలియా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఈ నెల 19న పెర్త్‌లో ప్రారంభమవుతుంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైంది. గత సిరీస్‌లో టీమ్ ఇండియాలో భాగమై ఆసిస్‌ను బెంబేలెత్తించిన ప్లేయర్లలో ఇద్దరికి ఈసారి చోటు దక్కలేదు. గత ఆస్ట్రేలియాతో జరిగిన చివరి ఐదు వన్డే సిరీస్‌లను పరిశీలిస్తే భారత్ బౌలర్లు కంగారులను కంగారెత్తించారు. ఈ బౌలర్లను చూస్తే ఆస్ట్రేలియాకు టెర్రర్.

అయితే ఇప్పుడు జరగనున్న మ్యాచ్‌కు టీమిండియాలో వారిలో ఇద్దరికి భారత్ సెలక్టర్లు స్థానం కల్పించకపోవడం విశేషం. గత సిరీస్‌లలో ఆసిస్‌ను హారెత్తించిన 5 గురు భారత్ బౌలర్లలో 2019లో ఆస్ట్రేలియాతో జరిగిన స్వదేశీ వన్డే సిరీస్‌లో కుల్దీప్ యాదవ్ భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఉన్నాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అతను 10 వికెట్లు పడగొట్టాడు. రెండవ, మూడవ వన్డేల్లో అతను మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-2తో గెలుచుకున్నప్పటికీ, కుల్దీప్ ఖచ్చితంగా ఆసీస్‌కు కష్టకాలం ఇచ్చాడు. అలాగే 2020లో ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో మహ్మద్ షమీ అద్భుతంగా రాణించాడు. ఈ సిరీస్‌లో షమీ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు, మూడు మ్యాచ్‌ల్లో మొత్తం 7 వికెట్లు పడగొట్టాడు. అందుకే టీం ఇండియా ఆస్ట్రేలియాను 2-1 తేడాతో ఓడించింది. 2021లో భారత్, ఆస్ట్రేలియా మూడు వన్డేలు కూడా ఆడాయి. ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో గెలుచుకుంది. సిరీస్‌ను గెలవడంలో టీమ్ ఇండియా విఫలమైనప్పటికీ, మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా ఆసీస్‌కు కష్టకాలం ఇచ్చారు. ఇందులో ఇద్దరు బౌలర్లు చెరో 4 వికెట్లు పడగొట్టారు. శార్దూల్ ఠాకూర్ కూడా 3 వికెట్లు పడగొట్టాడు. అలాగే 2022లో భారత్, ఆస్ట్రేలియా జట్లు మూడు వన్డేల సిరీస్ కూడా ఆడాయి.

ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో గెలుచుకుంది. టీమ్ ఇండియా తరఫున మహమ్మద్ సిరాజ్ అసాధారణ ప్రదర్శన ఇచ్చి 5 వికెట్లు తీసుకుని అత్యధిక వికెట్లు పడగొట్టిన ప్లేయర్‌గా ఉన్నాడు. 2023 ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌కు ముందు, భారత్, ఆస్ట్రేలియా మూడు వన్డేల సిరీస్ ఆడాయి. ఈ సిరీస్‌లో భారత్ ఆస్ట్రేలియాను 2-1 తేడాతో ఓడించింది. భారత్ విజయంలో మహమ్మద్ షమీ కీలక పాత్ర పోషించాడు. భారత్ తరఫున షమీ కేవలం రెండు మ్యాచ్ ల్లోనే 6 వికెట్లు పడగొట్టాడు.

## భారత్ 518తో ఇన్నింగ్స్ డిక్లేర్

### 378 రన్స్‌తో వెనుకబడిన వెస్టిండీస్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో రెండో టెస్టులో టీమిండియా పట్టు బిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో భారీ స్కోర్ చేసిన భారత్ ఆ తర్వాత బౌలింగ్‌లో చెలరేగింది. రవీంద్ర జడేజా (3/98) తీన్మార్ బౌలింగ్‌తో రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 43 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది. ఓపెనర్లు త్యాగనరైన్ చంద్రపాల్ (67 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 34), జాన్ కాంప్‌బెల్ (25 బంతుల్లో 2 ఫోర్లతో 10) మరోసారి నిరాశపర్చగా, అలిక్ అథనాజే (84 బంతుల్లో 5 ఫోర్లతో 41), షైహోప్ (46 బంతుల్లో 5 ఫోర్లతో 31 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. రోస్టన్ ఛేజ్ (0) డకౌట్ కాగా, టెవిన్ ఇమ్లాచ్ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో జడేజా మూడు వికెట్లు, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టాడు. అంతకు ముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 134.2 ఓవర్లలో 5 వికెట్లకు 518 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది.



ఓపెనర్ యశస్వి జైస్వాల్ (258 బంతుల్లో 22 ఫోర్లతో 175), శుభ్‌మన్ గిల్ (196 బంతుల్లో 2 సిక్స్‌లతో 16 ఫోర్లతో 129 నాటౌట్) శతకాలతో చెలరేగారు. నితీష్ కుమార్ (43), ధ్రువ్ జురెల్ (44), కేఎల్ రాహుల్ (38) హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. వెస్టిండీస్ బౌలర్లలో జొమెల్ వారికన్ 3, రోస్టన్ ఛేజ్ ఓవికెట్ పడగొట్టారు. కాగా, రెండోరోజూ టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. 318/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. రెండో ఓవర్‌లో అనవసర పరుగుకు యత్నించి యశస్వి జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 74 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన నితీష్‌తో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో గిల్ 95 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మరో ఎండ్‌లో నితీష్ దూకుడుగా ఆడే యత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగి హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా, మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడిన గిల్ తొలి సెషన్‌ను ముగించాడు. దాంతో టీమిండియా 427/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.



## జీఎస్టీ తగ్గింపుతో ట్రాక్టర్ సేల్స్‌జోరు

**ముంబయి, అక్టోబరు 11:** జీఎస్టీ తగ్గింపు, పండుగ సీజన్ నేపథ్యంలో పెరిగిన డిమాండ్‌తో సెప్టెంబర్ ట్రాక్టర్ల అమ్మకాలు రికార్డులను సృష్టించాయి. ట్రాక్టర్, మెకనైజేషన్ అసోసియేషన్ డేటా ప్రకారం సెప్టెంబర్‌లో దేశీయ మార్కెట్లో 1.46లక్షల కంటే ఎక్కువ ట్రాక్టర్లు అమ్ముడయ్యాయి. గతంలో అత్యధిక సంఖ్య అక్టోబర్ 2024లో 1,44,675 ట్రాక్టర్లు అమ్ముడయ్యాయి. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ రేట్లను తగ్గించింది. తాజాగా ట్రాక్టర్లపై జీఎస్టీని 12 శాతం నుంచి కేవలం 5శాతానికి తగ్గించారు. 1,800 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన రోడ్ ట్రాక్టర్లపై పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య మొత్తం 7.61 లక్షల ట్రాక్టర్లు అమ్ముడయ్యాయి. ఇది గత సంవత్సరం ఇదే కాలం కంటే 20 శాతం ఎక్కువ. దీపావళి సీజన్‌లో డిమాండ్ మరింత పెరుగుతుందని, వార్షికఅమ్మకాలు మొదటిసారిగా 10లక్షల యూనిట్లను దాటవచ్చని నిపుణులు భావిస్తున్నారు. భారత్‌లో అతిపెద్ద ట్రాక్టర్ తయారీదారు మహీంద్రా అండ్ మహీంద్రా, సెప్టెంబర్‌లో డీలర్‌షిప్‌లకు సరఫరాలను 50 శాతం పెంచింది. ఎంఅండ్‌ఎం వ్యవసాయ పరికరాల వ్యాపార అధ్యక్షుడు విజయ్ నక్రా మాట్లాడుతూ.. జీఎస్టీ రేటు తగ్గింపు నవరాత్రి తొమ్మిది రోజుల్లో అమ్మకాల్లో గణనీయమైన పెరుగుదలకు దారి తీసింది. ఎస్కార్ట్స్ కుబోటా అమ్మకాలు సెప్టెంబర్‌లో 49 శాతం పెరిగి 17,800 యూనిట్లకు చేరుకున్నాయి. ఇది కంపెనీ చరిత్రలో అత్యుత్తమ నెలగా నిలిచింది. సోనాలికా ట్రాక్టర్స్ దాదాపు 27,800 ట్రాక్టర్లను విక్రయించింది.

## గూగుల్‌పేతో చెల్లింపుల

# రక్షణ లేదు!

### టెలికాం సెక్రటరీ నీరజ్ మిట్టల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** గ్లోబల్ పేమెంట్ అగ్రిగేటర్ గూగుల్‌పే ఇప్పటివరకూ ఫ్రాడ్‌రిస్క్ ఇండికేటర్ (ఎఫ్‌ఆర్‌ఐ)వ్యవస్థలోకి రాలేదని టెలికాం సెక్రటరీ నీరజ్ మిట్టల్ అన్నారు. దీనితో గూగుల్‌పేలో జరుగుతున్న లావాదేవీలకు ఎలాంటి రక్షణ లేదని అన్నారు. ఎఫ్‌ఆర్‌ఐలో చేరకపోవడంవల్ల మూడోవంతు యుపిఐ చెల్లింపులు సురక్షితంగా లేవని అన్నారు. సైబర్‌మోసాల కట్టడికోసం టెలికాం డాట్ ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్‌ఆర్‌ఐ)ను ప్రవేశపెట్టింది. బ్యాంకులు, యుపిఐ సర్వీస్‌ప్రొవైడర్లు ఆర్థికసంస్థలతోముందుగానే ఉన్న సమాచారం ఆధారంగా పనిచేస్తుంది. డిజిటల్ చెల్లింపులను ఏదైనా మొబైల్ నంబరుకు చేసే సమయంలో ఈ టూల్ తనిఖీచేస్తుంది. ఏదైన మొబైల్‌నంబరువల్ల ఆర్థికమోసం జరిగేందుకు ఎంత అవకాశం ఉందో కూడా ఎఫ్‌ఆర్‌ఐ మీడియం, హై, వెరీ హై అని వర్గీకరించి తెలియచేస్తుంది.

## క్రిప్టో మార్కెట్‌లో 7 లక్షల కోట్ల డాలర్లు ఆవిరి!

### చైనాపై 100% సుంకాలు వేస్తామన్న ట్రంప్ ప్రకటన కీలకం



**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తీసుకున్న కొత్తనిర్ణయం క్రిప్టో మార్కెట్‌ను సమూలంగా వణికించింది. క్రిప్టోమార్కెట్‌లో ఏకంగా రెండు లక్షలకోట్ల డాలర్లు ఆవిరి అయ్యాయి. చైనాపై 100శాతం సుంకాలనుప్రకటించడమే క్రిప్టోమార్కెట్‌పై ఒత్తిడిని పెంచింది. బిట్‌కాయిన్, ఎథెరియం, డాగ్‌కాయిన్‌వరకూ క్రిప్టో ఆస్తులన్నీ దెబ్బకు క్షీణించాయి. ఇవేకాకుండాఅమెరికా స్టాక్ మార్కెట్‌కూడా గణనీయమైన నష్టాలు ఎదుర్కొంది. టెస్లా, అమెజాన్‌స్టాక్‌లు ఒత్తిడికి లోనయ్యాయి. ట్రంప్ నిర్ణయం ప్రపంచ వ్యాప్తంగా 1.6 మిలియన్లకుపైగా క్రిప్టో పెట్టుబడిదారులను ప్రభావితంచేసింది. ఆయన నిర్ణయం 19 బిలియన్‌డాలర్లకుపైగాక్రిప్టో షేర్లను తుడిచిపెట్టింది. ఒక గంటలోనే ఏడు బిలియన్ డాలర్లకుపైగా వాటాలు తుడిచిపెట్టుకుపోఆయయి. డిజిటల్ ఆస్తుల చరిత్రలో అతిపెద్ద అమ్మకంగా రికార్డు అయింది. క్రిప్టో మారెనకట్‌క్యాప్ 560 బిలియన్ డాలర్లుగా చెపుతున్నాయి. క్రిప్టో, స్టాక్ మార్కెట్లను కలిపితే పెట్టుబడిదారులు ఒక్కరోజులో సుమారు రెండు ట్రిలియన్ డాలర్లు లేదా 177.44 లక్షలకోట్లు కోల్పోయారని బిజినెస్ అనలిస్టులు చెపుతున్నారు. ట్రంప్ ప్రకటించిన ట్రేడింగ్ మొదటి గంటలోనే ఏడు బిలియన్ డాలర్లకుపైగా పొజిషన్లు స్క్వేర్‌చేసారని తేలింది. మల్టీకాయిన్ క్యాపిటల్ ప్రధాన వ్యాపారి బ్రియాన్ స్టుగాట్స్ ఎక్స్ఛేంజిలు డీఫై ప్లాట్‌ఫామ్‌ల ద్వారా భయాందోళనలు రావడంతో మొత్తం మార్కెట్‌నష్టాలు 30 బిలియన్ డాలర్లకు మించే ఉంటుందని అంచనావేస్తున్నారు.



**వాణిజ్యం**

## డీమార్ట్ రాబడులు రూ.16,218 కోట్లు!

**ముంబయి,అక్టోబరు 11:** ప్రముఖ రిటైల్ సంస్థ డీమార్ట్ (అవెన్యూ సూపర్‌మార్ట్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను శనివారం ప్రకటించింది. ఈ ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. కంపెనీ ఆదాయం గణనీయంగా పెరిగినప్పటికీ, నికర లాభం గత త్రైమాసికంతో పోలిస్తే తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో డీమార్ట్ రూ. 746.55 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇది గత త్రైమాసికంలో నమోదైన రూ. 829.73 కోట్లతో పోలిస్తే సుమారు 10 శాతం తక్కువ. అయితే, గతేడాది ఇదే సమయంతో (రూ. 710.37 కోట్లు) పోల్చినప్పుడు లాభం 5 శాతం పెరగడం గమనార్హం. మరోవైపు, కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం భారీగా పెరిగింది. ఈ త్రైమాసికంలో ఆదాయం రూ. 16,218.79 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. అదేవిధంగా, గత త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం దాదాపు 2 శాతం వృద్ధి చెందింది. ఆదాయం పెరిగినా లాభం తగ్గడానికి ప్రధాన కారణంగా ఖర్చులు పెరగడమేనని తెలుస్తోంది. ఈ త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఖర్చులు రూ. 15,248.89 కోట్లకు చేరాయి. ఇది గతేడాదితో పోలిస్తే 16 శాతం, గత త్రైమాసికంతో పోలిస్తే 2.5 శాతం ఎక్కువ. దీంతో కంపెనీ లాభదాయకతపై ప్రభావం పడింది. ఎబిటా (వడ్డీ, పన్నులు, తరుగుదల ముందు లాభం) మార్జిన్ గతేడాది 7.9 శాతం ఉండగా, ఈసారి 7.6 శాతానికి తగ్గింది. ఈ ఫలితాలపై అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈఓ అన్షుల్ అసావా మాట్లాడుతూ, ఈ త్రైమాసికంలో మా ఆదాయం 15.4 శాతం పెరిగింది. నికర లాభం 5.1 శాతం వృద్ధి చెందింది. ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లలో చేసిన మార్పుల ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేశాం. ఈ త్రైమాసికంలో 8 కొత్త స్టోర్లను ప్రారంభించాం. దీంతో సెప్టెంబర్ 30 నాటికి మా మొత్తం స్టోర్ల సంఖ్య 432కు చేరిందని వివరించారు.



## రిలయన్స్ పవర్ సిఎఫ్‌ఒను


# అరెస్టు చేసిన ఇడి!

**ముంబయి, అక్టోబరు 11:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. రూ.68 కోట్ల నకిలీ బ్యాంక్ గ్యారెంటీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రిలయన్స్ పవర్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) అశోక్ కుమార్ పాల్‌ను శనివారం అరెస్ట్ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) నిబంధనల కింద ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఏడేళ్లుగా రిలయన్స్ పవర్‌లో సీఎఫ్‌వోగా పనిచేస్తున్న అశోక్ పాల్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)కి రూ.68 కోట్లకు పైగా విలువైన నకిలీ బ్యాంక్ గ్యారెంటీని సమర్పించారని ఈడీ ఆరోపించింది. ఈ నకిలీ గ్యారెంటీలను నిజమైనవిగా నమ్మించేందుకు, ఎస్‌బీఐ, పీఎన్‌బీ వంటి ప్రముఖ బ్యాంకుల పేర్లను పోలిన ఫేక్ ఈమెయిల్ డొమైన్లను సృష్టించి ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా, ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో అసలు ఉనికిలోనే లేని ఓ విదేశీ బ్యాంక్ బ్రాంచ్ నుంచి కూడా గ్యారెంటీ పత్రాలు సృష్టించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మోసంలో ఒడిశాకు చెందిన బిస్వాల్ ట్రేడ్‌లింక్ అనే చిన్న కంపెనీ కీలక పాత్ర పోషించినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. కేవలం కాగితాలపై మాత్రమే ఉన్న ఈ కంపెనీ ద్వారానే రిలయన్స్ పవర్ తరఫున నకిలీ గ్యారెంటీలను ఏర్పాటు చేసినట్లు తేలింది. ఈ ఆరోపణలకు సంబంధించి బిస్వాల్ కంపెనీ డైరెక్టర్‌ను గత ఆగస్టులోనే అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17 వేల కోట్లకు పైగా బ్యాంకు రుణాలను దారి మళ్లించాయన్న ఆరోపణలపై ఈడీ ఇప్పటికే విస్తృత దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా యస్ బ్యాంక్ నుంచి పొందిన రూ.3 వేల కోట్ల రుణం, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించిన రూ.14వేల కోట్ల మోసంపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసుల దర్యాప్తులో భాగంగానే తాజా అరెస్ట్ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో ఈడీ అధికారులు అనిల్ అంబానీని కూడా విచారించిన విషయం తెలిసిందే.

# ఎక్ఛేంజిల్లో 'టాటాసన్స్' లిస్టింగ్‌చేయండి

### -షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 11:** టాటాగ్రూప్‌ప్రధాన సంస్థ టాటాసన్స్‌ను స్టాక్ మార్కెట్‌లో నమోదుచేయాలంటూ ఎస్పీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ స్పష్టంచేసారు. టాటాసన్స్‌లో 66శాతం వాటా కలిగిన టాటా ట్రస్ట్ సభ్యుల వివాదాలనేపథ్యంలోమరోమారు మిస్త్రీ ఈ వ్యాఖ్యలుచేసారు. టాటాసన్స్‌లో 18.37శాతం వాటాతో షాపూర్జీ పల్లోంజీ కుటుంబం అతిపెద్ద మైనార్టీ వాటాదారుగా ఉంది. ఆర్బీఐ నిర్దేశించిన ఎన్‌బిఎఫ్‌సి అప్పర్‌లేయర్ వర్గీకరణ కింద టాటాసన్స్‌ను గతనెల 30లోగా స్టాక్ ఎక్ఛేంజిల్లో నమోదుచేయాల్సి ఉందని మిస్త్రీ అన్నారు. నిబంధనలు పాటించి ఎక్స్ఛేంజిల్లో నమోదుచేయాలని కోరారు. పారదర్శకత పరంగా ఈ ప్రతిష్టాత్మక సంస్థ తన వ్యవస్థాపకుడు జెంషెడ్‌జీ టాటాస్ఫూర్తిని కొనసాగిస్తుందనే ఆశిస్తున్నట్లు షాపూర్జీ అన్నారు. ఉద్యోగులు, ఇన్వెస్టర్లు, ప్రజలు ఇలా అన్ని వర్గాలకు ఈసంస్థపై ఉన్న విశ్వాసాన్ని కొనసాగిస్తుందనే అనుకుంటున్నామని పేర్కొన్నారు. సమానత్వం న్యాయం ప్రజాప్రయోజన సూత్రాల ఆధారంగా ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంటుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. అనుకున్నట్లే బోర్డు సమావేశం జరిగినా వివాదాస్పద అంశాలేవీ చర్చకురాలేదు. బోర్డు నియామకాలు, పాలన అంశాలజోలికి పోలేదు.



ఆసుపత్రులు, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులు వంటి ధాతృత్వఅంశాలపైనే నివేదికలు రాగా వాటిపై చర్చించారు. మెహ్లీ మిస్త్రీ ఆధ్వర్యంలోని నలుగురు ట్రస్టీలు, నియోల్ టాటా వర్గానికి మధ్య పొరపొచ్చాలు వచ్చి టాటాసన్స్‌ను విభజించాలన్న స్థాయికి వివాదాలు చేరుకున్న సంగతి తెలిసిందే.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.